
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 306
గురువారం 20-7-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



భారత్‌ను గెలిపించిన జెమీమా
రెండో వన్డేలో బంగ్లాదేశ్‌పై 108 పరుగుల తేడాతో ఘన విజయం
- 12లో


బ్రిటన్‌లో టాటా గిగా ఫ్యాక్టరీ
ఈవీ బ్యాటరీల తయారీ కోసం రూ.42,500 కోట్ల పెట్టుబడి
- 13లో


అనుమానిత ఉగ్రవాదుల అరెస్టు
బెంగళూరులో ఐదుగురు అనుమానిత ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు. బాంబు పేలుళ్లకు వీరు కుట్ర పన్నినట్లు చెప్పారు.
వివరాలు 6లో ▸


ఉత్తరాఖండ్‌లో 15 మంది మృతి
ఉత్తరాఖండ్‌లోని మురుగు నీటి శుద్ధి కర్మాగారంలో ట్రాన్స్‌ఫార్మర్ పేలడం వల్ల విద్యుదాఘాతంతో 15 మంది మృతి చెందారు.
వివరాలు 6లో ▸


సింగపూర్ పాస్‌పోర్టు పవర్‌ఫుల్!
ప్రపంచంలో శక్తిమంతమైన పాస్‌పోర్టు కలిగిన దేశంగా సింగపూర్ తొలి స్థానంలో నిలవగా.. భారత్ 80వ ర్యాంక్ దక్కించుకుంది.
వివరాలు 6లో ▸


ఇది 'వజ్రాల వ్యాపార గని'
గుజరాత్‌లోని సూరత్‌లో ఒకేసారి 65 వేల మందికి పైగా పనిచేసేందుకు వీలుగా అధునాతన భవంతి అందుబాటులోకొచ్చింది.
వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్



ఇసుకపై మసక రాతలు!

- ఆగిపోయిన రీచ్‌లలో అక్రమ తవ్వకాలంటూ రామోజీ రభస
- అదే నిజమైతే ఎవరికీ ఫిర్యాదు చేయకుండా ఈనాడు బృందం ఏం చేస్తున్నట్లు?
- ఎన్జీటీ ఆదేశాలతో తక్షణమే 18 రీచ్‌ల్లో మైనింగ్‌ను నిలిపివేసిన ప్రభుత్వం
- పర్యావరణ అనుమతులతోనే ఓపెన్ రీచ్‌లలో తవ్వకాలు.. పారదర్శకంగా విక్రయాలు
- నాడు ఇసుక దోపిడీతో రూ.4 వేల కోట్ల నష్టం.. నేడు ఖజానాకు ఏటా రూ.760 కోట్ల ఆదాయం

2లో

'సురక్ష'కు నీరాజనం

రికార్డు స్థాయిలో 51 లక్షల వినతుల పరిష్కారం

ప్రభుత్వ పథకాలు, సేవలు అందించేందుకు ఇంటింటా జల్లెడ

- ప్రజా ప్రతినిధులు, అధికారులు, గృహ సారథులు, వలంటీర్లు బిజీబిజీ
- 17రోజుల్లో 9,721 సచివాలయాల పరిధిలో సర్వే పూర్తి
- 1.73 లక్షల క్లస్టర్లలో 84.11 లక్షల ఇళ్లను సందర్శించిన వలంటీర్లు
- ఇప్పటిదాక 25,39,136 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు అందజేత.. 23,25,388 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ
- ఇంతగా మేలు చేస్తున్న తొలి సర్కారు ఇదేనని ప్రజల ప్రశంసలు

3లో



ఒంగోలులో జగనన్న సురక్ష కార్యక్రమంలో తమకు అందిన ధ్రువపత్రాలతో మహిళలు

'అన్ని వివరాలు సక్రమంగా ఉన్నప్పటికీ కుల, ఆదాయ, ఫ్యామిలీ.. ఇతరత్రా సర్టిఫికెట్లు పొందాలంటే అంత సులువు కాదన్న విషయం అందరికీ అనుభవమే. విద్యా సంవత్సరం ప్రారంభంలో అయితే మరీ కష్టం. సర్టిఫికెట్లు కొంచెం త్వరగా కావాలనుకుంటే రోజుల తరబడి పనులు మానుకుని, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇందుకు విరుద్ధంగా ఇప్పుడు మీకు ఏవైనా సర్టిఫికెట్లు కావాలా? అని ఇంటి వద్దకే వచ్చి వివరాలు తీసుకెళ్తున్నారు. వారం తిరక్కుండానే సర్టిఫికెట్ చేతిలో పెడుతున్నారు. జయహో జగనన్న సురక్ష' అంటూ ఊరూరా ప్రజల నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఇది మీ ప్రభుత్వం

ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భరోసా

- ఇది బడుగు, బలహీనవర్గాల, మైనార్టీల సర్కార్
- మీ మనసు నొప్పించేలా ఎప్పుడూ వ్యవహరించదు
- ఉమ్మడి పౌరస్మృతి అంశంపై ఇప్పటి వరకు డ్రాఫ్ట్ రాలేదు
- అందులో ఏ అంశాలు ఉన్నాయో కూడా ఎవరికీ తెలియదు
- కానీ మీడియాలో, పలుచోట్ల విపరీతంగా చర్చ నడుస్తోంది.. నా స్థానంలో మీరే ఉంటే ఏం చేస్తారో సలహా ఇవ్వండి
- ముస్లిం ఆడబిడ్డల హక్కుల రక్షణ విషయంలో ముస్లింలే వ్యతిరేకం అన్న చర్చను తిప్పికొట్టండి
- సీఎంతో తమ అభిప్రాయాలను పంచుకున్న ముస్లిం మత పెద్దలు

2లో

ప్రముఖ రచయిత శ్రీరమణ కన్నుమూత



కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ కథకుడు, రచయిత, సీనియర్ జర్నలిస్టు శ్రీరమణ(71) బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు గురువారం హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నారు.
3లో

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం



బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడనుంది. రుతుపవనాల ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్ర, సీమలో పలు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. 22 నుంచి వర్షాల ఉధృతి పెరుగుతుంది.
2లో

నేటి నుంచే సభా సమరం



పార్లమెంట్ సమావేశాలు గురువారం ఆరంభం కానున్నాయి. మణిపూర్ హింస, ఉమ్మడి పౌర స్మృతి, ఢిల్లీ ఆర్డినెన్స్‌పై కేంద్రాన్ని నిలదీసేందుకు ప్రతిపక్ష కూటమి సిద్ధమవుతోంది. 21 బిల్లులు ప్రవేశపెట్టేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది.
6లో

కొత్తగా.. సులువుగా..

- రిజిస్ట్రేషన్స్ శాఖలో ఈ-స్టాంపింగ్ విధానం
- భూముల క్రయ, విక్రయాల్లో పారదర్శకత
- మాన్యువల్‌గా స్టాంపుల విక్రయాలు బంద్
- నెల్లూరు జిల్లాలో 35 స్టాంప్ వెండర్లకు అనుమతి


ఈ-స్టాంప్‌ను అందజేస్తున్న నెల్లూరు జిల్లా అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాన్ జ్యుడీషియల్‌స్టాంపుల విక్రయాల్లో అవకతవకలకు చెక్ పెట్టే దిశగా అడుగులు వేసింది. గతంలో పాత తేదీలతో స్టాంపులు కొనుగోలు చేసి తద్వారా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడేవారు. ఈ విధానాన్ని అరికట్టేందుకు కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. ఈ-స్టాంపింగ్‌తో భూముల క్రయ, విక్రయాలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ నెల్లూరు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రాధాన్యం పొందుతోంది. ఏరోజుకారోజు అనే నినాదంతో ఈ-స్టాంపుల విక్రయాలను చేపట్టింది. దీనికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సైతం అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం చేసేందుకు ఇప్పటికే 101 గ్రామ సచివాలయాల్లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. ఈ-స్టాంపింగ్ విధానం జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు. అన్ని కార్యాలయాల్లో స్టాంప్ వెండర్లకు సంబంధించి మొత్తం 35 ఈ-స్టాంప్ సెంటర్లకు అనుమతులిచ్చారు. మాన్యువల్ స్టాంపుల విక్రయాలు పూర్తిస్థాయిలో నిలుపుదల చేశారు. వాటి సరఫరాను సైతం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నిలిపివేశారు. వినియోగదారులు ఈ-స్టాంప్‌ల వినియోగంపై దృష్టి సారించాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

> రిజిస్ట్రేషన్స్ శాఖలో కొత్త మార్పులు వచ్చాయి. ప్రజలకు సులువుగా సేవలందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల పద్ధతుల్లో పలు మార్పులు, డాక్యుమెంట్ తయారీ విధానంలో కొత్త విధానాలు తీసుకొచ్చారు. ఇటీవల ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు.

ఈ-స్టాంప్‌తో భద్రత

నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల కంటే ఈ-స్టాంప్‌లకు ఎక్కువ భద్రత ఉంటుంది. వీటిని ట్యాంపరింగ్ చేయడం కుదరదు. అంతే కాకుండా పాత తేదీల స్టాంప్‌లు విక్రయించే అవకాశం ఉండదు. గతంలో మాదిరిగా దస్తావేజులను అధిక ధరలకు కొనే బాధ కూడా తప్పుతుంది. ఆయా కేంద్రాల్లో దరఖాస్తులను పూర్తి చేసి వారికి ఇస్తే నిమిషాల్లో ఈ-స్టాంప్‌లను ఇస్తారు. రూ.10 నుంచి ఎన్ని వందల రూపాయలకు కావాలన్నా తీసుకోవచ్చు. ఈ-స్టాంపింగ్ విధానాన్ని స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రిజిస్ట్రేషన్‌లు శాఖ అమలు చేస్తోంది.

ఇప్పటికే డిజిటలీకరణ

స్టాంప్‌లు రిజిస్ట్రేషన్ శాఖలో పాత డాక్యుమెంట్ల డిజిటలీకరణకు ప్రభుత్వం ఇప్పటికే శ్రీకారం చుట్టింది. 1850 నుంచి 1999 వరకు జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇకపై ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలైతే రికార్డులు వెతికి మాన్యువల్‌గా రాసివ్వాల్సిన ప్రయాసలకు విముక్తి కలుగుతుంది. ప్రస్తుతం ఈ-స్టాంపింగ్ తీసుకురావడంతో రిజిస్ట్రేషన్ ఇకపై పూర్తి పారదర్శక సేవలు అందించనుంది.

సేవల్లో పారదర్శకత

ఆస్తులు రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్ల కోసం గతంలో దస్తావేజులు (నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు) వినియోగించాల్సి వచ్చేది. ప్రజలకు పారదర్శకతతోపాటు సులువైన పద్ధతిలో సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-స్టాంపింగ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం అనుమతించిన సెంటర్లలో ఎంత డినామినేషన్ ఈ-స్టాంప్‌లు అవసరమో వాటిని సులువుగా పొందవచ్చు. ఈ-స్టాంప్ విధానం ద్వారా ట్యాంపరింగ్‌కు, అవకతవకలకు ఆస్కారం ఉండదు.

- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

వెండర్లకు లైసెన్సులు

ఇప్పటి వరకు నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల ద్వారా భూముల క్రయ, విక్రయాలు జరిగేవి. వీటిలో డాక్యుమెంట్ రైటర్లు కీలక భూమిక పోషించేవారు. ప్రస్తుతం ఈ-స్టాంప్‌ల విక్రయాల కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న వెండర్లతో (విక్రయదారులు)పాటు కొత్తవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ-స్టాంపింగ్ కంప్యూటర్ పరిజ్ఞానంతో చేపట్టాల్సి ఉండడంతో పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. నిర్దేశించిన సమయంలోగా లైసెన్స్‌లు జారీ చేయనున్నారు.

ఆమంచికి సీఎం పరామర్శ



చీరాల: బాపట్ల జిల్లా చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌ను సీఎం వైఎస్ జగన్ బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. సోమ వారం రాత్రి ఆమంచికి చెందిన ఆక్వా నర్సరీ లో వాకింగ్ చేస్తుండగా కట్లపాము కాటేసింది. దీంతో ఆయనను ప్రాథమిక చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు ప్రాణా పాయం నుంచి కాపాడారు. వైద్యుల సూచన లతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రికి ఆమంచిని తరలించగా మంగళవారం ఆయన హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యారు.

డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు ఎన్క్వాస్ సర్టిఫికెట్



మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణం గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు ఎన్క్వాస్ (నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్ దక్కింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ విశాల్ చౌహాన్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఏపీలోనే ఎన్క్వాస్ సర్టిఫికెట్ పొందిన తొలి యూపీహెచ్‌సీగా గణపతినగర్ యూపీహెచ్‌సీ నిలిచింది. ఈ ఏడాది మే 19, 20వ తేదీల్లో ఢిల్లీ ఎన్క్వాస్ టీమ్ గణపతినగర్ లోని యూపీహెచ్‌సీని సందర్శించి హెల్త్ సెంటర్‌లోని 12 రకాల వైద్య ఆరోగ్య సౌకర్యాల ను పరిశీలించింది. ఆరోగ్య సౌకర్యాల కల్ప న లో 100 మార్కులకు గానూ 96.2 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఫుల్ సర్టిఫైడ్ పొందింది.

పంచాయతీల్లోనూ డిజిటల్ పేమెంట్స్



సాక్షి, అమరావతి: నగదు వసూళ్లకు పంచాయతీలు గుడ్‌బై చెప్పేయబోతున్నాయి. ఇకపై కేవలం డిజిటల్ చెల్లింపులను మాత్రమే అంగీకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 15 నుంచి మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌తో డబ్బులు చెల్లించే ప్రక్రియ మొదలు కాబోతుంది. అప్పటినుంచి పంచాయతీల్లో నగదు చెల్లింపులకు పూర్తిగా స్వస్తి పలికి, కేవలం డిజిటల్ చెల్లింపులు మాత్రమే కొనసాగించేందుకు చర్యలు చేపట్టింది. గ్రామ పంచాయతీల ద్వారా వివిధ సేవలు పొందే సమయంలో లబ్ధిదారులు నిర్దీత మొత్తంలో చెల్లించాల్సిన రుసుములతోపాటు గ్రామాల్లో ఇళ్ల యజమానులు ఏటా చెల్లించే ఇంటి పన్ను కూడా డిజిటల్ ఆధారిత రూపంలోనే చెల్లించాల్సి ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ అధి కారులు వెల్లడించారు. ఇందుకోసం ప్రతి గ్రామ పంచాయతీ అధికారిక బ్యాంక్ ఖాతాల కు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేయడంతో పాటు వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక మెషిన్లను కూడా అన్ని పంచాయ తీలలో అందుబాటులోకి తీసుకురానున్నారు. పంచాయతీల్లో నిధుల వినియోగంలో పారదర్శకత పెంచుతూ ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వబోతుంది.

తెలంగాణ

రేపు పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన

ముషీరాబాద్(హైదరాబాద్): పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ 16 బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 21న పార్లమెంటు వద్ద భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం 75 సంవత్సరాలు గా బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించకుండా అన్యాయం చేస్తోందన్నారు.

యాదాద్రిలో మళ్లీ లీకేజీలు

వర్షానికి కారుతున్న ప్రధానాలయం



ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలో కారుతున్న వర్షపు నీరు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపాల్లో మళ్లీ లీకేజీలు ఏర్పడ్డాయి. ముసురు వర్షంతో ఆలయ అష్టభుజి ప్రాకార మండపం గోడలు, స్లాబ్‌పై నుంచి వర్షం నీళ్లు కారుతున్నాయి. ప్రధానాలయం ప్రారంభమై ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ ఇంకా లీకేజీలను అరికట్టకపోవడంతో భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏర్పడిన లీకులకు మరమ్మతులు చేపట్టినా.. అవి పునరావృతం అవుతున్నాయి.

ఇసుకపై మసక రాతలు!

ఆగిపోయిన రీచ్‌లలో అక్రమ తవ్వకాలంటూ రామోజీ రభస



సాక్షి, అమరావతి: ఇసుక తవ్వకాలపై యథావిధిగా 'ఈనాడు' కట్టుకథలతో స్క్రీన్ ప్లేను రక్తి కట్టించింది. నిబంధనల ప్రకారం స్టాక్ యార్డు నుంచి రవాణా జరుగుతుంటే రీచ్‌ల నుంచి తరలిస్తున్నట్లు అందంగా అబద్ధాలను అల్లేసింది. గత ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక పేరిట ప్రభుత్వానికి రావాల్సిన రూ.4 వేల కోట్లకు గండికొట్టేసినా చిద్విలాసంగా గడిపేశారు రామోజీరావు. ఈ ప్రభుత్వ హయాంలో అదే ఇసుక ద్వారా ప్రభుత్వానికి ఐదేళ్లలో దాదాపు రూ.4వేల కోట్ల ఆదాయం వస్తోంది. జనానికి మునుపటికన్నా ఎక్కువ అందుబాటులో ఉండి... అప్పటికన్నా తక్కువ ధరకే దొరుకుతోంది. అయినా సరే... తాము గతంలో 'డీపీటీ' పేరిట దోచుకో – పంచుకో– తినుకో అనే తరహాలో లాగించేసిన సొమ్ముకు గండిపడిందనే ఆక్రోశంతో నిత్యం కథనాలు రాస్తూనే ఉన్నారు. అన్నీ సక్రమంగానే సాగుతున్నా... తన రాజకోట నుంచి రోజుకో రాయి విసురుతూనే ఉన్నారు. 'కోర్టుల్ని ధిక్కరించి మరీ తవ్వకాలు' అంటూ బుధవారం అచ్చేసిన కథనం కూడా అలాంటిదే.

ఖాళీ రీచ్‌లలో తవ్వకాలా?

చిత్తూరు జిల్లా అరణియార్, స్వర్ణముఖి, నినా నదుల్లో 18 ఇసుక రీచ్‌లలో తవ్వకాలు నిలిపివేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆదేశించింది. దీనిపై జేపీ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఎన్జీటీ ఆదేశాలనే సమర్థించింది. ఈ క్రమంలో న్యాయస్థానం ఆదేశాలను గౌరవిస్తూ గనుల శాఖ ఆ 18 రీచ్‌లలో ఇసుక తవ్వకాలను నిలిపివేయడంతోపాటు అనుమతులను రద్దు చేసింది. పర్యావరణ శాఖ ద్వారా తాజాగా పూర్తిస్థాయి అనుమతులు పొందాలని, ఆ తరవాతే తవ్వకాలకు అనుమతిస్తామని స్పష్టం చేసింది. అయితే 15 రీచ్‌లలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయంటూ 'ఈనాడు' ఓ పచ్చి అబద్ధాన్ని అచ్చేసింది.

తవ్వకాలే లేని చోట యంత్రాలా?

వర్షాకాలంలో భవన నిర్మాణ రంగం అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఓపెన్ రీచ్‌లకు సమీపంలో ప్రభుత్వం స్టాక్ యార్డ్‌లను నిర్వహిస్తోంది. స్టాక్ యార్డులలో ఇసుక నిల్వ చేస్తారు తప్ప... అదేమీ రీచ్ కాదు కనక అక్కడ తవ్వకాలు జరపరు. అలాంటి నిల్వ చేసిన ఇసుక కూడా అక్రమంగా తవ్విపోసిందేనంటూ 'ఈనాడు' నిస్సిగ్గుగా అబద్ధాలాడుతోంది. రీచ్‌లలో తవ్వకాలే జరగని చోట భారీ యంత్రాలు ఎలా వస్తాయి? వాటి ద్వారా టిప్పర్లు, ట్రాక్టర్లలో ఎలా లోడ్ చేస్తారు? అసలు జరగని ఇసుక రవాణాకు స్లిప్‌లు ఎలా ఇస్తారు?

ప్రతి రూపాయి ప్రజల కోసమే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దోపిడీకి ఆలవాలంగా మారిన చంద్రబాబు హయాం నాటి ఇసుక విధానాన్ని రద్దు చేశారు. జాతీయ సంస్థల ద్వారా టెండర్లు పిలిచి ప్రత్యేక ఏజెన్సీ ద్వారా పారదర్శకంగా విక్రయాలు చేపట్టారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు ఐదేళ్లలో దాదాపు రూ.4వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయిని తిరిగి ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు చేస్తున్నారు. వాస్తవానికి ఇసుక విషయంలో చూడాల్సిన ప్రధాన అంశాలు రెండే. ఒకటి ప్రభుత్వానికి డబ్బులు వస్తున్నాయా? లేదా? కాంట్రాక్టరు ప్రభుత్వానికి చెల్లింపులు చేస్తున్నారా? లేదా? అనేది. రెండోది ప్రజలకు అందుబాటులో ఉందా.. లేదా అనేది. అది కూడా నిర్దేశించిన ధరకు విక్రయించాలి. దీనికోసమే ప్రతి ఆదివారం 'ఈనాడు'తో సహా ప్రధాన పత్రికల జిల్లా ఎడిషన్లలో ప్రభుత్వం ప్రకటనలిస్తోంది. అందులో ధరను నిర్దేశించటంతో పాటు... ఎవరికైనా ఆ ధరకు అందుబాటులోకి రాకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా నెంబరుతో సహా పేర్కొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) నెంబర్లు కూడా అందులో పొందు పరుస్తున్నారు. వాస్తవానికి ఇంతటి పారదర్శకమైన వ్యవస్థ చంద్రబాబు హయాంలో ఎన్నడూ లేదు. కానీ 'ఈనాడు' ఒక్క అక్షరం కూడా రాసింది లేదు. తెలుగుదేశం నేతలు బరితెగించి మరీ.. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి రాకుండా దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) పద్ధతిలో చెలరేగిపోయినా... అడ్డువచ్చిన ఎమ్మార్వో వనజాక్షిని నాటి టీడీపీ ఎమ్మెల్యే అత్యంత పాశవికంగా ఈడ్చుకుంటూ మరీ కొట్టినా... చంద్రబాబు ఇంటి వెనకాల రాత్రీపగలూ తేడాలేకుండా లారీలకు లారీలు తరలించేసినా... రామోజీరావుది చిద్విలాసంతో కూడిన మౌనవ్రతమే తప్ప అక్షర యజ్ఞం ఊసే లేదు అప్పట్లో!!.

> **చట్టపరమైన చర్యలు తప్పవు..**
>
> స్టాక్ పాయింట్లలో నిబంధనల ప్రకారం విక్రయాలు చేపడితే అక్రమ ఇసుక రవాణాగా చిత్రీకరించడం దారుణం. తవ్వకాలు రద్దు చేసిన రీచ్‌లలో అక్రమ ఇసుక దందా ఎలా సాధ్యపడుతుంది? గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సహజ వనరుల దోపిడీ జరిగింది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఇసుక మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయింది. ఏ పేద వాడికి ఉచితంగా ఇసుక దక్కలేదు. ఇప్పుడు నిబంధనల ప్రకారం ప్రభుత్వమే ఏజెన్సీ ద్వారా విక్రయిస్తోంది. వచ్చిన ఆదాయాన్ని తిరిగి ప్రజల కోసమే ఖర్చు చేస్తోంది. 'ఈనాడు' పదేపదే అబద్ధాలను ప్రచురించడం ద్వారా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోంది. ఇకపై ఇలాంటి అసత్య కథనాలు ప్రచురిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
>
> – వీజీ వెంకటరెడ్డి, రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్

> **అదే నిజమైతే ఫిర్యాదు ఏది?**
>
> ఈనాడు బృందాలు చిత్తూరు జిల్లాలోని ఇసుక రీచ్‌లను పరిశీలించి ఫొటోలు తీసినట్లు కథనంలో రాసుకొచ్చారు. అక్రమాలు జరగడం నిజమే అయితే ప్రత్యక్ష సాక్షిగా 'ఈనాడు' బృందం కనీసం టోల్ ఫ్రీ నంబరుకు ఎందుకు కాల్ చెయ్యలేదు. పోనీ స్థానిక పోలీసులు, రెవెన్యూ, గనులశాఖ అధికారుల్లో ఏ ఒక్కరికైనా ఫిర్యాదు ఎందుకు చేయలేదు? ఎందుకంటే ఆ రీచ్‌లలో ఎక్కడా తవ్వకాలు జరగడం లేదు. అదీ 'ఈనాడు' చెప్పని అసలు నిజం!!

ఇది మీ ప్రభుత్వం

ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, మైనార్టీలకు సీఎం జగన్ భరోసా



ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వమని.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల ప్రభుత్వం అని సీఎం వైఎస్ జగన్ ముస్లిం ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులకు స్పష్టం చేశారు. ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ ప్రభుత్వం మీ మనసు నొప్పించేలా ఎప్పుడూ వ్యవహరించదని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి డ్రాఫ్ట్ రాలేదని, అందులో ఏ అంశాలు ఉన్నాయో కూడా ఎవరికీ తెలియదన్నారు. అయితే మీడియాలో, పలుచోట్ల విపరీతంగా చర్చ నడుస్తోందని, అది చూసి ముస్లింలు పెద్ద స్థాయిలో తమ మనోభావాలను వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. బుధవారం ఆయన ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక రాష్ట్రానికి పాలకుడిగా, సీఎం స్థాయిలో తాను ఉన్నానని, ఇలాంటి పరిస్థితుల్లో మీరే ఉంటే ఏం చేసేవారో ఆలోచించి సలహాలు ఇవ్వాలని కోరారు. ముస్లిం ఆడబిడ్డల హక్కుల పరిరక్షణ విషయంలో ముస్లింలే వ్యతిరేకంగా ఉన్నారంటూ ప్రచారం నడుస్తోందని, ఇలాంటి దాన్ని మత పెద్దలుగా మీరు తిప్పికొట్టాలని సూచించారు. ఒకే కడుపున పుట్టిన బిడ్డల విషయంలో ఏతండ్రి, తల్లి అయినా ఎందుకు భేద భావాలు చూపుతారని, మహిళలకు సమాన హక్కుల విషయంలో ఏ మాత్రం రాజీ లేదనే విషయాన్ని మనందరం స్పష్టం చేద్దామని పిలుపునిచ్చారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

అపార్థాలకు తావివ్వరాదు

భారత్ చాలా విభిన్నమైనది. ఇక్కడ అనేక మతాలు, కులాలు, వర్గాలు ఉన్నాయి. ఒకే మతంలో ఉన్న పలు కులాలు, వర్గాలకూ పలు రకాల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలున్నాయి. వారి వారి మత గ్రంథాలు, విశ్వాసాలు, ఆచరించే సంప్రదాయాల ఆధారంగా వారికి వారి పర్సనల్ లా బోర్డులున్నాయి. ఏ నియమమైనా, ఏ నిబంధన అయినా సాఫీగా తీసుకురావాలనుకున్నప్పుడు నేరుగా ప్రభుత్వాలు కాకుండా ఆయా మతాలకు చెందిన సంస్థ లు, పర్సనల్ లా బోర్డుల ద్వారానే చేయాలి. ఎందుకంటే వాటి మీద పూర్తి అవగాహన వారికే ఉంటుంది కాబట్టి. అప్పుడే అపార్థాలకు తావుండదు. మార్పులు అవసరం అనుకుంటే సుప్రీంకోర్టు, లా కమిషన్, కేంద్రం.. అందరూ కలిసి, మతాలకు చెందిన సంస్థలు, వారి పర్సనల్ లా బోర్డ్స్‌తో మమేకమై ముందుకు సాగాలి. ఇలా కాకుండా వేరే పద్ధతిలో జరిగితే, అది ఇంత భిన్నత్వం ఉన్న భారత్‌లో తగదు.

> **ముస్లింలకు సీఎం అండగా ఉంటానన్నారు**
>
> ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీతో పౌరస్మృతి విషయంలో ముస్లిం మైనార్టీలకు భరోసా లభించిందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద ముస్లిం ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి పౌరస్మృతి అంశంపై తమ అభిప్రాయాలను సీఎంతో పంచుకున్నామని చెప్పారు. మూడు గంటల పాటు సీఎంతో సమావేశమై చర్చించామని తెలిపారు. యూసీసీ (యూనిఫాం సివిల్ కోడ్) ముస్లింలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయం గురించి మత పెద్దలు సీఎంకు వివరించారన్నారు. ముస్లింలకు నష్టం జరగకుండా తాను ముందుండి పోరాడతానని సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. ముస్లింలకు నష్టం కలిగేలా ఉంటే పార్లమెంట్‌లో యూసీసీ బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పారని తెలిపారు. సీఎం నిర్ణయంతో మత పెద్దలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. సమావేశంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీలు రూహుల్లా, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ ఇసాక్ బాషా పాల్గొన్నారు.

జీ–20 వర్కింగ్ గ్రూప్ సమావేశానికి ఏపీ

- జగనన్న ఇళ్లలో విద్యుత్ పొదుపు చర్యలను ప్రపంచ దేశాలకు వివరించే అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వానికి అందిన ఆహ్వానం
- జగనన్న ఇళ్లలో విద్యుత్ బిల్లులు తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నం
- అన్ని ఇళ్లలో స్టార్ రేటెడ్ గృహోపకరణాల వినియోగం
- వీటి ద్వారా భారీగా తగ్గనున్న విద్యుత్ వినియోగం
- దేశంలోనే వినూత్న చర్యలు తీసుకున్న ఏకైక రాష్ట్రంగా ఏపీకి గుర్తింపు



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి మరో అరుదైన ఘనత దక్కింది. జీ–20 ఎనర్జీ ట్రాన్సిషన్స్ వ ర్కింగ్ గ్రూప్ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు గోవాలో బుధవారం ప్రారంభమైంది. జీ–20 దేశాల ప్రతినిధులు దీనికి హాజరవుతున్నారు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇళ్లు అందించడానికి ప్రవేశపెట్టిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం, ఆ గృహాలకు కల్పిస్తున్న విద్యుత్ సౌకర్యాలు, కరెంటు పొదుపు చర్యలను సదస్సులో వివరించాలని కోరుతూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ రాష్ట్రాన్ని కోరుతూ గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌కు లేఖ పంపింది. సీఎస్ జవహర్ రెడ్డి సూచనల మేరకు అజయ్‌జైన్‌తో పాటు గృహ నిర్మాణ శాఖ ఎండీ లక్ష్మీషా గోవా సదస్సుకు హాజరవుతున్నారు. జగనన్న ఇళ్లు, వాటిలో విద్యుత్ ఆదా చర్యలపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

ఏపీలోనే తొలిసారి

జగనన్న కాలనీల్లో ఇంటింటికీ స్టార్ రేటెడ్ ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను రాయితీ ధరలకు సరఫరా చేసేందుకు ఈఈఎస్ఎల్ ఇటీవల సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ సంస్థ ద్వారా ఒక్కో ఇంటికి 4 ఎల్ఈడీ బల్బులు, 2 ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, 2 ఎనర్జీ ఎఫిషియెంట్ ఫ్యాన్లను మార్కెట్ ధరకంటే తక్కువకు అందించనుంది. రాష్ట్ర ఇంధన, గృహ నిర్మాణ శాఖల సమన్వయంతో తొలుత విజయవాడ, విశాఖ, తిరుపతిలో పైలట్ ప్రాజెక్ట్‌గా త్వరలో ప్రారంభించనున్నారు. వినియోగదారులు ఈ వస్తువుల ధరను నెలవారీ వాయిదా పద్ధతిలో చెల్లించాలి. తొలి విడతగా 20 లక్షల ఇళ్లకు వీటిని అమరుస్తారు. వీటితో ఒక్కో ఇంటిలో ఏటా 1,115 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని, వినియోగదారునికి వార్షిక బిల్లులో రూ.3,598 మిగులుతుందని అంచనా. ఇంధన ఆదా కోసం దేశంలోనే తొలిసారిగా ఇంతటి భారీ ప్రాజెక్టును చేపడుతున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది.

ఆటోమొబైల్‌లో పెట్టుబడులకు అవకాశాలు

- సియోల్‌లో కియా మోటర్స్ గ్లోబల్ ప్రెసిడెంట్‌తో మంత్రి బుగ్గన భేటీ
- ఏపీలో విస్తరణ, పలు రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ
- అనంతరం కొరియన్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ సందర్శన
- ఏపీకి నూతన టెక్నాలజీ, కరిక్యులమ్‌లో సహకారానికి అంగీకారం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆటోమొబైల్, టెక్స్‌టైల్ రంగాల్లో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయని.. కియా నాలుగేళ్ల కాలంలో పలు రికార్డులు నెలకొల్పడమే దీనికి నిదర్శనమని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా బుగ్గన నేతృత్వంలోని ఏపీ అధికారుల బృందం సియోల్‌లోని కియా మోటర్స్ గ్లోబల్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. వీరికి ఆ సంస్థ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రెసిడెంట్, సీఈవో హో సంగ్ సాంగ్‌తో సమావేశమయ్యారు. ఏపీలో కియా పరిశ్రమ విస్తరణతో పాటు ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో మరింత భాగస్వామ్యంపై చర్చించారు. అనంతరం బుగ్గన మాట్లాడుతూ.. కియా ఏపీలో నాలుగేళ్ల కాలంలోనే 10 లక్షల కార్లను ఉత్పత్తి చేసిందని, రాష్ట్ర ప్రభుత్వ సహకారానికి ఇది నిదర్శనమని చెప్పారు. ఆ తర్వాత కొరియన్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏపీ బృందం సందర్శించింది. టెక్స్‌టైల్ రంగంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణకు గల అవకాశాలపై సంబంధిత సంస్థ ప్రతినిధులతో మంత్రి బుగ్గన చర్చించారు. టెక్స్‌టైల్ రంగంలో నూతన టెక్నాలజీ అందించడానికి కొరియా టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆసక్తి వ్యక్తం చేసింది. నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్య శిక్షణకు సంబంధించి నూతన కరిక్యులమ్ తయారీకి అంగీకరించింది. కాగా, సంప్రదాయ తయారీ విధానం నుంచి టెక్నాలజీ వినియోగం పెంచడానికి ఏపీతో కలిసి పని చేయడానికి కొరియా టెక్స్‌టైల్ మెషినరీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అంగీకరించింది. అనంతరం డేగు ప్రాంతంలో ఉన్న యెంగ్నామ్ యూనివర్సిటీని సందర్శించారు. వర్సిటీలోని సింథటిక్ టెక్స్‌టైల్స్ పరిశోధన కేంద్రం సహా కెమికల్ ఇంజినీరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కొరియాలో అనుసరిస్తున్న వినూత్న మార్గాలపై బుగ్గన ఆరా తీశారు. ఏపీలో ఈ విధానాలను అమలు చేయడంతో పాటు విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణను అందించడం ద్వారా ఉపాధి కల్పించే అవకాశాలపై వర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. అక్కడ విద్యనభ్యసిస్తున్న భారత విద్యార్థులతో కూడా మంత్రి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు సునీత, సురేశ్‌కుమార్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం కండి

- వర్షపాతం తక్కువగా ఉంది.. నెలాఖరు వరకు వేచిచూద్దాం
- లేదంటే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేద్దాం
- ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు ఉంచండి
- అధికారులకు వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ ఆదేశం



సాక్షి, అమరావతి: నెలాఖరులోగా వర్షాభావ పరిస్థితులు మెరుగుపడకపోతే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలుకు సిద్ధంగా ఉండాలని వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖపై బుధవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట రకాల మార్పు, ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు అనుగుణంగా ఖరీఫ్‌లో సాగయ్యే పంటల సరళి, ఉత్పాదకతల ప్రణాళికపై చర్చించారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే 26 శాతం తక్కువ ఉన్నందున, రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులకు చెప్పారు. విత్తనాలు, కలుపు మందులు, ద్రవ రూప నానో యూరియా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలన్నారు. శాస్త్రవేత్తల సూచన మేరకు దీర్ఘకాలిక రకాలకు బదులు ఆయా ప్రాంతాలకు అనువైన స్వల్ప కాలిక రకాలను వేసేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. నెలాఖరులోగా వర్షాభావ పరిస్థితుల్లో మార్పు రాకుంటే ఆగస్టు 1 నుంచి మండలాలవారీగా ప్రత్యామ్నాయ విత్తన సరఫరాకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ అధికారులకు చెప్పారు. కృష్ణ, గోదావరి డెల్టాల్లో రైతులు స్వల్పకాలిక వరి రకాలను ఎంచుకోవాలని అన్నారు. వేరుశనగ, పత్తి, అపరాల పంటలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు సాగుచేసుకోవచ్చని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను, వాటి సాగుకు అవసరమైన ఎరువులను ప్రణాళిక ప్రకారం ఎటువంటి కొరత లేకుండా ఆర్బీకేల్లో ఉంచాలన్నారు. ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్, ఏపీ సీడ్స్ ఎండీ జి.శేఖర్‌బాబు, ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికి 540 ఎఫ్‌పీవోలు

జాతీయ స్థాయిలో 10,000 రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవోల) ఏర్పాటులో భాగంగా రాష్ట్రానికి 540 ఎఫ్‌పీవోలను కేటాయించారని ద్వివేది చె ప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపై జరిగిన ఆరో ఎస్ఎల్‌సీసీ స్టేట్ లెవల్ కోఆర్డినేషన్ మీటింగ్‌కు ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఈ పథకం కింద 251 ఎఫ్‌పీవోలను రిజిస్టర్ చేశామని, మిగతా వాటిని డిసెంబర్‌కల్లా రిజిస్టర్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎంఎస్ఎంఈ యూనిట్లన్నీ సకాలంలో ప్రారంభం కావాలి

సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మంజూరు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) యూనిట్లన్నీ సకాలంలో ప్రారంభమయ్యేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)లపై బుధవారం రాష్ట్ర సచివా లయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. పీఎంఎస్ఎంఈ కింద నమోదైన యూనిట్ల వివరాలను పరిశీలించాలన్నారు. నెలవారీగా ప్రారంభమైన యూనిట్ల డేటాను సేకరించి నివేదిక పంపాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు.

వన్యప్రాణుల సంరక్షణకు మరిన్ని చర్యలు

రాష్ట్రంలో ఏపీ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ సొసైటీ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్లతో వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సీఎస్ చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన ఆ సొసైటీ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. వన్యప్రాణుల సంరక్షణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని చెప్పారు. వన్య ప్రాణులు ప్రమాదాలకు గురికాకుండా సోలార్ ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు. వాటికి పూర్తి స్థాయిలో ఆహారం అందే విధంగా ప్రత్యేక పోడర్ ప్లాట్లను అభివృద్ధి చేయాలని సూచించారు.

గోదావరిలో పెరుగుతున్న వరద

పరవళ్లు తొక్కుతున్న ఉప నదులు



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద ఉధృతి

సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం/పోలవరం రూరల్/ఎటపాక/చింతూరు: మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణలలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, తాలిపేరులో వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. గోదావరి నదిలో వరద ఉధృతి క్రమేణ పెరుగుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు గేట్లు ఎత్తి 5,25,250 క్యూసెక్కులు, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి 6,53,170 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. దీనికి శబరి ప్రవాహం తోడైంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 32 అడుగులకు చేరుకుంది. పోలవరంలోకి 2.50 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 48 గేట్ల ద్వారా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 2,03,867 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 12,600 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 1,91,267 క్యూసెక్కులను 175 గేట్ల ద్వారా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఎగువ నుంచి 10 లక్షల క్యూసెక్కులు శుక్రవారానికి ధవళేశ్వరం బ్యారేజ్‌కు చేరే అవకాశం ఉందని అధికారుల అంచనా. దీంతో ఎటపాక, చింతూరు, వీఆర్‌పురం, కూనవరం అధికారులు అప్రమత్తమయ్యారు.

ఆల్మట్టిలోకి వరద ప్రవాహం

పశ్చిమ కనుమల్లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. బుధవారం కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి 21,672 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండటంతో నీటి నిల్వ 29.46 టీఎంసీలకు చేరుకుంది. ఆల్మట్టి నిండాలంటే ఇంకా వంద టీఎంసీ లు అవసరం. కృష్ణా ప్రధాన ఉప నది తుంగభ ద్రలో సింగటలూరు బ్యారేజ్ దిగువన కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల ఆ నదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 9,849 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 11.77 టీఎంసీలకు చేరుకుంది. నైరుతి రుతుపవనాల నేపథ్యంలో వారంపాటు పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలకు ఆస్కారముంది.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. గురువారం నాటికి ఇది వాయవ్య బంగాళాఖాతం, దాని సరిహద్దుల్లో ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా బలపడనుంది. ఈ ఫలితంగా గురు, శుక్రవారాల్లో ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 22 నుంచి వర్షాల ఉధృతి పెరగనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం రాత్రి నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా పడే ప్రమాదం ఉందని తెలిపింది.

క్లుప్తంగా...

జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. పది స్థానాలకు గాను పది స్థానాలూ గెలుచుకుంది. సంఖ్యా బలాన్ని మించి ఇతర పార్టీల నుంచి కూడా ఓట్లు పోలవ్వడం సీఎం జగన్ పరిపాలన దక్షతకు నిదర్శనంగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీకి స్వతంత్రులతో కలిపి 62 మంది కార్పొరేటర్లుండగా వీరిలో ఉరికిటి నారాయణరావుకు 66, అక్కరమాని పద్మకు 64, పీలా లక్ష్మీసౌజన్యకు 64, కోడిగుడ్ల పూర్ణిమకు 63, కంటిపాము కామేశ్వరికి 63, బల్ల లక్ష్మణరావుకు 63, భూపతిరాజు సుజాతకు 63 ఓట్లు వచ్చాయి. అంటే తెలుగుదేశం, బీజేపీ నుంచి కూడా కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లకు ఓట్లు వేశారన్నమాట. ఈ సందర్భంగా మంత్రి, జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల ఇన్‌చార్జ్ గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ టీడీపీకి చెందిన కార్పొరేటర్లు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు పలకడం విశేషమన్నారు. సీఎం ఆదేశాలతో, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్ వైవీ సుబ్బారెడ్డి సూచనలు, సలహాలతో ఈ విజయం సాధించినట్టు మంత్రి అమర్‌నాథ్ చెప్పారు.

గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్‌గా నిమ్మకాయల



సాక్షి, అమరావతి: గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చి యార్డు) చైర్మన్‌గా నిమ్మకాయల రాజనారాయణ నియమితులయ్యారు. కమిటీ వైస్ చైర్మన్‌గా షేక్ మాబు, సుబానీతో పాటు సభ్యులుగా పల్లా శ్రీనివాసరావు, మహమ్మద్ ఫరూఖ్, కోట గంగాభవాని, కోలా అన్నపూర్ణ, కొండారెడ్డి నాగలక్ష్మి, కొప్పుల విజయమాధవి, పాతకుంటి సుశీల, షేక్ సల్మా, బందలపాటి వెంకటేశ్వరరావు, గుంజార ప్రభుదాసు, మల్లెమూడి సతీష్‌కుమార్, గుడివాడ అరుణ, కొత్తపల్లి శివసాంబరెడ్డి నియమితులయ్యారు. అలాగే గుంటూరు డీసీఎంఎస్ చైర్మన్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌తో నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ గౌరవ చైర్మన్‌గా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి వ్యవహరించనున్నారు. నూతన పాలకవర్గం పదవీకాలం ఏడాది.

యూసీసీపై ముస్లింలకు అండగా నిలుస్తాం

టీడీపీ అధినేత చంద్రబాబు హామీ



సాక్షి, అమరావతి : యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ)పై ముస్లింలకు అండగా నిలుస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. బుధవారం వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం మత పెద్దలు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నేతలు, పార్టీ మైనారిటీ నాయకులు టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. మత స్వేచ్ఛకు అడ్డుపడే యూసీసీ చట్టానికి మద్దతు ఇవ్వవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. యూసీసీపై ముస్లిం వర్గాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. మహిళల హక్కులను కాపాడటంలో టీడీపీ మొదటి నుంచి అండగా నిలిచిందని చెప్పారు. అంతకుముందు ఆయన ముస్లింలకు ఇస్లామియా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ, మాజీ మంత్రి ఫరూక్ అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

పొత్తులపై నిర్ణయం జాతీయ స్థాయిలోనే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సాక్షి, అమరావతి : వచ్చే ఎన్నికల్లో తమకు ఏ పార్టీతో పొత్తులుండాలన్నది పూర్తిగా కేంద్ర పార్టీ పెద్దలే చూసుకుంటారని.. సరైన సమయంలో సరైన నిర్ణయం ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. బీజేపీ మిత్రపక్షం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఢిల్లీలో 'రానున్న ఎన్నికల్లో టీడీపీ కూడా ఎన్డీయేలో చేరే అవకాశం ఉంది' అని మాట్లాడటంపై మీడియా ప్రతినిధులు ప్రస్తావించినప్పుడు ఆమె ఈ మేరకు బదులిచ్చారు. తాము మాత్రం.. వచ్చే ఎన్నికల్లో పొత్తుల గురించి కాకుండా పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్టు తెలిపారు. త్వరలో పవన్‌తో సమావేశమవుతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

అమిత్ షాతో పవన్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ భేటీ అయ్యారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షాల భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన పవన్ బుధవారం బీజేపీ పెద్దలతో సమావేశమయ్యారు. ఉదయం బీజేపీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధరన్‌ను, రాత్రి అమిత్ షాను కలిశారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీతో పొత్తులు, సీట్ల సర్దుబాటు అంశాలపై పవన్ చర్చించారని సమాచారం.

'సురక్ష'కు నీరాజనం



- ప్రభుత్వ పథకాలు, సేవలందించేందుకు ఇంటింటా జల్లెడ
- ప్రజా ప్రతినిధులు, అధికారులు, గృహ సారథులు, వలంటీర్లు బిజీబిజీ

సాక్షి నెట్‌వర్క్ : ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం తరఫున వలంటీర్లు ఇంటికే వచ్చి ఏవైనా సమస్యలున్నాయా.. సర్టిఫికెట్లు కావాలా.. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. అని అడిగి తెలుసుకోవడం తొలిసారిగా చూస్తున్నామని జనం చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల వారీగా వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, సేవలందించేందుకు జల్లెడ పడుతుండగా మరో పక్క క్యాంపుల ద్వారా అక్కడికక్కడే అవసరమైన సర్టిఫికెట్లను జారీ చేసే కార్యక్రమం ఉద్యమంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం రికార్డు స్థాయిలో సమస్యలను పరిష్కరించి రికార్డు సృష్టిస్తోంది. రాష్ట్రంలో అర్హత ఉండీ కూడా ప్రభుత్వ పథకాలు అందని వారు ఎవరూ ఉండకూడదన్న మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని జూలై 1న లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. వివిధ పాఠశాలలు, కాలేజీల ప్రారంభం, అడ్మిషన్ల నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని సురక్ష శిబిరాల్లో వివిధ ధ్రువీకరణ పత్రాలను కూడా మంజూరు చేయిస్తోంది. వివిధ శాఖలు జారీ చేసే 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి యూజర్ చార్జీలు లేకుండా అక్కడికక్కడే ప్రజలకు అందజేస్తోంది. వారంలోగా ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను అందించారని విశాఖ జిల్లా వాసి సాసబోయిన దాసు ఆనందంగా చెప్పాడు. ఇంటికే వచ్చి వివరాలు తీసుకుని బర్త్, కుల, ఆదాయం సర్టిఫికెట్లు ఇచ్చారని అనంతపురం జిల్లా వాసి అబిదా సంతోషం వ్యక్తం చేసింది. అత్త, మామల పేర్లను రేషన్ కార్డు నుంచి వేరు చేసి, కొత్తగా రేషన్ కార్డు ఇచ్చారని పల్నాడు జిల్లాకు చెందిన దుడ్డు ఇందు సంబరపడిపోతూ తెలిపింది. ప్రజల ఇంటికే వచ్చి మీకు ఏ సమస్యలున్నాయని అడుగుతున్న తొలి సర్కారు ఇదేనని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో వినతుల పరిష్కారం

- ఈ కార్యక్రమం ప్రారంభమైన మొదటి రోజు 1,305 సచివాలయాల పరిధిలో 4,73,441 వినతులు వస్తే, వాటిలో 4,57,642 అక్కడికక్కడే పరిష్కరించారు. 17వ తేదీ నాటికి 9,721 సచివాలయాల పరిధిలో 53.24 లక్షల వినతులు వస్తే, అందులో 51.14 లక్షల వినతులు అక్కడికక్కడే పరిష్కారమయ్యాయి. 11వ తేదీ ఒక్క రోజే 6.5 లక్షలకు పైగా వినతులు పరిష్కారం కావడం విశేషం.
- ఇప్పటిదాకా 1,69,891 మంది వలంటీర్లు జగనన్న సురక్ష శిబిరాల కోసం తమ క్లస్టర్లలోని 84.11 లక్షల ఇళ్లలో సర్వే నిర్వహించారు. అత్యధికంగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 4,56,147 అభ్యర్థనలు రాగా, అధికారులు 4,37,509 పరిష్కరించారు. అత్యల్పంగా పార్వతీపురం జిల్లా నుంచి 89,303 అభ్యర్థనలు రాగా, 62,312 పరిష్కారమయ్యాయి.
- ఇప్పటిదాకా 25,39,136 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 23,25,388 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 4,154 ఓబీసీ సర్టిఫికెట్లు, 2,764 మ్యారేజ్ సర్టిఫికెట్లు, 9,968 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, 45,930 అడంగల్ సర్టిఫికెట్లు, 1,08,005 వన్ బీ సర్టిఫికెట్లు జారీ చేశారు.
- ఆరోగ్య శ్రీ కార్డులు 3,224, కొత్త బియ్యం కార్డులు 9,378, బియ్యం కార్డులో మార్పులు చేర్పులకు సంబంధించిన సేవలు 8,263, ఆధార్‌తో మొబైల్ అనుసంధానం చేసిన సేవలు 1,78,499 ఉన్నాయి. పట్టాదారు పాసు పుస్తకాల సేవలు 2,841 ఉన్నాయి.
- ప్రజలు రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు కాక ఇబ్బందులు పడే రోజులు పోయాయని, జగనన్న ప్రభుత్వంలో ఏ పని అయినా సులభంగా పూర్తవుతోందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండీ కూడా పథకాలు అందకపోతే వెంటనే స్థానికంగా ఉన్న వలంటీర్‌ను కానీ గ్రామ, వార్డు సచివాలయాల అధికారులను కానీ సంప్రదించాలని అధికారులు ప్రజలకు సూచించారు.

సర్టిఫికెట్ ఇంటికి తెచ్చిచ్చారు..



నాకు బర్త్ సర్టిఫికెట్, కులం, ఆదాయం సర్టిఫికెట్ అవసరమైంది. వీటి కోసం గత ప్రభుత్వ హయాంలో చాలాసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పనికాలేదు. ఇప్పుడు మా ఇంటికే వలంటీర్ వచ్చి నాకేం కావాలో మరీ అడిగి తెలుసుకున్నాడు. కొన్ని జిరాక్స్ కాపీలు తీసుకున్నాడు. రోజుల వ్యవధిలోనే బర్త్ సర్టిఫికెట్, కుల, ఆదాయం సర్టిఫికెట్లు తీసుకొచ్చి నా చేతికిచ్చాడు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంత మేలు జరుగుతుండటం చాలా ఆనందంగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. – అబిదా, కణేకల్లు క్రాస్, రాయదుర్గం నియోజకవర్గం, అనంతపురం జిల్లా

తొమ్మిదేళ్ల తర్వాత ఫ్యామిలీ సర్టిఫికెట్



ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకపోవడంతో కుటుంబ ఆస్తుల కోసం తగాదాలు చోటు చేసుకున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సంఘటనలున్నాయి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం తొమ్మిదేళ్ల క్రితం ఆఫీసుల చుట్టూ తిరిగినా అది ఇక రాదని ఆశ వదులుకున్నాం. ఇక మా కుటుంబం బతుకింతే అనుకున్నాం. కొద్ది రోజుల కిందట మా ఇంటికి వచ్చిన సచివాలయ సిబ్బంది, వలంటీరుకు మా పరిస్థితి వివరించాం. వివరాలు తీసుకెళ్లారు. సరిగ్గా వారం రోజులకు సురక్ష క్యాంపులో ఫ్యామిలీ సర్టిఫికెట్ అందించారు. తొమ్మిదేళ్ల మా ఇబ్బందులకు పరిష్కారం చూపించారు. – సాసబోయిన దాసు, ప్రైవేటు ఉద్యోగి, గెడ్డవీధి, జ్ఞానాపురం, విశాఖ జిల్లా

కొత్త రేషన్ కార్డు వచ్చింది



మాది వ్యవసాయ కూలి కుటుంబం. మా తెల్లరేషన్ కార్డులో నేను, నా భర్త సాగర్, మా అత్తమామలు యాకోబు, రాణి, మరిది మధు ఉన్నాం. గతంలో ఎన్నోసార్లు రేషన్‌కార్డు డివైడ్ చేయాలని కోరినా ఫలితం లేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వారం క్రితం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మా ఇంటికొచ్చారు. సమస్య చెప్పాం. నాకు, నా భర్తకు కలిపి వేరే కార్డు ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు. – దుడ్డు ఇందు, ఎండుగుంపాలెం, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా

'నేస్తం'కి కృతజ్ఞతగా ధర్మవరంలో భారీ ర్యాలీ



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

ధర్మవరం: వరుసగా ఐదో విడత నేతన్న నేస్తం నిధులను ఈ నెల 21న సీఎం వైఎస్ జగన్ విడుదల చేయనుండటంపై హర్షం వ్యక్తం చేస్తూ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో చేనేత కార్మికులు బుధవారం భారీ ర్యాలీ చేపట్టారు. దీనికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఆర్ అండ్ బీ అతిథిగృహం నుంచి కదిరి గేట్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఇందులో వేలాది మంది చేనేత కార్మికులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలో భాగంగా నేతన్న నేస్తం పథకం ద్వారా ఒక్కో చేనేత కార్మికునికి ఏడాదికి రూ.24 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. కరోనా వంటి కష్ట కాలంలోనూ ఈ పథకాన్ని అందించారని కొనియాడారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 76,853 మంది చేనేత కార్మికులు ప్రతిఏటా లబ్ధి పొందుతున్నారన్నారు.

వాల్మీకి బోయల రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్

సాక్షి, న్యూఢిల్లీ: వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ఆమోదించాలని లేని పక్షంలో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ గత ఎన్నికలకు ముందు కర్నూలులో జరిగిన బహిరంగ సభలో వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ అంశంపై న్యాయం చేస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ రవీందర్ చౌదరి, వ్యవస్థాపక అధ్యక్షుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై రంగా హత్య రక్తపు మరకలు!

టీడీపీతో పొత్తుతో నష్టమే: చేగొండి



పాలకొల్లు సెంట్రల్ : విపక్షాల ఓట్లు చీలకుండా చేయడం వల్ల జనసేన అభ్యర్థులను కొంతవరకూ గెలిపించుకునే అవకాశాలున్నా టీడీపీతో పొత్తు వల్ల పలు నష్టాలున్నాయని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో టీడీపీపై అవినీతి, కుల ముద్రతో పాటు ఆయనపై రంగా హత్య ఉదంతం రక్తపు మరకలు అలాగే ఉన్నాయన్నారు. చంద్రబాబుకు వయోభారం, లోకేశ్‌కు అనుభవరాహిత్యం, ప్రధాని మోదీకి బద్ధ శత్రువుగా మిగలడం, కాపు రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లోపించడం, బీసీలకు జనాభా ప్రాతిపదికపైన రిజర్వేషన్ల డిమాండ్‌పై స్పందించకపోవడం లాంటి వాటివల్ల చివరకు జనసేనకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. జనసేన కనీసం 75 సీట్లలో పోటీ చేసి 50 సీట్లు కైవసం చేసుకుంటే గౌరవప్రదమైన అధికారాన్ని పొందవచ్చని జోగయ్య పేర్కొన్నారు. చంద్రబాబుకు పూర్తి కాలం అధికారాన్ని అప్పగిస్తే పవన్‌పై వస్తున్న ప్యాకేజీ ఆరోపణలు నిజమేనని భావించే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు రాజకీయ విశ్లేషణ పేరుతో చేగొండి బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశానికి ఆహ్వానించడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పవన్ చరిష్మాను ఉపయోగించుకుని బీజేపీ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నట్లు నమ్మకం కలుగుతోందన్నారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో బీజేపీకి ఒక్క శాతం లోపు మాత్రమే ఓట్లు రాగా జనసేనతో పొత్తు వల్ల రెండు శాతం పెరగవచ్చన్నారు. సీఎం జగన్‌ను ఓడించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు అంతంత మాత్రమే అని పేర్కొన్నారు. కేంద్రంతో సీఎం జగన్‌కు ఉన్న సత్సంబంధాలే దీనికి కారణమన్నారు.

హామీలను నెరవేర్చండి

- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి
- చర్యల విషయంలో స్పీకర్లు అలసత్వం వహిస్తున్నారు
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- పోలవరం బకాయిలన్నీ చెల్లించాలి
- ఎస్సీ, ఎస్టీల తరహాలో బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

కేంద్రం అఖిలపక్ష భేటీలో విజయసాయిరెడ్డి డిమాండ్



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి రాజకీయాల్లో విలువలకు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణపై బుధవారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఏపీకి సంబంధించి పలు సమస్యలను ఆయన ప్రస్తావించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలివీ..

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు

సమాజానికి వెన్నుముకగా నిలుస్తున్న బీసీలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఆదినుంచి స్పష్టమైన విధానాలతో ఉంది. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ ప్రస్తుతం 27 శాతానికి పరిమితమైంది. జనాభా ప్రాతిపదికన బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సమావేశంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం.

కట్టుదిట్టంగా పార్టీ ఫిరాయింపుల చట్టం

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పూర్తిగా నిర్వీర్యం అయింది. అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ చట్టం అమలుపై చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. ఇదే విషయాన్ని అఖిలపక్ష సమావేశం దృష్టికి తీసుకొచ్చాం. చట్టాన్ని అమలు చేయడంలో స్పీకర్లు పూర్తిగా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కట్టుదిట్టంగా చట్టాన్ని అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి సమావేశంలో ప్రస్తావించాం.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయాన్ని కూడా చర్చలో ప్రస్తావించాం. దీనిపై నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో స్వయంగా హామీ ఇచ్చారు. పదేళ్లపాటు ప్రత్యేక హోదాను కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ దిగిపోయి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా ఈరోజు వరకు మాట నిలబెట్టుకోలేదు. ఆంధ్రుల హక్కుగా దీన్ని మేం అడుగుతున్నాం. ఇప్పటికైనా హోదా కల్పించాలని అఖిలపక్ష సమావేశంలో డిమాండ్ చేశాం.

పోలవరానికి త్వరితగతిన నిధులు

పోలవరానికి సంబంధించి బీజేపీ ప్రభుత్వం నిధులు మంజూరులో సానుకూలంగానే వ్యవహరిస్తోంది. ఇటీవల ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఫేజ్–1లో రూ.12,911 కోట్లు మంజూరు చేసింది. మిగిలిన నిధులు రూ.4,233 కోట్లు కూడా విడుదల చేయాలని కేంద్రాన్ని కోరాం. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.1,310 కోట్లు ఖర్చు చేసింది. ఆ బకాయిల మొత్తాన్ని కూడా చెల్లించాలని కోరాం.

రైల్వేజోన్‌పై కాలయాపన తగదు

పునర్విభజన చట్టంలో విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి నాలుగేళ్లు అయింది. రైల్వే జోన్ ఏర్పాటుపై డీపీఆర్ సమర్పించి మూడేళ్లైనా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఇంతవరకు ప్రారంభం కాలేదు. దీనిపై కాలయాపన తగదు. రైల్వే జోన్ ప్రారంభాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరాం.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై వైఎస్సార్‌సీపీ అభిప్రాయాన్ని ఇప్పటికే అనేకసార్లు కేంద్రానికి స్పష్టం చేశాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోద యోగ్యం కాదు. దీన్ని అడ్డుకుంటాం. తక్షణమే దీన్ని ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా చెప్పాం. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించాలనేది బీజేపీ ప్రభుత్వ విధానం. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లో ఉన్న సంస్థ. అలాంటి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం చాలా తప్పు అని పదేపదే చెప్పాం. ఇవాళ అఖిలపక్షం సమావేశంలో కేంద్రానికి మరోమారు స్పష్టం చేశాం. ఈ అంశాలన్నింటినీ పార్లమెంట్ సమావేశాలలో ప్రస్తావించి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను పరిరక్షించేలా వైఎస్సార్‌సీపీ ఎంపీలంతా గట్టిగా పోరాటం చేస్తాం.

టీడీపీ ప్రభుత్వం పోలవరాన్ని నాశనం చేసింది

- కాఫర్ డ్యామ్‌లు పూర్తి కాకుండా డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం తీవ్ర తప్పిదం
- ఆ తప్పులను సరిదిద్దుతూ మేము ప్రాజెక్టు నిర్మిస్తున్నాం
- పనులపై సీఎం జగన్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు
- మంత్రి అంబటి రాంబాబు



పోలవరం రూరల్: గత టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును సర్వ నాశనం చేసిందని, ప్రొటోకాల్‌కు భిన్నంగా పనులు చేయడం వల్లే నిర్మాణంలో జాప్యం జరుగుతోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఎగువ, దిగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణం పూర్తి చేయకుండా డయాఫ్రమ్‌వాల్ నిర్మించి చరిత్రాత్మక తప్పిదం చేసిందని తెలిపారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, ఈసీఆర్ఎఫ్ ప్రాంతంలో పడిన గోతులను ఇసుకతో నింపి వైబ్రో కాంపాక్షన్ చేసే పనులను ఆయన బుధవారం పరిశీలించారు. మీడియాతో మాట్లాడుతూ కాఫర్‌డ్యామ్‌కు మూడేళ్ల వరకు గ్యారెంటీ ఉంటుందని, ఆ సమయంలోనే ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మించాల్సి ఉందని, అలా కాకుండా పనులు చేసిందని తెలిపారు. ఐదేళ్ల పనులు చేయకుండా జాప్యం చేసిందన్నారు. వర్కింగ్ ప్లేస్‌ను పటిష్టం చేసుకోకుండా పనులు చేపట్టడం వల్ల ఈసీఆర్ఎఫ్ ప్రాంతంలో కవర్స్ ఏర్పడ్డాయన్నారు. టీడీపీ ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ తమ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం చేస్తోందని తెలిపారు. కాఫర్ డ్యామ్‌లు, స్పిల్‌వే, స్పిల్‌చానల్, పైలెట్ చానెల్, అప్రోచ్ చానల్ పనులను పూర్తిచేశామని, స్పిల్‌వేకు గేట్లు ఏర్పాటు చేసి నీటిని మళ్లించామన్నారు. డయాఫ్రమ్‌వాల్‌కు మరమ్మతులు చేయాలా, సమాంతరంగా మరో డయాఫ్రమ్‌వాల్ నిర్మించాల అన్నది కేంద్ర జల సంఘం, నేషనల్ హైడ్రో ప్రాజెక్టు కార్పొరేషన్ నిపుణుల సూచనలు మేరకు నిర్ణయిస్తామన్నారు. ప్రాజెక్టు పనులపై సీఎం జగన్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరగా పూర్తయ్యేలా దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ఈఎన్‌సీ నారాయణ రెడ్డి, సీఈ సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత, జర్నలిస్టు శ్రీరమణ కన్నుమూత

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుదిశ్వాస
- నేడు మహాప్రస్థానంలో అంత్యక్రియలు
- గుంటూరు జిల్లాలో పుట్టిన శ్రీరమణ

సాక్షి, హైదరాబాద్/మణికొండ: ప్రముఖ కథకుడు, రచయిత, సీనియర్ జర్నలిస్టు శ్రీరమణ(71) బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య జానకి, ఇద్దరు కుమారులు చైత్ర, వంశీకృష్ణ ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం ఇక్కడి మహాప్రస్థానంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. మిథునం సినిమాకు కథను అందించిన ఆయన.. 1952 సెప్టెంబర్ 21న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వేమూరు మండలం వరహాపురం అగ్రహారంలో అనసూయ, సుబ్బారావు దంపతులకు జన్మించారు.

చమత్కార చక్రవర్తి శ్రీరమణ

శ్రీరమణ తెలుగులో పేరడీ రచయితగా సుప్రసిద్ధులు. అనేక మంది ప్రసిద్ధ రచయితల శైలిని అనుకరిస్తూ వందలకొద్దీ పేరడీలు రాసి స్వయంగా ఆయా రచయితల అభినందనలనూ పొందారు. అనేక పత్రికల్లో పేరడీలు, శ్రీకాలమ్, శ్రీచానెల్, చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలిరేకులు వంటి ఎన్నో శీర్షికలు నిర్వహించారు. ఆయన మొదటి కథ వెలుగు తగ్గని వజ్రం 1970లలో ఆంధ్రప్రభలో ప్రచురితమైంది. సుదీర్ఘ విరామం తర్వాత బంగారు మురుగు పేరిట కథ రాశారు. మిథునం కథల సంపుటి ప్రచురించారు. సినీ రంగంలోనూ పనిచేశారు. ఆంధ్రప్రభ, నవ్య వారపత్రికలకు సంపాదకులుగా, పత్రిక అనే మాసపత్రికకు గౌరవ సంపాదకుడిగా వ్యవహరించారు. హాస్యరచన విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 2014కిగాను కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు.

స్కూలు రోజుల్లోనే వ్యాసరచనలు...

శ్రీరమణ ప్రాథమిక విద్యను వేమూరులోని శ్రీరామ హిందూ ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేశారు. కవిరాజా జిల్లా పరిషత్ హైస్కూలులో ఎస్ఎస్ఎల్సీ దాకా చదివారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం స్వామి వివేకానందునిపై వ్యాసరచన పోటీ నిర్వహించగా స్కూలు రోజుల్లోనే శ్రీరమణ జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు. అలా ఆరేళ్లపాటు ప్రథముడిగా నిలిచారు. పన్నెండేళ్లకే విజయవాడ ఆకాశవాణి నుంచి యువజనుల కార్యక్రమంలో ఆయన ఇంటర్వ్యూ వచ్చింది.

బాల్య స్మృతులతో మిథునం...

శ్రీరమణ తన మనసులో బాల్యం నుంచి నాటుకున్న ఆలోచనలకు అక్షరరూపంగా మిథునం కథా సంపుటిని రచించారు. ఇది ఎన్నో సంప్రదాయ కుటుంబాల కథ అని ఆయన చెప్పేవారు. దీన్ని చదివి ముచ్చటపడిన దర్శకుడు బాపు స్వదస్తూరిలో ఆ కథను రాసి శ్రీరమణకు పంపారు. అమెరికాలో స్థిరపడిన ప్రముఖ సైకియాట్రిస్ట్, తెలుగు భాషాభిమాని, సాహితీప్రియుడైన డాక్టర్ వి. జంపాల చౌదరి ఆ దస్తూరితోనే మిథునం కథను ప్రచురించి ఇప్పటికి 4 లక్షల మందికి అందజేశారు.

శ్రీరమణగా పేరు మార్పు..

తాతకు మగ పిల్లలు లేకపోవడంతో పీయూసీ చదివే రోజుల్లో శ్రీరమణను ఆయన దత్తత తీసుకున్నారు. శ్రీరమణ జన్మనామం వంకమామిడి రాధాకృష్ణ కాగా, దత్తత వెళ్లాక కామరాజు రామారావుగా మార్చుకున్నారు. అయితే ఈ పేర్ల తికమక నుంచి బయటపడేందుకు తన పేరును శ్రీరమణగా మార్చుకున్నారు.

సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శ్రీరమణ మృతి పట్ల సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీ రమణ రాసిన మిథునం కథ సినిమాగా రూపు దిద్దుకొని పెద్ద విజయం సాధించిందని.. ఆయన రాసిన కథలు మానవత్వం, విలువలతో కూడి ఉంటాయని సీఎం జగన్ గుర్తు చేసు కున్నారు. శ్రీరమణ మృతి పట్ల సీఎం సంతాపం తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ప్రేమించి పెళ్లాడాడు.. ద్వేషంతో పొడిచాడు

- ఏడు నెలల గర్భిణిపై కత్తితో దాడికి తెగబడిన భర్త

మదనపల్లె: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త.. గర్భిణి అని కనికరించకుండా భార్యపై కత్తితో దాడికి తెగబడి తీవ్రంగా గాయపర్చిన ఘటన బుధవారం వేకువజామున అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మదనపల్లెలోని నక్కలదిన్నెకు చెందిన షాహీదాబాను (22) అనే యువతిని మోతీనగర్‌కు చెందిన మహమ్మద్ యూనస్ షామీర్ ప్రేమించి.. పెద్దల అంగీకారంతో ఏడాది క్రితం పెళ్లి చేసుకున్నాడు. షామీర్ తన తండ్రితో కలిసి యునానీ మందుల దుకాణం నిర్వహిస్తున్నాడు. షాహీదాబానుతో వివాహమైన కొంతకాలానికి నక్కలదిన్నెలో వేరు కాపురం పెట్టాడు. కొన్నాళ్లు సజావుగా సాగిన వీరి కాపురంలో కలతలు మొదలయ్యాయి. దంపతులు తరచూ గొడవలు పడేవారు. దీంతో భార్య వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా.. ఇటీవల షాహీదాబాను నగలను షామీర్ తాకట్టు పెట్టడంతో వీరి మధ్య వివాదం మరింత పెరిగింది. ఆమె ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి. తాకట్టులో ఉన్న తన నగలను విడిపించాలని భర్తను కోరింది. నగలకు సంబంధించి వడ్డీ కట్టాల్సి ఉందని, డబ్బులు పుట్టింటి నుంచి తెస్తే విడిపిస్తానంటూ షామీర్ భార్యతో గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో షామీర్ కత్తి తీసుకుని భార్యపై విచక్షణారహితంగా దాడిచేశాడు. వీపుపై కత్తితో గాట్లు పెడుతూ చిత్రహింసలకు గురిచేశాడు. ఈ విషయాన్ని షాహీదా తల్లి నౌషాద్‌కు సమాచారం అందించింది. ఆమె కుటుంబ సభ్యులు ఆ ఇంటికి చేరుకోగా.. వారిని చూసి షామీర్ పరారయ్యాడు. బాధితురాలిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను తిరుపతికి తరలించారు. బాధితురాలి తల్లి నౌషాద్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా కేసు నమోదు చేశారు.



> మన అత్యంత దౌర్భాగ్యాలు ఎప్పుడూ సంభవించవు. అత్యధిక దురవస్థలు నిరీక్షణలోనే ఉంటాయి.
> – హానొరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 20 జూలై 2023

జవాబివ్వాల్సిన చిరుత ప్రశ్నలు!

దాదాపు ఏడు దశాబ్దాల క్రితం దేశంలో అంతరించిపోయిన వన్యప్రాణుల్ని మళ్ళీ పెంచిపోషించే ప్రయత్నం. పదినెలల క్రితం ఆర్భాటంగా మొదలైన ప్రాజెక్ట్. నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి 20 చీతాలను తీసుకువచ్చారు. గత సెప్టెంబర్ నుంచి 'ప్రాజెక్ట్ చీతా'కు జరిగినంత హంగామా అంతా ఇంతా కాదు. కానీ, మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయోద్యానంలో విడిచి పెట్టాక 4 నెలల్లో 8 చీతాలు మరణించడం ఈ యత్నంలోని లోపాలను ఎత్తిచూపుతోంది. ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్న 'జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ' మాత్రం ప్రకృతి సహజ కారణాలతోనే ఈ చీతాలన్నీ చనిపోయాయంటోంది. ఆ మాట శాస్త్రీయంగా లేదు. నిపుణులు లేవనెత్తిన ప్రశ్నలే అందుకు సాక్ష్యం. చీతాల కదలికలు తెలుసుకొనేందుకు మెడకు బిగించిన రేడియో ఫ్రీక్వెన్సీ కాలర్ల వల్ల వాటికి గాయమై, అక్కడ క్రిములు చేరాయనీ, అదే తాజా మరణానికి దారి తీసిందన్న మాటలు ఆందోళన రేపుతున్నాయి. ప్రాజెక్ట్ చీతా భవితవ్యం, శాస్త్రీయత సందేహాస్పదమవుతున్నాయి.

నిజానికి 2009లో జైరామ్ రమేశ్ పర్యావరణ మంత్రిగా ఉన్నప్పుడే ఈ చీతాల పునరావాస ఆలోచన జరిగింది. గత ఏడాది అది ఆచరణలోకి వచ్చింది. ఈ సెప్టెంబర్‌తో ప్రాజెక్ట్ చీతాకు ఏడాది పూర్తి కానుంది. నిరుడు సరిగ్గా ఆ సమయంలోనే నమీబియా నుంచి 8 చీతాలు భారత్‌కు చేరాయి. ఆ పైన ఈ ఫిబ్రవరిలో మరో 12 చీతాలను దక్షిణాఫ్రికా నుంచి ప్రభుత్వం రప్పించింది. దాదాపు 35 చీతాలతో అవి స్వయం సమృద్ధమయ్యే దాకా రానున్న దశాబ్దకాలంలో ఏటా 5 నుంచి 10 చీతాల్ని తేవాలన్నది యోచన. తొలి ఏళ్ళలో ఈ ప్రయోగం పెద్ద విజయం సాధించకపోవచ్చని ఆది నుంచీ అనుకుంటున్నదే. అది కాక అసలీ ప్రాజెక్ట్ ఏర్పాటులోనే ప్రాథమిక లోపాలున్నాయని విమర్శకుల వాదన. వేగంగా పరుగులు తీసే చీతాలకు కూనో ప్రాంతం సరిపోదన్నది ఒకటైతే, వాటిని దీర్ఘకాలం క్వారంటైన్‌లో ఉంచడం వల్ల ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా సిద్ధపడే సామర్థ్యం దెబ్బతింది. మానసికంగా సర్దుకుపోవడమూ సమస్య అయింది. అలా అవి సులభంగా బలి అవుతున్నాయి. తెచ్చిన చీతాలకు తోడు కొత్తగా ఇక్కడ పుట్టిన నాలుగింటిలో 3 కూనలు చనిపోయాయి.

గాయం కథలో శాస్త్రీయత లేదని ప్రభుత్వం అంటున్నా, ఈ అంశాలపై విచారించి, మిగిలిన చీతాలన్నిటికీ పూర్తిస్థాయి శారీరక పరీక్షలు చేయాలని నిపుణుల సంఘం సిఫార్సు చేయడం గమనార్హం. స్వేచ్ఛగా తిరిగేవాటిని పట్టి, కాలర్లు తీసేసి, ఈ పరీక్షలు చేయడం శ్రమతో కూడిన పని. సమయమూ చాలానే పడుతుంది. అప్పుడు కానీ, ప్రాజెక్ట్ చీతా భవితవ్యం తేలదు. చీతాల కోసం అసలు మనం ఎంచుకున్న కూనో ఉద్యానమే చిన్నదని నమీబియా నిపుణులు కుండబద్దలు కొట్టారు. ఆఫ్రికా లాంటి దేశాల్లో ఒక్కొక్క చీతా వేటాడి తినడానికీ, తిరగడానికీ సగటున 100 చదరపు కి.మీ.ల విశాల ప్రాంతం ఉంటుంది. కానీ, మన 'కూనో జాతీయోద్యానం'లో సగటున మూడు చీతాలకు కలిపి 100 చదరపు కి.మీ.ల జాగాయే ఉంది. అలాగే, చీతా స్వేచ్ఛగా సంచరించడానికీ, ఆహార సేకరణ, పునరుత్పత్తికీ నిర్నిరోధమైన 1600 చదరపు కి.మీ.ల పైగా విస్తీర్ణం కావాలి. కూనో జాతీయోద్యానం మొత్తం వైశాల్యం చూసినా 750 చదరపు కి.మీ.లే! ఎలా చూసినా దేశంలో చీతాల పునఃప్రవేశానికి విస్తీర్ణం సరిపోని ఈ ఉద్యానాన్ని ఎందుకు ఎంచుకున్నారనేది బేతాళ ప్రశ్న.

నమీబియా, దక్షిణాఫ్రికాల్లో చీతాలు చుట్టూ కంచె ఉన్న రిజర్వుల్లో ఉంటే, మన దగ్గర వాటిని కంచెలేని సహజమైన, అరణ్య వాతావరణంలో పెరగనివ్వాలని యోచన. కూనో జాతీయోద్యానంలోకి వదిలిన చిరుతలు కొన్ని ఆ పరిధిని దాటి, జనావాసాల్లోకి జొరబడిన వార్తలొచ్చాయి. ఇది పోనుపోనూ మనిషికీ, వన్యప్రాణులకూ మధ్య ఘర్షణకు దారి తీయవచ్చు. ప్రాజెక్ట్ చీతాకు రూపకల్పన చేస్తున్నప్పుడు ఈ సంగతులేవీ లెక్కలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యకరమే! అధికారులు మాత్రం కూనో రిజర్వ్‌లో కావాల్సినంత స్థలం, చీతాలకు తగినంత ఆహారం ఉన్నాయంటున్నారు. మధ్యప్రదేశ్‌లోనే గాంధీసాగర్‌లో రెండో రిజర్వ్‌ను అభివృద్ధి చేసి, చీతా పునరావాస కేంద్రం స్థాపిస్తామని చెబుతున్నారు. అవన్నీ నిజమైతే మంచిదే. కానీ, పెద్ద పులులు, చిరుతలతో పోలిస్తే చీతాలు మహా సున్నితం. అడవిలో అవి తీవ్రంగా గాయపడే ప్రమాదం ఎక్కువ. ప్రస్తుతానికి మన దగ్గర వీటికి సింహాలు, చిరుత పులుల నుంచి పోటీ లేదు గనక కొంత నయం. కాలగతిలో ఇవి మన పరిస్థితులకు అలవాటు పడి భారత్‌ను తమ కొత్త ఆవాసంగా మారుస్తాయేమో చూడాలి.

అరణ్యాల్లో చీతా కూనలు బతికేరేటు 10 శాతమేనట! అంతే శాతం పెరిగిపెద్దవుతాయి. కాబట్టి మరణాలు సహజమేనని ప్రభుత్వ వాదన. కానీ ఇప్పటిదాకా కూనోలో చనిపోయిన చీతాల్లో ఒక్కటి మినహా అన్నీ పూర్తి అరణ్యంలో కాక ఒక చ.కి.మీ. విస్తీర్ణంలో పెట్టిన 'బోమస్' అనే ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉన్నవే. కాబట్టి, లోతుగా పరిశీలన చేయాలి. తక్షణమే ప్రాజెక్ట్ చీతా నుంచి పాఠాలు నేర్చుకోవాలి. జరిగిన పొరపాట్లను గుర్తించి, వాస్తవాలను ప్రజాక్షేత్రంలో పంచుకోవడం మరీ అవసరం. తద్వారా సంబంధిత నిపుణులతో పరిష్కారాలు కనుగొనవచ్చు. చీతాల నిర్వహణలో స్థానిక నైపుణ్యం లేదు గనక నిర్ణీత నిపుణుల అనుభవాన్ని ఆసరా చేసుకోవాలి. అలా కాక రోగాన్ని దాచిపెట్టి, వైద్యం చేస్తే ఫలితం లేకపోగా, వికటించే ప్రమాదం ఉంది. చీతాల పునరావాసం, పునరుత్పత్తి సవ్యంగా సాగాలంటే అధికారులు భేషజాలు వదలాలి. లేదంటే, మొదటికే మోసం వస్తుంది. అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన తొలి ఖండాంతర చీతా పునరావాస ప్రాజెక్ట్ అర్ధంతరంగా అంతిమ అధ్యాయానికి చేరుకుంటుంది. అలా జరగరాదంటే చిరుత ప్రశ్నలకు శాస్త్రీయమైన జవాబు కావాలి!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.తదియ రా.3.12 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.9.41 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.10.59 నుండి 12.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.47 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.54 నుండి 9.36 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

బైడెనామిక్స్ ఒక భ్రాంతేనా?

విశ్లేషణ



డి. పాపారావు

అమెరికా మలిదఫా ఆర్థిక సంక్షోభంలోకి వేగంగా జారిపోతోంది. ఒక పక్క ద్రవ్యోల్బణం, మరో పక్క వృద్ధిరేటును కాపాడుకునేందుకు ఉద్దీపనల అవసరం అడకత్తెరలో పోకచెక్క పరిస్థితికి దిగజార్చాయి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టే పేరిట పెంచుతూ పోయిన బ్యాంకు వడ్డీ రేట్లు, ఆర్థిక మందగమనం దిశగా నెడుతున్నాయి. ఈ నేపథ్యంలో జో బైడెన్ ప్రతిపాదిస్తోన్న 'బైడెనామిక్స్' నయా ఉదారవాద విధానాలకు ముగింపు కానున్నాయా? 1930లలో శారీరక శ్రమ ఆధారిత కాలంలో ఆనాటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ 'ప్రజాహిత కార్యక్రమాలు' పట్టాలు తప్పిన పెట్టుబడిదారీ వ్యవస్థలో తిరిగి ప్రజలకు ఉపాధిని కల్పించగలిగాయి. కానీ నేటి కృత్రిమ మేధ యుగంలో బైడెనామిక్స్ అటువంటి సానుకూల ఫలితాలను తిరిగి ఆవిష్కరించలేదు.

అమెరికాలో 1980ల వరకూ ఉన్న సంక్షేమ రాజ్య స్థానంలో మొదలైన ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు తెచ్చిపెట్టిన మోచేతినీళ్ల (ట్రికిల్ డౌన్) ఆర్థిక శాస్త్రం దారుణంగా విఫలమైందనేది స్పష్టం. దీనినే, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా అంగీకరిస్తున్నారు. ఆయన 'సరికొత్త'గా బైడెనామిక్స్ పేరిట ప్రతిపాదిస్తోన్న ఆర్థిక విధానాలు పాత రోత ట్రికిల్ డౌన్‌కూ, అది ప్రతిపాదించే కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలకూ ముగింపు కానున్నాయనేది అంచనా. అంటే 1930ల ఆర్థిక పెనుమాంద్య కాలంలో, నాటి అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డిలానో రూజ్‌వెల్ట్ నేతృత్వంలో ఆవిష్కరించిన సంక్షేమ రాజ్యం దిశగా తిరిగి అమెరికా ప్రయాణం కడుతోందని అనిపించక మానదు. బైడెన్ 2024లో మరోసారి అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కి, కార్మిక, ఉద్యోగ, సామాన్య జనాల అనుకూల ఆర్థిక విధానాలను విజయవంతంగా 'కొనసాగించ'గలరా? ఒకవేళ బైడెన్ 2024లో మళ్లీ గెలవడం తథ్యం అనుకుంటే, ఆయన సరికొత్త కల అయిన పాత సంక్షేమ రాజ్యాన్ని తిరిగి పునరుద్ధరించగలరా?

దీనికి జవాబు సులువు. 1930లలో రూజ్‌వెల్ట్ అమలు జరిపిన 'ప్రజాహిత కార్యక్రమాలు' లేదా పబ్లిక్ వర్క్స్ నాడు పట్టాలు తప్పిన పెట్టుబడిదారీ వ్యవస్థలో, మరలా తిరిగి ప్రజలకు ఉపాధిని కల్పించ గలిగాయి. నాటి మాంద్యంలో, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిన దశలో – ప్రైవేట్ పెట్టుబడిదారులు, ఇక ఎంతమాత్రమూ కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు లేదా మూతబడిన తమ పరిశ్రమలను తిరిగి తెరిచేందుకు సిద్ధంకాని స్థితిలో, నాటి అమెరికా ప్రభుత్వమే స్వయంగా పూనుకుని తన పెట్టుబడుల ద్వారా ప్రజలకు తిరిగి ఉపాధి కల్పించింది. ఈ విధంగా ప్రభుత్వం కల్పించిన ఉపాధి ద్వారా కాస్తంత పుంజుకున్న ప్రజల కొనుగోలు శక్తి – మార్కెట్లో ప్రైవేట్ ఉత్పత్తిదారులకు తిరిగి తమ సరుకును అమ్ముకునే అవకాశాన్ని కల్పించింది. తద్వారా వారు, తిరిగి తమ పరిశ్రమలను తెరవగలిగారు. ఫలితంగా, మాంద్యంతో పట్టాలు తప్పిన ప్రైవేటు కార్పొరేట్ వ్యవస్థ తిరిగి కోలుకోగలిగింది. ఈ క్రమంలోనే ప్రజలకు మరలా ఉద్యోగ అవకాశాలు తిరిగి వచ్చాయి.

నేటి బైడెనామిక్స్ కూడా దరిదాపుగా ఇదే ఆర్థిక సూత్రీకరణ ప్రాతిపదికన అమెరికాలో మాంద్యం స్థితిని అధిగమించే ప్రయత్నం చేయజూస్తోంది. గతంలోని సంక్షేమరాజ్యాన్ని కూలదోసి 1980లలో వచ్చిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు చరమగీతం పాడటం, దాని స్థానంలో సరికొత్త రూపంలో మరలా తిరిగి సంక్షేమ రాజ్యాన్ని ఆవిష్కరించడం ప్రస్తుతం బైడెన్ యత్నంగా ఉంది. 1930లు, 2023లలో ఒకే తరహా విధానాల అమలు సాధ్యమేనా?



1930లలోని సాంకేతిక పరిజ్ఞాన స్థాయి రూజ్‌వెల్ట్ అమలు జరిపిన పబ్లిక్ వర్క్స్ కార్యక్రమాలకు అనుకూలంగా ఉంది. ప్రభుత్వం పూనుకుని పెట్టుబడులు పెడితే, తద్వారా పెరిగిన ప్రజల కొనుగోలు శక్తి వల్ల... ప్రైవేటు రంగం కోలుకునేందుకు, ఉపాధి కల్పనకు నాడు అవకాశాలున్నాయి. ఎందుచేతనంటే, నాటి సాంకేతిక పరిజ్ఞానం యావత్తూ కేవలం శారీరక శ్రమను అనుకరించేది లేదా దానికి ప్రత్యామ్నాయంగా ఉండేది మాత్రమే. నేటికిలా మేధోశ్రమను అనుకరించే లేదా దానికి ప్రత్యామ్నాయం కాగల సాఫ్ట్‌వేర్ రంగం, ఇంటర్నెట్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు లేవు. కాబట్టే నాడు మానవ మేధస్సుకు, దాని నుంచి ఉద్భవించే నిపుణతలకు ప్రత్యామ్నాయం లేదు. కేవలం, మానవుడి శారీరక శ్రమను తగ్గించగల... ఉత్పత్తిని మరిన్ని రెట్లు పెంచ గల తరహా సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే నాడు అందుబాటులో ఉంది. కాబట్టి, నాడు ఇంకా మనిషికి వ్యవస్థలో పని కల్పించే అవకాశం ఉంది. ఫలితంగానే, నాడు ప్రభుత్వ పెట్టుబడులు ప్రైవేటు రంగం కోలుకుని అది తిరిగి ఉపాధి కల్పనను చేయగలిగేటందుకు పనికొచ్చాయి. కానీ, నేడు ప్రభుత్వ 'పెట్టుబడులు' ఉపాధి కల్పించేవిగా కాక, కేవలం ఆర్థిక వ్యవస్థకు ఉత్ప్రేరకాలుగా లేదా ఉద్దీపనలుగా మాత్రమే ఉంటున్నాయి. ఈ కారణం చేతనే, భారతదేశంలో కూడా గ్రామీణ పేద ప్రజానీకానికి ఉపాధి కల్పించే – జాతీయ ఉపాధి హామీ పథకంలో, యంత్రాల వినియోగంపై పరిమితులు పెడుతూ 2005-06 కాలంలోనే నిబంధనలు ఏర్పరచవలసి వచ్చింది.

కాబట్టి, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, రోబోలు, ఆటోమేషన్ల యుగంలో బైడెనామిక్స్... నాటి రూజ్వెల్ట్ విధానాల వంటి సానుకూల ఫలితాలను తిరిగి ఆవిష్కరించలేదు. అలా జరగాలంటే ప్రస్తుతం మేధో శ్రమకు కూడా ప్రత్యామ్నాయంగా వచ్చిన అధునాతన సాంకేతికతలు అన్నింటినీ స్వచ్ఛందంగా పరిత్యజించుకోగలగాలి. ఒక రకంగా పాత పలుగు, పార దశకో లేకుంటే మర యంత్రాల దిశకో తిరిగి మళ్లగలగాలి. ఇది సాధ్యమా? అసాధ్యమనేదే ఇంగితం మనకు ఇచ్చే జవాబు. కాబట్టి, నేటి బైడెనామిక్స్ ఆచరణలో కేవలం ఆదర్శ వాదంగానే మిగిలిపోగలదు.

మరి ఏది దారి? మానవ జాతికి భవిష్యత్తు ఎలా? కోటానుకోట్ల మందికి ఉపాధి కల్పన నేటి సాంకేతికతల కాలంలో సాధ్యం కానట్టేనా? దీనికి జవాబు – సాధ్యమే! కానీ ఎలా? సాధారణంగా, విధానాల రూపకల్పన, మేనేజ్మెంట్ రంగాలలోని వారు వాడే పద జాలంలో 'అవుట్ ఆఫ్ ద బాక్స్ థింకింగ్' అనే మాట ఉంది. మామూలు రోజువారీ అలవాటుపడి పోయిన మూసపోత ఆలోచనా విధానాన్ని దాటుకుని ఆలోచించగలగడం. ఇక్కడ ఈ వ్యవస్థలో రోజువారీ మనం అలవాటుపడిపోయిన ఆలోచనా విధానం – పెట్టుబడిదారులు ఉండడం, వారు సరుకు ఉత్పత్తి రంగంలోనో లేదా సేవా రంగంలోనో పరిశ్రమలు పెట్టడం, తద్వారా మెజారిటీ ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించడం... అనేది. కానీ, నేడిది వర్కవుట్ కాని ఆలోచనా విధానం. ఎందుకంటే, ఏ పెట్టుబడిదారుడైనా, పెట్టుబడులు పెట్టేది లాభాల కోసమే. దాని ఫలితంగా అంటే, మరో రకంగా చెప్పాలంటే, ఈ క్రమంలో ఉపాధి కల్పన అనేది ద్వితీయ ప్రాధాన్యతా అంశం. మరి ఈ లాభాలను పెట్టుబడిదారుడు – మనుషుల స్థానంలో యంత్రాలను వినియోగించడం ద్వారా పొందగలిగితేనో? నేడు జరుగుతోంది అదే. నిజానికి, సాంకేతిక పురోగమన క్రమంలో జరుగుతూ వచ్చిందంతా అదే. కానీ, నేడు ఈ సాంకేతిక పరిజ్ఞాన ఎదుగుదల – ఉత్పత్తిలో మనిషికి ఏ ప్రాధాన్యతా లేదా అవసరం లేని స్థితికి చేరుకుంటోంది. అదీ విషయం!

ఈ క్రమంలో... వ్యవస్థాగత పరిమితులలో, బైడెన్ ముందుకు తెస్తోన్న బైడెనామిక్స్ ఆశిస్తోన్న సానుకూల ఫలితాలను తెచ్చిపెట్టలేదు. కాబట్టి నేడు ప్రపంచవ్యాప్తంగా మానవ కల్యాణం కోసం, ప్రజలందరి బాగుకోసం కావాల్సింది – మరో సరికొత్త వ్యవస్థాగత నిర్మాణం. ఎక్కడైతే కేవలం లాభాలే పరమావధి కావో... పెట్టుబడి అంతిమ లక్ష్యం ఆ లాభాల పెరుగుదల మాత్రమే కాదో అటువంటి సరికొత్త సామాజిక, ఆర్థిక నిర్మాణం మాత్రమే ప్రస్తుత నిరుద్యోగం, మాంద్యాలకు పరిష్కారం చూపగలదు. కాబట్టి, నేటి బైడెన్ యత్నం... కేవలం వ్యవస్థను కాపాడుకునే చిట్టచివరి దింపుడు కళ్లం ఆశగా మాత్రమే మిగిలిపోగలదు. కానీ అంతిమంగా అటు అమెరికా ప్రజానీకం, ఇటు మొత్తంగా ప్రపంచ ప్రజానీకం కూడా ఈ పరిష్కారం దిశగా కదిలి తీరుతారు. వారలా కదిలే దిశగా కాలం, పరిస్థితులే వారిని ప్రేరేపిస్తాయి. మానవ జాతి ఇప్పటివరకూ తన పరిణామ క్రమంలో అధిగమించలేక పోయిన చిక్కుముడి అంటూ ఏదీ లేదు. నేడు కూడా అంతే. మనిషి జయించి తీరుతాడు. దారి ముందుకే, విజయానికే.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు । 98661 79615

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ముఖ్య కారణం



ఇస్లాంకు సంబంధించిన రాజకీయ వ్యాఖ్యానం కొద్దిమంది ముస్లింలను దేశం కంటే మతమే ఎక్కువ అనేలా విజయవంతంగా ప్రభావితం చేయగలిగింది. ఎక్కువమంది ఉమ్మడి పౌర స్మృతిని ఆమోదించక పోవడానికి ఈ విశ్వాసమే ముఖ్య కారణం.

– తాహిర్ అన్వర్, హేతువాద ముస్లిం

గొప్పే!



గొప్పలు చెప్పుకోవడం కోసం కాదుగానీ, ఇవ్వాళ నేను టమోటా సూప్ తాగాను.

– సునీల్ గ్రోవర్, కమెడియన్

నిరాడంబర ముఖ్యమంత్రి



కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ (జూలై 18న మరణించారు) పుత్తుపల్లిలోని సెయింట్ జార్జ్ ఆర్థొడాక్స్ చర్చ్‌కు వచ్చేవారు. మెట్ల దగ్గర మామూలు మనిషిలా కూర్చునేవారు. దగ్గరలోనే ఆయనకు ఒక సాధారణ ఇల్లుంది. ఉదయం ప్రార్థన కాగానే చాలామంది నడుచుకుంటూ ఆయన ఇంటికి వెళ్లేవారు. అధికారంలో ఉన్నా, లేకున్నా వాళ్ల సమస్యలు విని పరిష్కారాలు వెతికేవారు. ఆయన నిరాడంబరత, నిజాయతీ మలయాళీ సమాజం మీద చెరిగిపోని ముద్ర వేశాయి.

– పాల్ కోశీ, బ్లాగర్

చిన్నవి బతకొద్దా?



పెద్ద బాలీవుడ్ సినిమాలు ఒకే రోజు విడుదలైనప్పుడు వాళ్లు చాలా నిరాశ చెందుతారు; పరిశ్రమలో ఒకరినొకరం పట్టించుకోవాలని మాట్లాడుతారు. కానీ కొన్ని షోలు నడిస్తే కూడా బతికే చిన్న బడ్జెట్ ఇండీ సినిమాల గురించి ఒక్క క్షణం ఆలోచించరు.

– ఓనీర్, దర్శకుడు

కొత్త పాఠం



ఇజ్రాయిల్ వ్యతిరేక, యూదు వ్యతిరేక విషయాలను తమ పాఠ్యపుస్తకాల్లోంచి తొలగించింది సౌదీ అరేబియా. బదులుగా హెజ్బొల్లా లాంటి తీవ్రవాద గ్రూపుల విషయాలతో పాటు, సహనం, శాంతిని పెంచే అంశాలను చేర్చింది. ఇది ఇరు దేశాలను కొత్త మధ్యప్రాచ్యానికి చేరువ చేస్తుంది.

– ఇన్బార్ కోహెన్, ఇజ్రాయిల్ వ్యాఖ్యాత

ఇలా రాయొచ్చా?



పొడి దగ్గు కోసం మా అమ్మ ఒక 'బీఏఎంఎస్' డాక్టర్ దగ్గరికి వెళ్లింది. ఆయన రెండు యాంటీ బయాటిక్స్ రాశాడు – అమోక్సిక్లావ్, సిప్రో. ఒక ఆయుర్వేద వైద్యుడు ఒక్క ఆయుర్వేద ఔషధం కూడా ఇవ్వకుండా అల్లోపతి మందులను రాయడం అనేది చర్చించాల్సిన రెండో విషయం. మొదటిది – ఒక పొడి దగ్గుకు రెండు యాంటీబయాటిక్సా అన్నది!

– వరద్ పాటిల్, ఎంబీబీఎస్ విద్యార్థి

విలాస జీవితం



వయసు పెరుగుతున్నకొద్దీ నాకు అర్థమవుతున్నది ఏమంటే, నడుచుకుంటూ పోగలిగే నగరంలో జీవించగలగడం ఒక విలాసం. ప్రకృతికి చేరువగా ఉంటూ, సౌకర్యంగా ఉండే దుస్తులు ధరిస్తూ, మంచి వాతావరణంలో కావాల్సిన సరుకులు కొనుక్కుంటూ, తాజా భోజనం చేస్తూ, పడుకునేముందు కాసేపు నక్షత్రాలు చూడటం కంటే మించినది ఏమిటి!

– అనుశ్రీ, సైకాలజిస్ట్

అంతరిస్తున్న ఆదివాసీ భాషలు

ప్రపంచీకరణ, సరళీకరణ, సామ్రాజ్యవాద ధోరణులు పెరుగుతున్న నేపథ్యంలో అనేక ఆదివాసీ తెగలు అంతరిస్తున్నాయి. మిగిలిన తెగల వారి భాషా సంస్కృతులూ గిరిజనేతరులతో ఏర్పడిన సంబంధాల కారణంగా సంకరణం చెంది కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా గిరిజనేతరుల వలసలు ఏజెన్సీ ప్రాంతాలలో పెరగడం ఇందుకు ఒక కారణం. తెలుగు రాష్ట్రాలలోనూ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్‌లలో అధికంగా ఉన్న కోయత్తోర్ ప్రజలు ఎక్కువగా కోయ భాష మాట్లాడుతున్నారు.

ఎప్పుడైతే ఆదివాసీయేతర రాజులు గోండ్వానా లాంటి గిరిజన రాజ్యాలపై దండెత్తి వశం చేసుకున్నారో ఆదివాసీల భాషా సంస్కృతులూ అప్పటినుంచే ప్రమాదంలో పడ్డాయి. ఆధునిక కాలంలో రాజ్యాలు లేకపోయినా ప్రజా ప్రభుత్వాలు స్థానిక భాషలను పట్టించుకోకుండా అధికులు మాట్లాడే భాషలను అధికార భాషలుగా చేశాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇప్పుడు తెలంగాణలోనూ తెలుగు ప్రధాన అధికార భాష అయ్యింది. మహారాష్ట్రలో మరాఠీ భాష అక్కడ స్థానిక ఆదివాసీల 'గోండీ' భాషపై పైచేయి సాధించి అధికార భాషగా చలామణీలో ఉంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, నాగాలాండ్, అసోమ్ తదితర రాష్ట్రాల్లో ఆదివాసీ భాషలపై ఇండో ఆర్యన్ భాషల ఆధిపత్యం మూలంగా చాలా ఆదివాసీల భాషలు తమ ఉనికిని కోల్పోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 30 ఆదివాసీ తెగలు ఉంటే వాటిలో 8 తెగలకు ప్రత్యేకమైన భాష ఉంది. వాటిలో కోయ భాష మాట్లాడేవారు అధికంగా ఉన్నారు. ఈ భాషకు లిపి లేదు. ఇప్పుడు కొంతమంది ఆదివాసీ మేధావుల కృషి ఫలితంగా లిపి, నిఘంటువులు తయారవుతున్నాయి.



నిజాం రాజులలో చివరి రాజైన ఉస్మాన్ అలీఖాన్ ఆదివాసీ భాషల ప్రత్యేకతను గుర్తించి గోండు, కోయ భాషలలోనే రాయించిన చరిత్ర మన కళ్ళ ముందు ఉన్నది. ఆదివాసీ టీచర్లనే నియమించి వారికి ప్రత్యేక శిక్షణ కోసం ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పారు. ఈ విధానం హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రరాష్ట్రంలో విలీనం అయ్యే వరకు కొనసాగింది. ఏపీ ఏర్పడిన తర్వాత కోయ భాషపై తగిన శ్రద్ధ పెట్టక పోవడం వల్ల కోయభాష వాడుక క్రమంగా తగ్గిపోతున్నది. ఈ తరుణంలో ప్రభుత్వం ఆది వాసీ భాషలను రక్షించకపోతే ఆదిమ సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతాయి. ఆది వాసీ సంస్కృతిలో అద్భుతమైన చారిత్రక గీతాలు, ఇతర సాహిత్యం, మానవజాతి పరిణామ క్రమం ఇమిడి ఉన్నాయి. కాబట్టి ఈ భాషలు అంతరిస్తే విశ్వజ్ఞాన మూలాలను కోల్పోతాం. అందుకే ఐక్యరాజ్యసమితి సంస్థ యునెస్కో 2019 నుండి జూలై 21వ తేదీని 'ప్రపంచ ఆదివాసీ భాషా దినోత్సవం'గా జరపాలని పిలుపునిచ్చింది.

– గుమ్మడి లక్ష్మీ నారాయణ, ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి

(రేపు ప్రపంచ ఆదివాసీ భాషా దినోత్సవం)

హాస్యం... సెంటిమెంట్ కలిస్తే... అది శ్రీరమణ!

నివాళి



కె.వి. వరప్రసాద్ రెడ్డి

శ్రీరమణ పేరు చెప్పగానే చాలాకాలం పాటు ఆయన హాస్యం, వ్యంగ్యం గుర్తుకు వచ్చేవి. హాస్యానికీ, వ్యంగ్యానికీ చిరునామాగా ఆయన పేరే వినబడేదంటే అతిశయోక్తి కాదు. తర్వాత సినీ రచయితగా, బాపు–రమణల అంతే వాసిగా ప్రసిద్ధులయ్యారు. 'బంగారు మురుగు' కథ తర్వాత నుంచి ఆయనకు గొప్ప కథకుడిగా పేరు వచ్చింది. హాస్యమూ, వ్యంగ్యమూ మాత్రమే కాదు, సెంటిమెంటు కూడా అంతే గొప్పగా పండించ గలడన్న సంగతి పాఠక లోకానికి విదితమైంది. ఇక 'మిథునం'తో ఆయన ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయారు. ఏ వృద్ధ దంపతులను చూసినా 'మిథునం' గుర్తుకు వచ్చేటంతగా ఆయన పాఠకుల హృదయాలపై ముద్ర వేసేశారు. ముసిముసి నవ్వులు పూయించే వికటకవే కాదు, గుండెను తట్టి మనసు పొరల్లో తడి స్రవింపచేసే కవీ తనలో ఉన్నాడని నిరూపించుకున్నారు.

హాస్య ప్రక్రియల్లో అన్నిటికన్న క్లిష్టమైనది ప్యారడీ రచన. దానికి ఎంతో అధ్యయనం, పరిశీలన కావాలి. రచయిత రచనాశైలిలో ఉన్న ప్రత్యేకత ఏమిటో పట్టుకోగలగాలి. దాన్ని తరచుగా వాడడాన్ని గమనించి, దాన్ని ఎత్తి చూపితే నవ్వు పుట్టించే అవకాశం ఉందని గ్రహించాలి. దాన్ని ఉత్ప్రేక్షించి, ఆ అవకరాన్ని సామాన్య పాఠకుడి దృష్టికి తీసుకుని రాగల రచనాకౌశలం ఉండాలి. శ్రీరమణ ఆధునిక వచన రచయితలలో ప్రముఖులందరినీ ప్యారడీ చేశారు. వచనాన్ని ప్యారడీ చేయటం అంత సులభం కాదు. వారి మూలరచనలు చదివినవారికే ఆ ప్యారడీలలో స్వారస్యం బోధపడుతుంది. శ్రీరమణ ఆ సాహిత్యాలన్నీ చదివి ఒంటపట్టించుకున్న పండితుడు, నిశిత పరిశీలన గల విమర్శకుడు, దానిలో వక్రతను పసిగట్ట గలిగిన రసజ్ఞుడు. వారిలో యింకో విశేష మేమిటంటే, ఈయన చేత చురకలు వేయించుకున్న వారు కూడా పగలబడి నవ్వేటంత సంస్కార యుతంగా రాయగలగడం!

పాత్రికేయ ఉద్యోగానికే పరిమితమైతే ఆయన ఒక పరిధిని దాటలేక పోయే వారేమో! కానీ ఆయన మద్రాసు వెళ్లారు. బాపు – రమణలతో చేరారు. వారి సమస్త వ్యవహారాలూ ఈయన చూసే వారు. వారు సొంతానికై తీసిన సినిమాలలో, ఇతరులకు తీసి పెట్టిన సినిమాలలో ఈయన అనేక బాధ్యతలు నిర్వర్తించేవారు. వాళ్లు వెళ్లిన చోటకల్లా వెళుతూ వారిలో ఒకడిగా ఉన్నారు. దీని కారణంగా ఆయనకు ఎంతో విస్తృత ప్రపంచం దర్శనమైంది.

'బంగారు మురుగు' ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురించ బడినప్పుడు సంచలనాన్ని సృష్టించింది. దాదాపు 800 ఉత్తరాలు వచ్చాయట. ఇది మా బామ్మ కథే అని ఒకరు, కాదు కాదు... మా అమ్మమ్మ కథ అని మరొకరు... ఇలా అందరూ తమని తాము ఐడెంటిఫై చేసేసుకున్నారు. 'మిథునం' వెలువడేటప్పటికి అందరూ వారిలో తమ తలిదండ్రులను ఐడెంటిఫై చేసుకున్నారు. శ్రీరమణ పాత్రలు మన నిత్యజీవితంలో చూసేవే. షోడా నాయుడు, ధనలక్ష్మి... వీళ్లందరూ మన చుట్టూ ఉన్నవాళ్లే!

'ధనలక్ష్మి' కథలో ఆయన వ్రాసిన మాండలిక పదాలు, తెలుగు పలుకుబడులు, తెలుగువారికి దొరికే అరుదైన మృష్టాన్న భోజనం. కొన్ని వర్ణనలు క్రొంగొత్తగా అనిపించి అలరిస్తాయి.



శ్రీరమణ

ఉదాహరణకు: ''రోషం కమ్మేసిన అతని మొకం తుమ్మల్లో పొద్దుగూకి నట్టుంది.''

''...చీమలకు చక్కెర దొరగ్గాలేంది, మనుషులం మనకు నాలుగు మెతుకులు దొరకవా...''

''...పిండిమర మెతుకువలన్నీ ఇప్పుడు ధనమ్మకు కొట్టినపిండి...''

ఇలాంటి చమక్కులెన్నో వారి రచనల్లో కనిపిస్తాయి.

శ్రీరమణకు మొహమాటాలు తక్కువ, తెగువ ఎక్కువ. మతం పేరుతో చేసే అట్టహాసాలను వెక్కిరించడంలో దిట్ట. ఆచార వ్యవహారాల కంటె మానవత్వానికే పెద్దపీట వేసే 'బంగారు మురుగు'లో బామ్మ స్వాములారిని కడిగి పారేస్తూంటే మనకు లోపల్నుంచి సంతోషం తన్నుకు వస్తుంది. అలాగే 'అరటిపువ్వు స్వాములా'రి పాత్ర ద్వారా కుహనా ప్రవచనకారులకు చాకిరేవు పెట్టేశారు.

వారపత్రికా సంపాదకుడిగా ఆయన రాజకీయ నాయకుల గురించి కూడా నిర్భయంగా తూర్పార బట్టారు. నిజజీవితంలో కూడా ఆయన వ్యాఖ్యల్లో వెక్కిరింత, మాటల్లో వగరు మనల్ని తాకుతూనే ఉంటాయి. కానీ ఆయన విమర్శలో ఉన్న వాస్తవం మనల్ని ఆకట్టుకుంటుంది.

నాకు బాపు–రమణలు అత్యంత ఆప్తులు. వారికి నేను వీరాభిమానిని. శ్రీరమణతో నాకు ఉన్నది పరిమిత పరిచయమే. కానీ వారి రచనలు చాలా ఇష్టంగా చదువుతాను. వారి రచనల ద్వారా, వారిలో ఉన్న హాస్యాన్ని పండించే శైలి ద్వారా సెంటిమెంట్ వ్రాయడంలో వారికున్న ప్రతిభ ద్వారా నాకు బాగా నచ్చిన, బాగా ఇష్టపడిన రచయితగా నా మనఃపథంలో శాశ్వతంగా ఉండిపోతారు. అంతేకాకుండా నా ఆప్తమిత్రులు బాపు–రమణలకు అంతేవాసిగా కూడా నేను వారిని బాగా ఇష్టపడతాను.

వ్యాసకర్త వ్యవస్థాపక ఛైర్మన్, శాంతా బయోటెక్నిక్స్

(నిన్న శ్రీరమణ తుదిశ్వాస విడిచారు)

క్లుప్తంగా...

టీటీడీకి బ్యాటరీ వాహనం విరాళం



తిరుమల డీఐకి బ్యాటరీ వాహనం అందజేస్తున్న దాత బాలభాస్కర్‌రెడ్డి

తిరుమల: హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ బాలభాస్కర్‌రెడ్డి టీటీడీకి రూ.4.50 లక్షల విలువైన బ్యాటరీతో నడిచే (బగ్గీ) వాహనాన్ని బుధవారం విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ఎదుట పూజలు నిర్వహించిన అనంతరం తిరుమల డీఐ జానకి రామిరెడ్డికి దాత బ్యాటరీ వాహనం అప్పగించారు.

హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కమిటీ

మధురానగర్(విజయవాడ సెంట్రల్): హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కమిటీని నేషనల్ సెక్రటరీ వినోద్ కుమార్ బిదురి బుధవారం ప్రకటించారు. విజయవాడ గాంధీనగర్ ఫిలిం చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఏపీ సెక్రటరీగా ఉన్న దుగ్గపోగు సుధీర్ బాబును నేషనల్ హెడ్ క్వార్టర్ కమిషనర్‌గా నియమించినట్టు చెప్పారు. ఏపీ నూతన చైర్మన్‌గా పోతుమంచి గిరిధర్‌రాజు, చీఫ్ కమిషనర్‌గా రావి ముత్యాలరాజు, సెక్రటరీగా జోన్నిగల సంపత్, కమిషనర్‌గా ఆర్.దుర్గాప్రసాద్, హెడ్ క్వార్టర్ కమిషనర్‌గా మానికొండ శ్రీధర్ నియమితులైనట్లు తెలిపారు.

ఎర్రచందనం విక్రయాలకు గ్లోబల్ టెండర్లు

తిరుమల: పట్టుబడిన 5,600 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం విక్రయించడానికి, గ్లోబల్ టెండర్లు ఆహ్వానించామని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రదీప్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్మగ్లింగ్‌లో పట్టుబడిన ఎర్రచందనం విక్రయించడానికి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించమని తెలిపారు. శ్రీశైలం అడవుల్లో పులులు, శేషాచల అడవుల్లో చిరుతల సంతతి పెరగడం శుభ పరిణామం అన్నారు. తిరుమల నడక మార్గంలో భక్తులకు ఇబ్బంది లేకుండా టీటీడీ అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

ముక్కంటి సేవలో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్



శ్రీకాళహస్తి ఆలయంలో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్‌విన్ ఓవెన్

శ్రీకాళహస్తి/రేణిగుంట(తిరుపతి జిల్లా): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ వరుణ మాలి, పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, బియ్యపు ఆకర్ష్ రెడ్డి పాల్గొన్నారు.

అమరరాజా కంపెనీ సందర్శన

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్‌విన్ ఓవెన్ బృందం రేణిగుంట మండలం కరకంబాడిలో ఉన్న అమరరాజా బ్యాటరీస్ కర్మాగారాన్ని సందర్శించింది. అమరరాజా కంపెనీతో కలసి గ్రీన్ ఎనర్జీ రంగంలో పనిచేసేందుకు వ్యాపార అవకాశాలను పరిశీలించినట్లు ఈ సందర్భంగా గారెత్‌విన్ ఓవెన్ తెలిపారు.

తల్లిని అవమానించిన బాబును సీఎం చేస్తావా?

- పవన్‌కళ్యాణ్‌కు మంత్రి రోజా ప్రశ్న



చిలకలపూడి(మచిలీపట్నం): తన తల్లిని అవమానించిన చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు పవన్‌కళ్యాణ్ ఉవ్విళ్లూరుతున్నారని మంత్రి రోజా దుయ్యబట్టారు. చిరంజీవి వల్లే పవన్ ఈ స్థాయికి వచ్చారని.. కానీ ఆయన్ని కూడా గౌరవం లేకుండా మాట్లాడటం పవన్‌కే చెల్లిందన్నారు. పవన్ సినిమాల్లో మాత్రమే హీరో అని.. రాజకీయాల్లో జీరో అని విమర్శించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మంత్రి రోజా బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందో.. నీతి ఆయోగ్ కూడా చెబుతోందన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో 11.77 శాతం పేదరికం ఉంటే.. వైఎస్ జగన్ పాలనలో 6 శాతానికి తగ్గిందన్నారు. పేదరికం నిర్మూలనలో బాబు హయాంలో దేశంలో 20వ స్థానంలో ఉంటే.. ఇప్పుడు 8వ స్థానానికి వచ్చామన్నారు. కేవలం నాలుగేళ్లలోనే 17 వైద్య కళాశాలలు ఏర్పాటుకు వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. వీటిలో 5 కాలేజీల్లో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభమవుతున్నాయన్నారు. చంద్రబాబు స్క్రిప్ట్‌తో మాట్లాడే పవన్‌కు ఇవేవీ కనపడవన్నారు. ప్రతిపక్షాలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు.

డ్రోన్లతో వెదసాగు సక్సెస్

- ఈ ఖరీఫ్‌లో వంద ఎకరాల్లో ప్రయోగాత్మక సాగు
- ఇప్పటికే 217 మంది డ్రోన్ పైలట్లకు శిక్షణ
- త్వరలో తిరుపతి, పులివెందులలో డ్రోన్ శిక్షణ కేంద్రాలు



పొలంలో వెద పద్ధతిలో వరి విత్తనాలు జల్లుతున్న డ్రోన్ యంత్రం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వరిసాగులో కొత్త పద్ధతులను ప్రవేశపెట్టడంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ ముందుకు సాగుతోంది. దేశంలోనే మొదటిసారిగా వ్యవసాయ డ్రోన్ల వినియోగంపై రైతులకు, గ్రామీణ యువతకు అవగాహన కల్పిస్తూ, వ్యవసాయంలో రాష్ట్ర ప్రభుత్వ ముందుచూపును నిజం చేస్తోంది. ఇప్పటివరకు 10 ప్రధాన పంటల్లో డ్రోన్లతో పురుగుమందులు చల్లడానికి ప్రామాణికాలను తయారుచేసి, శిక్షణ ఇచ్చింది. ఇప్పుడు ఏకంగా వెదపద్ధతి(విత్తనాలు వెదజల్లడం)లో విత్తనాలు చల్లే ప్రక్రియకి శ్రీకారం చుట్టింది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు సకాలంలో పడకపోవడంతో రైతులు సకాలంలో వరినాట్లు వేయలేకపోతున్నారు. ఖరీఫ్ సాగు ఆలస్యం అవుతోంది. దీంతో రైతులు వెదసాగు పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం వరిసాగులో 21 శాతం వరకు వెదపద్ధతిలోనే జరుగుతున్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వెదపద్ధతిలో గత ఏడాది 100 ఎకరాల్లో వరి, మినుము, పచ్చిరొట్ట సాగుచేశారు. దుక్కి దున్నిన తరువాత నుంచి అన్ని పంటల్లో డ్రోన్లతో అన్ని రకాల పనులు చేసుకోవచ్చని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతికతను జోడించి డ్రోన్లతో వరి విత్తనాలను వెదజల్లించాలని వర్సిటీ శాస్త్రవేత్తలు నిర్ణయించారు.

సమయం, డబ్బు ఆదా

డ్రోన్లతో వెదపద్ధతిలో తక్కువ విత్తనాలు సరిపోతాయి. సమయం, డబ్బు ఆదా అవుతాయి. మొదటి ఏడాది ఫలితాలను విశ్లేషించిన తర్వాత వెదపద్ధతిలో విత్తనాలను నాటడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని గుర్తించారు. రెండో సంవత్సరం ఫలితాలు ఆశాజనకంగా వస్తే దుక్కి నుంచి కోత వరకు డ్రోన్లను ఉపయోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్లు, చేతితో చల్లే పద్ధతిలో ఎకరానికి 16 నుంచి 30 కిలోల వరకు విత్తనాలు వినియోగిస్తున్నారు. అదే డ్రోన్ ద్వారా చల్లితే 8 నుంచి 12 కిలోల విత్తనాలు సరిపోతాయి. గత ఏడాదిగా డ్రోన్ల సాయంతో విత్తనాలు చల్లడం, ఎరువులు (యూరియా, డీఏపీ) వేయడం, పురుగుమందుల పిచికారీలను ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఎకరం పొలంలో మూడు నిమిషాల్లో విత్తనాలు చల్లవచ్చు. 50 కిలోల రసాయనిక ఎరువును ఎనిమిది నిమిషాల్లో చల్లవచ్చు. ఎకరా విత్తనాలు విత్తుకునేందుకు రూ.400 నుంచి రూ.500 ఖర్చవుతుంది. విత్తనాల్లో 25 శాతం ఆదా అవుతాయి. పురుగుమందుల వ్యయం 25 శాతం తగ్గడమేగాక చల్లే ఖర్చులో రూ.400 ఆదా అవుతాయి. గత ఏడాది వెదపద్ధతిలో చేసిన సాగు ఆశాజనకమైన ఫలితాలను ఇవ్వడంతో ఈ విధానంపై పరిశోధనలను ముమ్మరం చేసింది.

రైతులకు అధునాతన సాంకేతికత



ఆధునిక వ్యవసాయ విధానాలను రైతులకు అందించేందుకు దేశంలోనే మొదటిసారిగా డ్రోన్ల ద్వారా వ్యవసాయాన్ని ప్రయోగాత్మంగా చేపట్టి మంచి ఫలితాలను సాధించాం. వెదపద్ధతిలో వరిసాగు, పురుగుమందులు, ఎరువుల పిచికారీలో మంచి ఫలితాలు వచ్చాయి. మరికొంత సాంకేతికతను రైతులకు అందించేందుకు రోబో టెక్నాలజీపై ప్రయోగాలు చేపట్టాం. అధునాతన సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తెస్తున్నాం.

– డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, వీసీ, ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ

డీజీసీఏ అనుమతితో శిక్షణ

దేశంలో ఎక్కడా లేనివిధంగా డ్రోన్లను వినియోగించడంతోపాటు డీజీసీఏ అనుమతి తీసుకుని వ్యవసాయ డ్రోన్ పైలట్లకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శిక్షణ ఇస్తోంది. వర్సిటీలోని శిక్షణ కేంద్రంలో ఇప్పటివరకు 217 మంది రైతులు, గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేసింది. మరో వందమంది వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా శిక్షణ ఇచ్చింది. తిరుపతి, పులివెందులలో డ్రోన్‌శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.



ఉన్నతాధికారి నివాసంలో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఎస్ జాయింట్ సెక్రటరీ
- పలు ఆస్తుల్ని గుర్తించిన ఏసీబీ అధికారులు



గుమ్మళ్లపాడులోని రూబెన్ ఇంటిలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి, అమరావతి/కైకలూరు: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదుతో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఎస్) జాయింట్ సెక్రటరీ కె.డి.వి.ఎం.ప్రసాద్‌బాబు నివాసం, కార్యాలయాల్లో, కైకలూరు మండలం గుమ్మళ్లపాడులోని ఆయన బావ అందుగుల రూబెన్ ఇంట్లోను బుధవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఆయన ఆదాయానికిమించి భారీగా ఆస్తులు సంపాదించినట్లు గుర్తించారు. 1991లో ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ఆయన తరువాత హెడ్ కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐగా పదోన్నతులు పొందారు. 2007లో గ్రూప్–1 అధికారిగా ఎంపికైన ఆయన ఖజానా శాఖలో ఏటీవోగా చేరారు. కృష్ణా జిల్లా డీఆర్‌డీఏ పీవోగా, ఖజానా శాఖ విజయవాడ డివిజనల్ అధికారిగా, కృష్ణాజిల్లా ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేశారు. ఆయన నివాసంలో నిర్వహించిన సోదాల్లో ఏసీబీ అధికారులు భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. ఏలూరులో రెండు ప్లాట్లు, విజయవాడ పోరంకిలో రెండు ప్లాట్లు, ఏలూరులోని మాదేపల్లిలో ఆర్‌సీసీ ఇల్లు, ఒక భవనం, హైదరాబాద్ భూదాన్ పోచంపల్లిలో జీ+2 భవనం, పామర్రులో ప్లాట్, దెందులూరులో వ్యవసాయ భూమి, మూడు ఫోర్ వీలర్లు, రెండు టూ వీలర్ వాహనాలు, 500 గ్రాముల బంగారం, ఎల్ఐసీ పాలసీలు, మౌనిక ఆక్వా ఫామ్స్‌లో రూ.కోటి పెట్టుబడి, ఇతర వ్యక్తుల నుంచి రూ.26 లక్షల ప్రామిసరీ నోట్లు కలిగి ఉన్నట్టు గుర్తించారు. బుధవారం రాత్రి వరకు సోదాలు కొనసాగిస్తున్నారు. ప్రసాద్ భార్య స్వగ్రామం గుమ్మళ్లపాడు కావడంతో అక్కడ తనిఖీలు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఎస్ఐ, కానిస్టేబుల్

ప్రకాశం జిల్లాలో నిందితుల పేర్లను తొలగించడానికి కొనకనమిట్ల ఎస్ఐ కె.దీపిక తరఫున రూ.45వేలు లంచం తీసుకుంటూ కానిస్టేబుల్ పి.నర్సింహారావు ఏసీబీకి చిక్కారు. హెచ్.ఎం.పాడు మండలం రాజగారిపల్లెకు చెందిన ఎ. నరసింహ, అతడి కుటుంబసభ్యుల పేర్లను 498 (అ) కేసులో ముద్దాయిలుగా పోలీసులు పేర్కొన్నారు. వారిపేర్లను ముద్దాయిల జాబితా నుంచి తొలగించేందుకు ఎస్ఐ కె.దీపిక రూ.60 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అనంతరం ఎస్ఐ దీపిక ఆదేశాల మేరకు బాధితుల నుంచి రూ.45 వేలు లంచం తీసుకుంటున్న కానిస్టేబుల్ కె.నరసింహారావును ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. నిందితులు ఎస్ఐ దీపిక, కానిస్టేబుల్ నర్సింహారావును ఏసీబీ అధికారులు న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు.

'వైఎస్సార్ చిరునవ్వు'తో ఉచిత దంత వైద్య సేవలు



మొబైల్ దంత వైద్యశాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి విజయలక్ష్మి

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా దంత వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని 'వైఎస్సార్ చిరునవ్వు' రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు. కండ్రికలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొబైల్ దంత వైద్యశాలను ఆమె ప్రారంభించారు. రాష్ట్రంలో వైఎస్సార్ చిరునవ్వు కార్యక్రమాన్ని ఐదు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రారంభించగా అందులో కండ్రిక ఒకటన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఉచితంగా దంతవైద్య సేవలను అందిస్తోందని తెలిపారు. ప్రారంభోత్సవం రోజున 72 మందికి వైద్య సేవలు అందించినట్టు విజయలక్ష్మి వివరించారు.

దేశ నిర్మాణంలో బ్యాంకుల పాత్ర అపూర్వం

- అఖిల భారత బ్యాంక్ అధికారుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్
- విజయవాడలో ఘనంగా 55వ బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవం



ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయం వద్ద బ్యాంక్ అధికారుల సమాఖ్య ప్రదర్శన

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): దేశ నిర్మాణంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్వహిస్తున్న పాత్ర అపూర్వమని అఖిల భారత బ్యాంక్ అధికారుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్ అన్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ నాడు తీసుకున్న బ్యాంకుల జాతీయీకరణ లక్ష్యం నేడు నీరు గారుతోందని సమాఖ్య నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో 55వ బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవం సందర్భంగా అఖిల భారత బ్యాంకు అధికారుల సమాఖ్య ఆధ్వర్యంలో విజయవాడలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిపాలనా కార్యాలయం వద్ద బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి వైవీ సత్యన్నారాయణ మాట్లాడుతూ దేశ నిర్మాణ ప్రక్రియలో అవిశ్రాంతంగా పనిచేస్తున్న బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన అత్యావశ్యకమన్నారు. సామాజిక లక్ష్యాలను అనుసరించి ప్రభుత్వ రంగ బ్యాంకులు వివిధ కొలమానాలలో ప్రైవేట్ రంగ బ్యాంకులను మించి పని చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియామకాల కొరత వల్ల ప్రస్తుత శ్రామిక శక్తిపై విపరీతమైన ఒత్తిడి కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నేతలు వీఆర్కే మోహన్, శ్రీనివాసరావు, నారయ్య, గౌస్, మూర్తి, యోబు, నటరాజ్ పాల్గొన్నారు.

రెండున్నర గంటల్లో రేషన్‌కార్డు

- శ్రీకాకుళం జిల్లా చినంచల గ్రామ సచివాలయంలో అధికారుల ఘనత
- జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుకు అందజేత



లబ్ధిదారురాలు ప్రభావతికి రేషన్‌కార్డు రసీదు అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా పలాస మండలం చినంచల గ్రామ సచివాలయంలో బుధవారం లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకున్న సుమారు రెండున్నర గంటల్లో కొత్త రేషన్ కార్డును అధికారులు మంజూరు చేసి రికార్డు సృష్టించారు. చినంచల గ్రామానికి చెందిన పినకాన ప్రభావతి దంపతులు ఉపాధి కోసం ఢిల్లీ వెళ్లారు. గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోందని తెలిసి బుధవారం ఉదయమే గ్రామానికి వచ్చారు. భార్యాభర్తలు సచివాలయానికి వెళ్లి రేషన్ కార్డు కోసం ఉదయం 10.30 గంటలకు దరఖాస్తు (టి232995259) చేసుకున్నారు. మధ్యాహ్నం 1.17 నిమిషాలకు కార్డు మంజూరు కావడంతో అక్కడే జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతులమీదుగా కార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్‌నాయుడు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వెంటనే సచివాలయం నుంచి ఎమినిటీ, వీఆర్వో, ఆర్ఐలను దాటుకుని మండల సివిల్ సప్లయ్ డీటీకి దరఖాస్తు చేరిందని, వెంటనే రేషన్‌కార్డు (1627648) మంజూరై తిరిగి సచివాలయానికి చేరిందని, దీనికి ఎలాంటి చార్జీలు వసూలు చేయలేదని వివరించారు. దీంతో మంత్రితో పాటు కార్యక్రమానికి హాజరైన వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

త్వరలో ఏలేరు–తాండవ ప్రాజెక్టుల అనుసంధానం

- విశాఖకు నీటి తరలింపులో ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- క్షేత్రస్థాయి పరిశీలన చేసిన నీటిపారుదల ఉన్నతాధికారులు



అధికారులకు సూచనలిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ సతీష్‌కుమార్

నాతవరం (అనకాపల్లి జిల్లా): వర్షాకాలం తర్వాత ఏలేరు–తాండవ అనుసంధానం పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఇంజనీర్ ఇన్ చీఫ్, గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ చెప్పారు. నాతవరం మండలం జిల్లేడుపూడిలో ఏలేరు సారంగం వద్ద తాండవ ప్రాజెక్టు కాల్వలను ఉత్తర కోస్తా సీఈ ఎస్.సుగుణాకరరావుతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఏలేరు, తాండవ ప్రాజెక్టుల అనుసంధానానికి ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు రూ.470 కోట్ల 5 లక్షలను కేటాయించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నంలో పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కాకినాడ జిల్లాలోని ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్, జీవీఎంసీ, ఇక్కడి పరిశ్రమలకు రోజుకు 95 జీఎండీల నీరు సరఫరా అవుతోంది. అనుసంధానం పనులు ప్రారంభించడానికి నీటి సరఫరాను నిలిపివేయాల్సి ఉంటుంది. అప్పుడు ఇబ్బంది ఎదురుకాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు నీటిపారుదల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. అనంతరం ఏలేరు, తాండవ ప్రాజెక్టు అధికారులతో పాటు జీవీఎంసీ, విస్కో అధికారులకు అనుసంధానం పనులపై ఇంజనీర్ ఇన్ చీఫ్ సతీష్ కుమార్ దిశానిర్దేశం చేశారు. ఉత్తరాంధ్రలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టు పనులను రూ.1,100 కోట్లతో పూర్తి చేస్తున్నామని ఉత్తర కోస్తా సీఈ ఎస్.సుగుణాకరరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో వంశధార ప్రాజెక్టు లిఫ్ట్ పనులు రూ.150 కోట్లతో జరుగుతున్నాయన్నారు. హిరమండలంలో బ్యాలెన్స్ రిజర్వాయర్ పెండింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. రూ.123 కోట్లతో విజయనగరం జిల్లా తోటపల్లి బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు చేస్తున్నామన్నారు. తారకరామ రిజర్వాయర్‌తో పాటు పలు ప్రాజెక్టులకు మరమ్మతులు చేస్తున్నామని వివరించారు. ధవళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ భాస్కరరావు, డీఈ వినోద్‌కుమార్, విస్కో సలహాదారు, విశ్రాంత ఎస్ఈ జగన్మోహన్‌రావు, తాండవ ప్రాజెక్టు డీఈ జె.స్వామినాయుడు, జేఈలు శ్యామ్‌కుమార్, వినయ్‌కుమార్, ఆర్.పాత్రుడు, రామకృష్ణ, నాగబాబు సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు అంతర్రాష్ట్ర 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి క్రైం: ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్లు నలుగురిని అరెస్ట్ చేసి, 42 ఎర్రచందనం దుంగలు, ఒక ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. భాకరాపేట ఘాట్ రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను భాకరాపేట సీఐ తులసీరామ్, వారి బృందం వెంబడించి పట్టుకుందని తెలిపారు. వీరు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లాకు చెందిన రాజకుమార్, భరత్, గోకుల మారన్, సర్వనన్‌గా గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి రూ.41 లక్షల విలువ చేసే 42 ఎర్రచందనం దుంగలు, ఒక ఐషర్ వాహనం స్వాధీనం చేసుకున్నామని, వీరు ఎర్రచందనాన్ని కోడూరు నుంచి చెన్నైకి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ముఠాకు ప్రధాన సూత్రధారి చెన్నైకి చెందిన శేఖర్‌కాగా తిరువణ్ణామలై జిల్లాకు చెందిన రమేష్ అనే వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

కమిటీ విచారణకు అర్జున్‌దాస్ గైర్హాజరు

తిరుపతి కల్చరల్: హథీరాంజీ మఠాధిపతిగా పలు అక్రమాలకు పాల్పడిన అర్జున్‌దాస్ బుధవారం తిరుపతిలో ధార్మిక పరిషత్ కమిటీ విచారణకు గైర్హాజరయ్యారు. మఠం ఉద్యోగులు పలువురు విచారణ కమిటీని కలిసి అర్జున్‌దాస్ వేధింపులపై ఫిర్యాదు చేశారు. అలాగే జీతాలు ఇవ్వడంలో అలసత్వం ప్రదర్శించారని.. రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, పెన్షన్లు సరిగ్గా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ఏబీ కృష్ణారెడ్డి, విజయరాజు మాట్లాడుతూ.. విచారణ కొనసాగుతుందని.. త్వరలోనే నివేదిక పూర్తి వివరాలను తెలియజేస్తామన్నారు.

బాబు అండ్ కోను తరిమేస్తాం

- 1,025వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పేదలంటే అలుసుగా చూస్తూ తమ హక్కులను కాలరాస్తున్న బాబు అండ్ కోను రాష్ట్రం నుంచి తరిమేస్తామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,025వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా, దళితులు శుభ్రంగా ఉండరు అని కించపరిచే వ్యాఖ్యలు చేసిన టీడీపీకి తగిన బుద్ధి చెబుతామని చెప్పారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదరిక నిర్మూలన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి పేదవాడికి ఇల్లు, భూమి, సంక్షేమం అందించి ఆర్థికంగా భరోసా కల్పిస్తుంటే కులవాదులకు అక్కసు పెరిగి కోర్టుల్లో కేసులు వేయడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. విద్య ద్వారానే సామాజిక విప్లవం సాధ్యమని భావించిన జగనన్న కార్పొరేట్‌కు దీటుగా పేదల పాఠశాలలను నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసి ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టి తమ బిడ్డలకు నాణ్యమైన విద్యను, ఉచితంగా పుస్తకాలను అందజేస్తుంటే కులవాదుల గుండెల్లో భయం పట్టుకుందన్నారు. నాయకులు బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

మారిటైమ్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- వీపీఏ చైర్మన్ డాక్టర్ అంగముత్తు



జీఐఎంఎస్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్ (జీఐఎంఎస్–2023) కర్టెన్ రైజర్ కార్యక్రమం బుధవారం ముంబైలో ప్రారంభమైంది. ఇందులో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్ డాక్టర్ అంగముత్తు వర్చువల్‌గా విశాఖ నుంచి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ...వీపీఏ వ్యాపార భాగస్వాములందరూ జీఐఎంఎస్‌లో పాల్గొనాలని కోరారు. భారత్‌లో మారిటైమ్ రంగంలో ఉన్న వ్యాపార అవకాశాలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసేందుకు జీఐఎంఎస్ ఓ మంచి వేదిక అని అన్నారు. నూతన పెట్టుబడి అవకాశాలను కల్పించడం, సులభతర వాణిజ్య విధానం, వాణిజ్యంలో పరస్పర సహకారం, సాంకేతిక, వైజ్ఞానిక విభాగాల్లో భాగస్వామ్యాలను పెంపొందించడం ఈ సదస్సు ఉద్దేశమని చెప్పారు. కాగా, ఢిల్లీలోని ప్రగతి మైదానంలో అక్టోబర్ 17 నుంచి 19 వరకు జీఐఎంఎస్–2023ను నిర్వహించనున్నారు.

కుప్పంలో టీడీపీ ఆటలు ఇక సాగవు


- ఇక్కడ బాబు ఓటమి కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ప్రసంగిస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శాంతిపురం (చిత్తూరు జిల్లా): ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకునే టీడీపీ ఆటలు ఇక కుప్పంలో సాగవని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఇక్కడ చంద్రబాబు ఓటమి కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మొదటి రోజైన బుధవారం ఆయన మండలంలోని 11 పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కనీసం నామినేషన్ వేయడానికి, ఓటు అడగడానికి కూడా రాని వ్యక్తికి ఎందుకు ఓటు వేయాలో కుప్పం ప్రజలు ఆలోచించాలని కోరారు. ఏడుసార్లు సైకిల్‌కు ఓట్లేసిన వారు ఒక్కసారి ఫ్యానుకు ఓటువేసి మార్పు చూడాలని కోరారు. ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ, వారికి ధైర్యం చెప్పేందుకే తాను ఇక్కడ ప్రతి గ్రామంలో తిరుగుతున్నానని చెప్పారు. చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా, 35 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉండి కుప్పం నియోజకవర్గంలో సరైన రోడ్లు కూడా వేయలేదని విమర్శించారు. హంద్రీనీవా కాలువ పనుల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 95 శాతం పూర్తి చేస్తే, చంద్రబాబు మిగతా ఐదు శాతం పనులు పూర్తి చేయలేకపోయారన్నారు. త్వరలోనే కుప్పం కెనాల్ పనులను సీఎం వైఎస్ జగన్ పూర్తి చేస్తారన్నారు. విపక్షనేత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై సీఎంకు ఎలాంటి వివక్ష లేకపోగా ప్రతి పంచాయతీలో కోట్ల రూపాయలు నేరుగా జనానికి చేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా భరత్, ఎంపీగా రెడ్డెప్పలను ఆశీర్వదించటం ద్వారా సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు.

14 మందికి యావజ్జీవ శిక్ష



కొండాపురం: వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య, ప్రతీకార హత్య కేసుల్లో మొత్తం 14 మంది ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు అదనపు రెండవ జిల్లా కోర్టు జడ్జి జి.ఎస్.రమేష్‌కుమార్ బుధవారం తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. తాళ్లప్రొద్దుటూరు మండలం టి.కోడూరు గ్రామంలో పిక్కిలి చిన్నవెంకటేశు, అతని అన్న పిక్కిలి పెద్దవెంకటేశుకు సంబంధించిన పాడుబడిన ఇంటివద్ద చెల్లాచెదురుగా పడి ఉన్న రాళ్ల విషయమై అదే గ్రామానికి చెందిన పిక్కిలి పెద్దశ్రీరాములు, పిక్కిలి చంద్రశేఖర్, పిక్కిలి చిన్న శివరాముడు, పిక్కిలి లక్ష్మీప్రసాద్, పిక్కిలి వెంకట శ్రీనాథ్, బేస్త గురుమూర్తి, బేస్త వెంకట కొండప్ప 2012 మే 9న ఘర్షణ పడ్డారు. దీన్ని మనసులో పెట్టుకుని అదే రోజు రాత్రి పెద్ద వెంకటేష్ ఇంటికి వేట కొడవళ్లు, కట్టెలు, రాళ్లతో వచ్చిన ముద్దాయిలు పిక్కిలి మహాచంద్రయ్యను హత్య చేశారు. ఈ ఘటనపై హతుడి చిన్నాన్న పిక్కిలి చిన్నవెంకటేశు ఫిర్యాదు చేశారు. కాగా.. దీనికి ప్రతీకారంగా 2013 డిసెంబర్ 22న అదే గ్రామానికి చెందిన పిక్కిలి నాగార్జున, పిక్కిలి రవి, పిక్కిలి చంద్ర, లక్ష్మయ్య, పిక్కిలి రామాంజనేయులు, పిక్కిలి రామ్‌మోహన్, పిక్కిలి పెద్ద వెంకటేశు కలిసి.. మహాచంద్రయ్య హత్య కేసులో మూడవ ముద్దాయిగా ఉన్న చౌడ రాముడు అలియాస్ బేస్త రాముడుపై కత్తులు, ఈటెలు, కట్టెలతో దాడి చేసి హతమార్చారు. ఈ హత్యకు సంబంధించి హతుడి సమీప బంధువు జోగ సుబ్బరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసులను విచారించిన కోర్టు రెండు కేసుల్లో ఒక వర్గానికి చెందిన ఏడుగురికి, మరో వర్గానికి చెందిన ఏడుగురికి కలిపి మొత్తం 14 మందికి యావజ్జీవ శిక్ష విధించారు.

క్లుప్తంగా...

సుప్రీంకోర్టులో సెతల్వాద్‌కు ఊరట

గోధ్రా అల్లర్లలో సాక్ష్యాల తారుమారు కేసులో సాధారణ బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ: గుజరాత్‌లో 2002 గోధ్రా ఘర్షణల తర్వాత సాక్ష్యాలను తారుమారు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు ఊరట లభించింది. సుప్రీంకోర్టు బుధవారం సెతల్వాద్‌కు సాధారణ బెయిల్ మంజూరు చేసింది. తీస్తా సెతల్వాద్‌కు బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరిస్తూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను త్రిసభ్య బెంచ్ తోసిపుచ్చింది. గోధ్రా హింసాకాండ కేసుల్లో అమాయకుల్ని ఇరికించడానికి సాక్ష్యాలను తారుమారు చేశారని తీస్తా సెతల్వాద్ అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో సెతల్వాద్‌పై చార్జిషీటు నమోదు కావడంతో ఆమెను మళ్లీ కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ''తీస్తా సెతల్వాద్ ఇప్పటికే తన పాస్‌పోర్టును సెషన్స్ కోర్టుకు సమర్పించారు. ఆమె సాక్షులను ఎవరినీ ప్రభావితం చేయడానికి వీల్లేదు. వారికి దూరంగా ఉండాలి'' అని సుప్రీం బెంచ్ ఆదేశించింది. ఈ కేసులో తీస్తా సాక్షుల్ని ప్రభావితం చేస్తున్నారని పోలీసులు భావిస్తే నేరుగా సుప్రీంను ఆశ్రయించవచ్చునని తెలిపింది.

ఐదుగురు అనుమానిత ఉగ్రవాదుల అరెస్టు



సాక్షి, బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఐదుగురు అనుమానిత ఉగ్రవాదులను నగర సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో బాంబు పేలుళ్ల ద్వారా విధ్వంసానికి పాల్పడేందుకు ఈ ఐదుగురు ముష్కరులు సుహైల్, ఉమర్, తర్బేజ్, ముదాసీర్, ఫైజల్ కుట్ర పన్నినట్లు పోలీసులు చెప్పారు. వారిని ఎన్ఐఏ కోర్టులో హాజరుపర్చగా, ఐదు రోజుల పాటు సీసీబీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దేశద్రోహ కార్యకలాపాలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న సీసీబీ పోలీసులు హెబ్బాళ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై హెబ్బాళ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి ఏడు దేశవాళీ పిస్తోళ్లు, 45 బుల్లెట్లు, వాకీటాకీ సెట్స్, 12 మొబైల్ ఫోన్లు, రెండు శాటిలైట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులో రద్దీ ప్రాంతాల్లో పేలుళ్లకు ప్రణాళికలు రూపొందించినట్లు విచారణలో నిందితులు అంగీకరించాని పోలీసులు వెల్లడించారు.



బెల్జియంలోని యాంట్‌వెర్ప్ పేరు చెబితే అందరికీ గుర్తొచ్చేది ఒక్కటే. ప్రపంచంలోనే వజ్రాల వ్యాపారానికి చిరునామాగా చలామణి అవుతున్న నగరమది. ఇప్పుడు ఆ పేరుకు చెల్లుచీటి రాసేస్తూ గుజరాత్‌లోని సూరత్ పట్టణం కొత్త అధ్యయనం లిఖించింది. ఒకేసారి 65,000 మందికిపైగా వ్యాపారులు, పనివాళ్లు, పరిశ్రమ నిపుణులు వచ్చి పనిచేసుకునేందుకు వీలుగా సువిశాల అధునాతన భవంతి అందుబాటులోకి వచ్చింది. 71 లక్షల చదరపు అడుగులకుపైగా ఆఫీస్ స్పేస్‌తో నూతన ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. అమెరికా రక్షణ శాఖ ప్రధానకార్యాలయం (పెంటగాన్) పేరిట ఉన్న ఈ రికార్డును చెరిపేసిన అద్భుత భవంతి విశేషాలు ఇవీ..

ఇది 'వజ్రాల వ్యాపార గని'

సూరత్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయం ఆవిష్కారం

35 ఎకరాల సువిశాల ప్రాంగణంలో నిర్మాణం

త్వరలో ప్రధాని మోదీ చేతుల మీదుగా కార్యకలాపాలు షురూ



విశ్వవ్యాప్తంగా వెలికితీసిన వజ్రాల్లో దాదాపు 90 శాతం వజ్రాలను సానబట్టేది సూరత్‌లోనే. దాంతో భారత్‌లో జెమ్ క్యాపిటల్‌గా సూరత్ కీర్తిగడించింది. అందుకే సూరత్‌లో వజ్రాల వ్యాపార అవసరాలు తీర్చేందుకు అనువుగా ఈ భవనాన్ని నిర్మించారు. దీనికి 'సూరత్ డైమండ్ బౌర్స్' అని నామకరణం చేశారు. బౌర్స్ పేరుతో గతంలో

రూ. 3,200 కోట్ల వ్యయంతో..

ఫ్రాన్స్‌లో పారిస్ స్టాక్‌ఎక్స్ఛేంజ్ ఉండేది. అంటే వజ్రాల వ్యాపారానికి సిసలైన చిరునామా ఇదే అనేట్లు దీనికి ఆ పేరు పెట్టారు. వజ్రాలను సానబట్టే వారు, వ్యాపారులు, కట్టర్స్ ఇలా వజ్రాల విపణిలో కీలకమైన వ్యక్తులందరూ తమ పని మొత్తం ఇక్కడే పూర్తిచేసుకోవచ్చు. తొమ్మిది దీర్ఘచతురస్రాకార భవంతులను విడివిడిగా నిర్మించి అంతర్గతంగా వీటిని కలుపుతూ డిజైన్‌చేశారు. మొత్తంగా 35 ఎకరాల్లో ఈ కట్టడం రూపుదాల్చింది. అంటే 71 లక్షల చదరపు అడుగుల ఆఫీస్‌స్పేస్ అందుబాటులోకి వచ్చింది. కోవిడ్ సమయంలో తప్పితే నాలుగేళ్లుగా విరామమెరుగక కొనసాగిన దీని నిర్మాణం ఇటీవలే పూర్తయింది. నవంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ప్రారంభోత్సవం జరిగే అవకాశం ఉంది. దాదాపు రూ.3,200 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. మొత్తంగా 4,700 భారీ దుకాణాలు ఇందులో ఉన్నాయి. అన్నివైపులా ఎక్కడికక్కడ అనువుగా 131 ఎలివేటర్లను ఏర్పాటుచేశారు. అందరికీ భోజన సదుపాయం, రిటైల్ వర్తకులకు ప్రత్యేక సౌకర్యాలు, వెల్‌నెస్, కార్మికుల కోసం సమావేశ మందిరాలను కొలువుతీర్చారు. '150 మైళ్ల దూరంలోని ముంబై నుంచి వేలాది మంది వ్యాపారాలు రోజూ సూరత్‌కు వచ్చిపోతుంటారు. ఇలా ఇబ్బంది పడకుండా వారికి సకల సౌకర్యాలు కల్పించాం' అని ప్రాజెక్టు సీఈవో మహేశ్ గఢావీ చెప్పారు.

ప్రజాస్వామ్య డిజైన్!

ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు డిజైన్ చేయాల్సిందిగా అంతర్జాతీయంగా బిడ్డింగ్‌కు ఆహ్వానించగా భారత్‌కే చెందిన మోర్ఫోజెనిసిస్ ఆర్కిటెక్చర్ సంస్థ దీనిని కైవసం చేసుకుంది. డైమండ్‌లకు ఉన్న డిమాండ్ ఈ ప్రాజెక్టు పరిమాణాన్ని అమాంతం పెంచేసింది. ఇప్పటికే అన్ని దుకాణాలను డైమండ్ కంపెనీలు నిర్మాణానికి ముందే కొనుగోలుచేయడం విశేషం. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ తరహాలో అన్ని బిల్డింగ్‌లను కలుపుతూ ఒక్కటే భారీ సెంట్రల్ కారిడార్‌ను నిర్మించారు. ''అందరికీ సమానంగా అన్ని సౌకర్యాలు అనే విధానంలో 'ప్రజాస్వామ్య' డిజైన్‌ను రూపొందించాం. సెంట్రల్ కారిడార్ ద్వారా అందరికీ అన్ని సౌకర్యాలు సమదూరంలో ఉంటాయి'' అని మోర్ఫోజెనిసిస్ సహ వ్యవస్థాపకురాలు సోనాలీ రస్తోగి చెప్పారు. అంటే ప్రధాన ద్వారాల్లో ఎటువైపు నుంచి లోపలికి వచ్చినా చివరి దుకాణానికి ఏడు నిమిషాల్లోపు చేరుకోవచ్చు. కాంక్రీట్ వనంగా కనిపించకుండా ఉండేందుకు 1.5 ఎకరాల విస్తీర్ణంలో పచ్చికబయళ్లను సిద్ధంచేశారు. ఇలాంటివి లోపల తొమ్మిది ఉన్నాయి.

ప్లాటినమ్ రేటింగ్

సూరత్‌కు దక్షిణంగా 1,730 ఎకరాల్లో స్మార్ట్ సిటీని ఒకదానిని నిర్మిస్తే బాగుంటుందని ప్రధాని మోదీ గతంలో అభిలషించారు. ఆయన సంకల్పానికి బాటలు వేస్తూ ఇప్పుడు ఈ భవంతి నిర్మాణం పూర్తయ్యాక చుట్టూతా నూతన జనావాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పడతాయని భావిస్తున్నారు. ఎండాకాలంలో ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత 110 డిగ్రీస్ ఫారన్‌హీట్‌ను దాటుతుంది. అయినా సరే భవంతిలో ఎక్కువ ఇంధనం వాడకుండా పర్యావరణహితంగా డిజైన్‌చేశారు. సాధారణ భవనాలతో పోలిస్తే ఈ భవంతి 50 శాతం తక్కువ ఇంధనాన్ని వినియోగించుకుంటుంది. అందుకే దీనికి ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ 'ప్లాటినమ్' రేటింగ్‌ను కట్టబెట్టింది. మధ్యమధ్యలో వృత్తాకారంగా వదిలేసిన శ్లాబ్స్ కారణంగా గాలి ధారాళంగా దూసుకొచ్చి బిల్డింగ్ లోపలి భాగాలను చల్లబరుస్తుంది. దాదాపు సగం భవంతి సాధారణ వెంటిలేషన్ ద్వారానే చల్లగా ఉంటుంది. ఇక మిగతా కామన్ ఏరియాస్‌లో సౌర ఇంధనాన్ని వినియోగించనున్నారు. ఆకృతిపరంగానేకాదు పర్యావరణహిత, సుస్థిర డిజైన్‌గా ఈ భవంతి భాసిల్లనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



కట్టడం కథ లెక్కల్లో..

- మొత్తం కట్టింది: 35 ఎకరాల్లో
- భారీ దుకాణాలు: 4,700
- అందుబాటులోకొచ్చే ఆఫీస్ స్పేస్: 71 లక్షల చదరపు అడుగులు
- ఎలివేటర్లు: 131
- బిల్డింగ్ రేటింగ్: ప్లాటినమ్
- మొత్తం వ్యయం: రూ.3,200 కోట్లు

టమాటా లీలలు... అన్ని ఇన్ని కావయా...

మహారాష్ట్ర రైతుకు నెలలో రూ. 3 కోట్లు కురిపించిన టమాటా



పుణే: విపరీతంగా పెరిగిపోయిన టమాటా ధరలతో సామాన్య వినియోగదారుల జేబులకు చిల్లు పడుతోంది. మహారాష్ట్రలో పుణే జిల్లాకు చెందిన ఓ రైతు మాత్రం టమాటాలతో కేవలం ఒక నెల వ్యవధిలో ఏకంగా రూ.3 కోట్లు ఆర్జించాడు. ఒక్కసారిగా ధనవంతుడైపోయాడు. పుణే జిల్లాలో జున్నార్ తహసీల్ పరిధిలోని పాచ్‌గఢ్ గ్రామంలో రైతు ఈశ్వర్ గాయ్‌కర్(36) చాలా ఏళ్లుగా టమాటా పంట సాగు చేస్తున్నాడు. ఇన్నాళ్లూ నష్టాలే చవిచూశాడు. ఈ ఏడాది మే నెలలో సరైన ధర లేక టమాటాలను వృథాగా పారబోశాడు. ఇప్పుడు ధరలు పెరగడంతో ఈశ్వర్ పంట పండింది. అతడి శ్రమ ఫలించింది. జూన్ 11 నుంచి జూలై 18 మధ్య 3,60,000 కిలోల టమాటాలను సమీపంలోని నారాయణగావ్ మార్కెట్‌లో విక్రయించాడు. రూ.3 కోట్ల ఆదాయం కళ్లజూశాడు. తన పొలంలో మరో 80,000 కిలోల పంట ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని, మరో రూ.50 లక్షల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఈశ్వర్ చెప్పాడు. టమాటా పంట సాగు, రవాణాకు రూ.40 లక్షలు ఖర్చయినట్లు తెలిపాడు. తనకు 18 ఎకరాల భూమి ఉందని, అందులో 12 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నానని వెల్లడించాడు. జూన్ 11న కిలోకు రూ.38 చొప్పున, జూలై 18న కిలోకు రూ.110 చొప్పున ధర పలికిందని ఆనందం వ్యక్తం చేశాడు. టమాటా సాగుదారులకు ఇది మంచి కాలమని, కానీ, ఒక రైతుగా ఎన్నో గడ్డు రోజులు కూడా చూశానని అన్నాడు. టమాటాలకు కిలోకు రూ.రెండున్నర సైతం రాని రోజులు ఉన్నాయని వివరించారు. టమాటాల సాగు వల్ల 2021లో తనకు దాదాపు రూ.16 లక్షల నష్టం వచ్చిందని, 2022లో మాత్రం స్వల్పంగా లాభపడ్డానని చెప్పాడు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రకు చెందిన మరో రైతు రాజు మహాలే టమాటాల సాగుతో ఈ సీజన్‌లో రూ.20 లక్షలు సంపాదించాడు.

అలా అయితే కిలో టమాటాలు ఫ్రీ

ఛండీగఢ్ ఆటోవాలా వినూత్న ఆఫర్

తన ఆటో ఎక్కితే కిలో టమాటాలు ఫ్రీగా ఇస్తానంటూ చండీగఢ్‌లో అరుణ్ అనే ఓ ఆటో డ్రైవర్ ఆఫర్ ప్రకటించాడు. అయితే కనీసం ఐదుసార్లు తన ఆటో ఎక్కిన వారికే ఆఫర్ వర్తిస్తుందంటూ తిరకాసు పెట్టాడు! మనవాడిది ముందునుంచీ సేవాగుణమే. 12 ఏళ్లుగా సైనికులను ఫ్రీగా ఆటో ఎక్కించుకుంటున్నాడు. అంతేకాదు, గర్భిణులను ఉచితంగా ఆస్పత్రికి కూడా చేరేస్తుంటాడు. ''ఆటోయే నా జీవనాధారం. కాబట్టి టమాటాల హవాను ఇలా అదనపు ఆదాయ మార్గంగా మార్చుకోవాలని వినూత్న ఆలోచన చేశానంతే. అయితే మన సైనిక వీరులకు, కాబోయే తల్లులకు చేసే సేవలోనే నాకు అమితమైన తృప్తి దొరుకుతుంది'' అని చెబుతాడు అరుణ్. అక్టోబర్లో పాకిస్తాన్‌తో చండీగఢ్‌లో జరగబోయే క్రికెట్ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే వరుసగా ఐదు రోజుల పాటు అందరికీ తన ఆటోలో ఉచిత ప్రయాణమేనని ప్రకటించేశాడు అరుణ్!

కిలో.70కే సబ్సిడీ టమాటా: కేంద్రం

టమాటాలను ఇప్పటికే కిలో కేవలం రూ.80కి విక్రయిస్తున్న కేంద్రం, తాజాగా సబ్సిడీని మరో 10 రూపాయలు తగ్గించింది. గురువారం నుంచి రూ.70కే కిలో టమాటాలు అందుబాటులోకి వస్తాయని ప్రకటించింది. టమాటాల రేటు కొంతకాలంగా చుక్కలనంటుతున్న నేపథ్యంలో ఢిల్లీలోనూ, దేశవ్యాప్తంగా పలు ఇతర కీలక నగరాల్లోనూ వాటిని సబ్సిడీపై కేంద్రం అందుబాటులోకి తేవడం తెలిసిందే.

నేటి నుంచే సభా సమరం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు అధికార, విపక్షాలు సన్నద్ధం

- అధికార పక్షాన్ని ఇరుకున పెట్టడమే లక్ష్యంగా విపక్షాల వ్యూహాలు
- యూసీసీ, ఢిల్లీ ఆర్డినెన్స్ సహా 21 బిల్లులు ప్రవేశపెట్టేందుకు కేంద్రం కసరత్తు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ సాక్షిగా అధికార, విపక్షాల మధ్య వాడీవేడి చర్చలు, సంవాదాలకు రంగం సిద్ధమయ్యింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం ఆరంభం కానున్నాయి. ఇరుపక్షాలు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు అధికార, ప్రతిపక్ష నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. మణిపూర్‌లో జాతుల మధ్య రగులుతున్న హింస, ఉమ్మడి పౌరస్మృతి బిల్లు, పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి అంశాలపై సభలో గట్టిగా నిలదీసి, కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్ష కూటమి సిద్ధమవుతోంది. తిప్పికొట్టేందుకు అధికార పక్షం ప్రతివ్యూహాలు పన్నుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి. 23 రోజుల పాటు జరిగే ఈ సెషన్‌లో మొత్తం 17 రోజుల పాటు పార్లమెంట్ భేటీ కానుంది. పార్లమెంటరీ వర్గాల సమాచారం ప్రకారం.. వర్షాకాల సమావేశాలు పాత పార్లమెంట్ భవనంలో ప్రారంభమై, సమావేశాల మధ్యలో నూతన భవనానికి మారుతాయి. ఈసారి మొత్తం 21 బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇందులో ప్రధానమైంది ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) బిల్లు.



అఖిలపక్ష భేటీలో పాల్గొన్న మంత్రులు రాజ్‌నాథ్, మేఘ్వాల్, పలు పార్టీల నేతలు

యూసీసీ, ఢిల్లీ ఆర్డినెన్స్‌పై రగడ తప్పదా?

మణిపూర్‌లో హింసాకాండపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సహా ఇతర ప్రతిపక్షాలు గట్టి పట్టుదలతో ఉన్నాయి. యూసీసీ బిల్లుపై కాంగ్రెస్, బీఆర్ఎస్, టీఎంసీ సహా ఇతర విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే అన్ని స్థాయిల్లో అడ్డుకునేందుకు వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నాయి. ఢిల్లీ విషయంలో కేంద్ర ఆర్డినెన్స్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఆయన బీఆర్ఎస్, టీఎంసీ, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల మద్దతు కూడగట్టారు.

జోషి ఆధ్వర్యంలో అఖిలపక్షం భేటీ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు ప్రస్తావించే అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు. జోషి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కీలకపార్టీల నేతలు పాల్గొన్నారు. 32 అంశాలు పార్లమెంట్‌లో ప్రస్తావనకు రానున్నట్లు జోషి చెప్పారు. కాగా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా సాగాలని కేంద్ర ప్రభుత్వం నిజంగా కోరుకుంటే, సభలో ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ అధిర రంజన్ చౌదరి అన్నారు. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అని వ్యాఖ్యానించారు.

మా డిమాండ్‌కు వైఎస్సార్‌సీపీ, బీఆర్ఎస్ మద్దతు: బీజేడీ

వర్షాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని బిజూ జనతాదళ్(బీజేడీ) ఎంపీ శశ్మిత్ పాత్రా కోరారు. అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై తమ డిమాండ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, వామపక్షాలు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు.

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే నియామకానికి రాష్ట్రపతి ముర్ము ఆమోదముద్ర వేశారు. ఒరిస్సా, గుజరాత్, కేరళ హైకోర్టులకూ నూతన సీజేలను నియమించారు. ఈ వివరాలను న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ బుధవారం ట్వీట్‌చేశారు. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అలోక్ అరాధేను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా , ఒరిస్సా హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుభాషిశ్ తాళపత్రను అదే హైకోర్టుకు సీజేగా ఖరారు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఒరిస్సా హైకోర్టులో ప్రస్తుత సీజే ఆగస్టు ఏడున రిటైర్ అయ్యాక జస్టిస్ సుభాషిశ్ సీజేగా బాధ్యతలు స్వీకరిస్తారు. అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్‌ను గుజరాత్ హైకోర్టు సీజేగా నియమించారు. గుజరాత్ హైకోర్టులో జడ్జి అయిన జస్టిస్ ఆశిశ్ జె.దేశాయ్‌ను కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఈ నెల మొదట్లో ఈ హైకోర్టులతోపాటు ఆంధ్రప్రదేశ్, మణిపూర్ హైకోర్టులకూ సీజేలుగా జడ్జీల పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేయగా ఏపీ, మణిపూర్ హైకోర్టుల్లో నియామకాలపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు జడ్జి అయిన జస్టిస్ పి.సామ్ కోషీని తెలంగాణ హైకోర్టుకు బదిలీచేశారు.

సింగపూర్ పాస్‌పోర్టు పవర్‌ఫుల్ ..!

లండన్: ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టు కలిగిన దేశంగా సింగపూర్ నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. ఈ దేశం పాస్‌పోర్టు ఉంటే ఎలాంటి వీసా లేకుండా 192 దేశాలకు ప్రయాణించవచ్చు. ఇన్నాళ్లూ నెంబర్ వన్ స్థానంలో ఉంటూ వచ్చిన జపాన్‌ను తోసిరాజని సింగపూర్ మొదటి ర్యాంక్ దక్కించుకుంది. హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ 2023 సంవత్సరానికి విడుదల చేసిన జాబితాలో సింగపూర్ తొలిస్థానంలో నిలిస్తే భారత్ 80వ ర్యాంక్ దక్కించుకుంది. భారత్ వీసా ఉంటే ఇండోనేసియా, రువాండా, జమైకా, శ్రీలంక వంటి దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. కానీ ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా 177 దేశాలకు భారతీయులు వెళ్లాలంటే వీసా తీసుకొని తీరాలి. అమెరికా, చైనా, రష్యా, జపాన్ సహా పలు యూరోపియన్ యూనియన్ దేశాలకు వీసా తప్పకుండా తీసుకోవాలి. వీసా లేకుండా పాస్‌పోర్టు సాయంతో ఎన్ని దేశాలకు వెళ్లగలరు అనే అంశం ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. లండన్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఐఏటీఏ) ఇచ్చే డేటా ఆధారంగా తొలిసారిగా ఈ జాబితా రూపొందించింది. జాబితాలో అమెరికాకు ఎనిమిదో స్థానం, యూకే నాలుగో ర్యాంకులో ఉంటే అట్టడుగు స్థానంలో అఫ్గానిస్తాన్ నిలిచింది.

34 మంది మృతి

అల్జీర్స్: దక్షిణ అల్జీరియాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జాతీయ రహదారిపై బస్సు, వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 34 మంది మరణించారు. మరో 12 మంది గాయాలపాలయ్యారు. పరస్పరం ఢీకొన్న వెంటనే రెండు వాహనాల్లోనూ మంటలు చెలరేగాయని, అందుకే భారీగా ప్రాణనష్టం జరిగిందని అధికారులు చెప్పారు. సహారా ఎడారి సమీపంలో తామన్‌రసెట్ ప్రావిన్స్‌లో తెల్లవారుజామున 4 గంటలకు ఈ దుర్ఘటన జరిగింది.

కర్ణాటకలో 10 మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్

సాక్షి బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌పై అనుచితంగా ప్రవర్తించిన పది మంది బీజేపీ ఎమ్మెల్యేలను స్పీకర్ యూటీ ఖాదర్ బుధవారం సభ నుంచి సస్పెండ్ చేశారు. అసెంబ్లీలో స్పీకర్ పోడియాన్ని ముట్టడించి బిల్లుల ప్రతులను చింపి డిప్యూటీ స్పీకర్ ముఖంపై విసిరేసి అగౌరవంగా ప్రవర్తించారనే కారణంగా వారిని సస్పెండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు, అంటే ఈ నెల 21 వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని స్పీకర్ యూటీ ఖాదర్ ప్రకటించారు. బెంగళూరులో జరిగిన ప్రతిపక్షాల మహాఘట బంధన్ సభలో పాల్గొనేందుకు వచ్చిన నేతలకు స్వాగతం పలికేందుకు ఐఏఎస్ అధికారులను పంపడంపై బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తీవ్రనిరసన తెలపడంతో స్పీకర్ పైవిధంగా స్పందించారు. బీజేపీ, జేడీ(ఎస్) ఎమ్మెల్యేలు స్పీకర్ ఖాదర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం నోటీసును అసెంబ్లీ సెక్రెటరీకి అందజేశారు. మాజీ సీఎంలు బొమ్మై, కుమారస్వామి తదితరులు దీనిపై సంతకాలు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి 15 మంది దుర్మరణం

చమోలీ: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. చమోలీ జిల్లాలో అలకనంద నదీ తీర ప్రాంతంలో నమామి గంగే ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మురికినీటి శుద్ధి కర్మాగారంలో మంగళవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ పేలడం వల్ల విద్యుదాఘాతంతో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. జిల్లా ఎస్పీ ప్రమేంద్ర డోభాల్ అందించిన వివరాల ప్రకారం.. మురుగుశుద్ధి నీటి ప్లాంట్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ప్లాంట్ ప్రాంగణంలోని మెటల్ రైలింగ్‌లోకి విద్యుత్ ప్రసరించింది. అదే సమయంలో అక్కడున్న పలువురు కరెంట్‌షాక్‌కు గురయ్యారు. మరణించిన 15 మందిలో ఒక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు హోంగార్డులు ఉన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ ధామీ ప్రకటించారు. క్షతగాత్రులను హెలికాప్టర్‌లో రిషికేష్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

గుజరాత్‌ను ముంచెత్తిన వరద



సౌరాష్ట్ర ప్రాంతంలో వర్షపునీటిలో తేలుతున్న వాహనాలు

అహ్మదాబాద్: గుజరాత్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. ప్రధానంగా సౌరాష్ట్ర ప్రాంతంలో పరిస్థితి భీతావహంగా మారింది. రోడ్లు జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. పొలాల్లో పంటలు నీట మునిగాయి. కొన్ని గ్రామాలకు బాహ్య ప్రపంచంతో అనుసంధానం తెగిపోయింది. జునాగఢ్ జిల్లాలోని మంగ్రోల్ తాలూకాలో ఇళ్లలోకి నీరు చేరింది. జన జీవనం స్తంభించింది. ఇక్కడ గత 8 గంటల్లో 290 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. డ్యామ్‌లు నిండిపోవడంతో నీటిని కిందికి వదిలారు. నదులు పొంగిపొర్లుతున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



ఒత్తిడిలోనూ సడలని ధైర్యం

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ బెంగళూరులో మంగళవారం జరిగిన విపక్షాల సమావేశంలో పాల్గొని విమానంలో ఢిల్లీకి తిరిగి వస్తుండగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానంలో సోనియా ఆక్సిజన్ మాస్క్ ధరించారు. ఈ చిత్రాన్ని రాహుల్ గాంధీ బుధవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ఒత్తిడిలోనూ సడలని ధైర్యం అంటూ తన తల్లికి కితాబిచ్చారు.

జీతేగా భారత్

విపక్ష కూటమి 'ఇండియా' ట్యాగ్‌లైన్

న్యూఢిల్లీ: 26 ప్రతిపక్షాలలో కూడిన 'ఇండియా' కూటమి జీతేగా భారత్(భారతదేశం జయిస్తుంది)ను తమ ట్యాగ్‌లైన్‌గా ఖరారు చేసుకుంది. వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా ఈ నినాదాన్ని ఎంచుకుంది. హిందీలో ఉన్న ఈ నినాదం ఇతర ప్రాంతీయ భాషలు మాట్లాడే వారికి సులభంగా అర్థమవుతుందని, వారు దాన్ని సొంతం చేసుకుంటారని భావిస్తున్నట్లు విపక్ష నేత ఒకరు అభిప్రాయపడ్డారు. కాగా, విపక్ష కూటమి 'ఇండియా' తొలి సమావేశం గురువారం జరగనుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై ప్రతిపక్ష నేతలు చర్చించనున్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత అయిన కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో ఈ భేటీ జరుగుతుంది. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో కేంద్రాన్ని ఇరుకున పెట్టాలని, ఈ అంశంలో కలసికట్టుగా వ్యవహరించాలని ప్రతిపక్ష నాయకులు నిర్ణయించుకున్నారు.

కొత్త సీసాలో పాత సారా

వందేమాతరం ఆలపించను, ఒకరికి తలవంచను, అందుకు నా మతం అంగీకరించదు అంటూ సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబూ అజ్మీ మహారాష్ట్ర అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పేరు మారినా విపక్ష కూటమి బుద్ధి మారలేదని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. విపక్షకూటమిలో ఎస్పీ ఉంది. పేరు మార్చుకున్నంత మాత్రాన వ్యక్తుల మనస్తత్వం మారదని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ పేర్కొన్నారు. విపక్ష కూటమి కొత్త సీసాలో పాత సారాలా ఉందని ఎద్దేవా చేశారు.

వండలూరు జూలో టిక్కెట్ ధర పెంపు

అన్నానగర్: వండలూరు జూకు సందర్శకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇక్కడికి రోజుకు సగటున 2,500 నుంచి 3,000 మంది వస్తున్నారు. ముఖ్యంగా వారాంతాల్లో దాదాపు 10 వేల మంది వరకు వస్తుంటారు. 602 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ పార్కులో 2,400 జంతువులు ఉన్నాయి. వండలూర్ జూ బెస్ట్ పార్క్ అమాంగ్ జూ అవార్డును సైతం కైవసం చేసుకుంది. పార్కును సందర్శించేందుకు టికెట్ ధర ఇప్పటి వరకు రూ.100 ఉండేది. ఈ ఫీజును తాజాగా రూ.200కు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కొత్త చార్జీల పెంపు త్వరలో అమల్లోకి రానుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఈరోడ్‌లో ఎన్‌ఐఏ సోదాలు

సాక్షి, చెన్నై: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) బుధవారం ఈరోడ్‌లో సోదాలు నిర్వహించింది. నిషేధిత సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఆసిఫ్ అనే యువకుడిని అదుపులోకి తీసుకుని అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కాలంలో కోయంబత్తూరు, ఈరోడ్, సేలంలో ఎన్‌ఐఏ సోదాలు విస్తృతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నారు.

పవన్ కల్యాణ్ నిజాలు తెలుసుకోవాలి

- ద్రవిడదేశం అధ్యక్షుడు కృష్ణారావు హితవు



కొరుక్కుపేట: ఇటీవల జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తిరుపతి ఎస్పీని కలసి శ్రీకాళహస్తి సీఐ అంజూ యాదవ్‌పై ఫిర్యాదు చేయడాన్ని చెన్నైకు చెందిన ద్రవిడదేశం అధ్యక్షులు వి.కృష్ణారావు ఓ ప్రకటనలో ఖండించారు. నిజాయితీ గల పోలీసు ఆఫీసర్ అయిన అంజూ యాదవ్ అంటే అందరికీ హడల్ అనే విషయం ఆంధ్ర రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ తెలుసన్నారు. ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలో సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్న ఓ మహిళను ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా అరెస్టు చేసి సారా వ్యాపారాన్ని సీఐ అరికట్టారని కొనియాడారు. అదే క్రమంలో గతవారం శ్రీకాళహస్తిలో ఏపీ సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను తన అనుచరులతో రోడ్డుపై తగలబెట్టేందుకు యత్నించిన జనసేన నాయకులను సీఐ అడ్డుకున్నారన్నారు. అయితే పోలీసులు హెచ్చరించినా వారు వినకుండా ఇష్టారాజ్యంగా వ్యవహించారని ఆరోపించారు. ఈక్రమంలో చట్టాన్ని కాపాడేందుకే అంజూ యాదవ్ యత్నించారన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా సీఐపై చర్యలు తీసుకోవాలని కోరడం పవన్‌కు తగదన్నారు.

భార్యను కడతేర్చిన భర్తకు యావజ్జీవం

అన్నానగర్: భార్యను హత్య చేసిన భర్తకి తిరుచ్చి మహిళా కోర్టు మంగళవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. వివరాలు.. తిరుచ్చి జిల్లా మన్నచ్చనల్లూరు నార్త్ ఎచంపట్టి మధ్య వీధికి చెందిన బాలచంద్రన్ (43) భార్య మహాలక్ష్మి (36). ఈ దంపతులకు గోదర్శన్ (12), శివకార్తికేయన్ (11) అనే కుమారులున్నారు. సింగపూరులో ఉద్యోగం చేస్తున్న బాలచంద్రన్ 2019లో స్వగ్రామానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా భార్య ప్రవర్తనపై అతడికి అనుమానం వచ్చింది. ఫలితంగా తరచూ వారి మధ్య గొడవలు జరిగేవి. 2019 మార్చి 16న వారి మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకోవడంతో కోపోద్రిక్తుడైన బాలచంద్రన్ కత్తితో భార్య గొంతు కోసి హత్య చేశాడు. పోలీసులు బాలచంద్రన్‌ను అరెస్టు చేసి తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు. తిరుచ్చి మహిళా కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎస్ శ్రీవత్సవ్ బుధవారం ఈ కేసు విచారణ జరిపి నిందితుడికి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధించారు.

రైలులో 11 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్టు

అన్నానగర్: మోరాపూర్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో బుధవారం వేకువజామున ప్రొహిబిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులు గస్తీ నిర్వహించారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా నిలబడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆంధ్రా నుంచి కేరళకు 11 కిలోల గంజాయిని అక్రమంగా తరలించేందుకు వారు ప్రణాళిక రచించినట్లు గుర్తించారు. అనంతరం వారి వద్ద నుంచి 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రెండు టిప్పర్లు ఢీ- డ్రైవర్ మృతి



గుణశేఖరన్(ఫైల్)

వేలూరు: తిరుపత్తూరు జిల్లా వానియంబాడి సమీపంలోని పెరుమాల్ పేట ప్రాంతంలోని సర్వీస్ రోడ్డు నుంచి కంకరతో కూడిన టిప్పర్ లారీ జాతీయ రహదారిపైకి వచ్చింది. ఆ సమయంలో కృష్ణగిరి జిల్లా హోసూరు నుంచి ద్విచక్ర వాహనాల విడిభాగాలతో వస్తున్న మరో టిప్పర్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకు విడి భాగాలను తీసుకెళ్తున్న టిప్పర్ డ్రైవర్ తిరుపత్తూరకు చెందిన గుణశేఖరన్(50) అక్కడిక్కడే మృతి చెందాడు. అతివేగంగా వెనుక వైపు నుంచి టిప్పర్ ఢీకొనడంతో మరో టిప్పర్ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో గుణశేఖరన్ మృతదేహాన్ని బయటకు తీసేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకూ పోలీసులు తీవ్రంగా ప్రయత్నించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ప్రమాదం కారణంగా సుమారు గంట పాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ఈ మేరకు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చక్రం తిప్పేదెవరో..?

డీఎంకే అధ్యక్షుడు, సీఎంగా ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎంగా పళనిస్వామి జాతీయ రాజకీయాల్లో రాణించడమే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇందుకోసం రానున్న లోక్‌సభ ఎన్నికలను ఈ ఇద్దరూ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన ఎన్‌డీఏ భేటీలో పళణి స్వామికి ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ పక్కనే కూర్చునే అవకాశం రావడం అన్నాడీఎంకే వర్గాల్లో అమితానందాన్ని నింపింది. ఇక బెంగళూరులో జరిగిన ఐ.ఎన్.డి.ఐ.ఎ భేటీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ పక్కనే కూర్చోవడంతో పాటు జాతీయ స్థాయి ప్రతిపక్షాల కూటమిలో స్టాలిన్‌కు సముచిత స్థానం దక్కడం ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో జాతీయ రాజకీయాల్లో ఎవరు చక్రం తిప్పుతారనే చర్చ జోరందుకుంది.

- జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారిన స్టాలిన్, పళణి స్వామి
- కూటమి సమావేశాల్లో తమిళనేతలిద్దరికీ సముచిత స్థానం
- సీఎం వర్సెస్ మాజీ సీఎంగా మారిన పరిస్థితులు
- ఎవరిది పైచేయి అవుతుందోనంటూ ఊహాగానాలు



స్టాలిన్, రాహుల్ చర్చ



మోదీ పక్కనే పళణి స్వామి

సాక్షి, చెన్నై: జాతీయ రాజకీయాల్లో తమిళనాడు పాత్ర ఎప్పుడూ కీలకంగానే ఉంటున్నాయి. దివంగత నేతలు కామరాజర్, అన్నాదురై, ఎంజీఆర్ వంటి వారు జాతీయ రాజకీయాలలో రాణించిన వారే. అయితే, జాతీయ రాజకీయాలను శాసించిన ఘనత మాత్రం దివంగత డీఎంకే అధినేత, కలైంజ్ఞర్ కరుణానిధి, మాజీ సీఎం జయలలితలకే దక్కింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అప్పట్లో కుప్ప కూలడంలో జయలలిత కీలక పాత్రే పోషించారు. ఇక, యూపీఏ అధికారంలోకి రావడంతో పాటు, ఆ కేబినెట్లలో అత్యధిక స్థానాలను దక్కించుకుని జాతీయ స్థాయిలో తమిళ ఖ్యాతిని చాటిన నేత మాత్రం కరుణానిధి. ప్రస్తుతం ఈ ఇద్దరు నేతలూ జీవించి లేరు. జయలలిత మరణంతో అన్నాడీఎంకే ముక్కలు కావడం ,నాయకత్వ లోటు నెలకొనడం వంటి పరిణామాలలో ఆ పార్టీని తన గుప్పెట్లోకి తీసుకుని బల నిరూపణలో పళణి స్వామి సఫలీకృతులు అవుతున్నారు. అదే సమయంలో కరుణానిధి మరణంతో డీఎంకే అధ్యక్ష పగ్గాలు చేపట్టి గత లోక్‌సభ ఎన్నికల్లో తన సత్తాను స్టాలిన్ చాటుకున్నారు. అలాగే 2021 అసెంబ్లీ ఎన్నికలలో గెలుపుతో రాష్ట్ర అధికార పగ్గాలు చేపట్టిన స్టాలిన్ తాజాగా జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషించే దిశగా వ్యూహాలకు పదును పెట్టారు. జాతీయ స్థాయిలో చక్రం తిప్పిన రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహానాయకులు ప్రస్తుతం జీవించి లేకున్నా, ఆ పార్టీల బలాన్ని అస్త్రంగా చేసుకుని ఢిల్లీ పెద్దలు స్టాలిన్, పన్నీరు సెల్వంకు ఎన్‌డీఏ, ఇండియా కూటముల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.

పళణికి మోదీ అభయం..

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళణి స్వామి రాజకీయ వ్యూహాలకు పదును పెట్టమే కాకుండా, తన బలాన్ని చాటే ప్రయత్నాలను విస్తృతం చేశారు. ఈ సమయంలో ఎన్‌డీఏ కూటమిలోని అన్నాడీఎంకేకు కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా, ఢిల్లీలో జరిగిన సమావేశానికి తనను ఆహ్వానించడం పళణి స్వామిలో మరింత ఉత్సాహాన్ని నింపింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పక్కనే కూర్చోవడమే కాకుండా, సమావేశానికి హాజరైన నేతలందరినీ కలిసి తన ఉనికి చాటుకునే విధంగా పళణి జోరు పెంచడం గమనార్హం. ఈ సమావేశం ముగించుకుని బుధవారం చెన్నైకు చేరుకున్న పళణిలో మరింత ఉత్సాహం తొణికిసలాడడం.. ప్రత్యర్థి పన్నీరు సెల్వాన్ని మరింత షాక్‌కు గురి చేసింది. రానున్న ఎన్నికల ద్వారా జాతీయ స్థాయిలో సత్తాచాటాలంటే అత్యధిక ఎంపీ స్థానాల కైవసం చేసుకోవాలని పళణి భావిస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో కూటమికి నేతృత్వం వహించి అన్నాడీఎంకేకు పెద్ద దిక్కుగా తన బలాన్ని చాటుకోవాల్సిన అవసరం ఉంది. ఇక, రాష్ట్రంలో అన్నాడీఎంకే నేతృత్వంలోనే కూటమి ఉంటుందని పళణి స్పష్టం చేయడం విశేషం. జాతీయ స్థాయిలో తాము ఎన్‌డీఏతోనే ఉంటామని, రాష్ట్రానికి వచ్చేసరికి అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇక అవినీతికి కేరాఫ్ అడ్రస్సుగా మారిన డీఎంకేకు ముస్ముందు అన్నీ ఓటములే ఎదురుకానున్నాయంటూ ఆయన పేర్కొనడం గమనార్హం.

తిరుగులేని స్టాలిన్..

స్టాలిన్‌కు జాతీయస్థాయి నేతలతో ఎప్పటి నుంచో పరిచయాలు, సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కరుణానిధి ప్రతినిధిగా అప్పట్లో ఆయన అనేక పార్టీల నేతలను కలిసిన సందర్భాలు ఉన్నాయి. ఇది ప్రస్తుతం జాతీయ రాజకీయాలలో రాణించే ప్రయత్నాలకు కలిసి వస్తోంది. దేశంలో కాంగ్రెస్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న పార్టీ డీఎంకే. ఇది వరకు కాంగ్రెస్ కూటమిలో కీలకంగా ఉన్న డీఎంకే, ప్రస్తుతం రెండు రోజుల సమావేశానంతరం బెంగళూరు వేదికగా కొత్తగా ఆవిర్భవించిన ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఐఎన్‌డీఐఏ-ఇండియా)లోనూ అదే ఊపును కొనసాగించే వ్యూహాలకు పదును పెట్టింది. బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన సమావేశంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ పక్కనే కూర్చోవడమే కాకుండా, సోనియా, మమత, నితీష్‌కుమార్ , శరద్ పవార్, కేజ్రీవాల్ వంటి నేతలతో స్టాలిన్ కలిసి పోవడం గమనార్హం. తన ప్రసంగంలోనూ జాతీయ స్థాయి అంశాలను పదే పదేస్టాలిన్ ప్రస్తావించడాన్ని బట్టి ముస్ముందు ఢిల్లీలో తన తండ్రి, దివంగత నేత కరుణానిధి తరహాలో చక్రం తిప్పేందుకు స్టాలిన్ ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందులో ఆయన ఏ మేరకు సఫలీకృతులు అవుతారో 2024 వరకు వేచి చూడాల్సిందే. ఈ ఎన్నికల్లో పుదుచ్చేరితో పాటుగా తమిళనాడులోని 40 స్థానాలను కైవశం చేసుకుని జాతీయ స్థాయిలో తన బలాన్ని చాటేందుకు స్టాలిన్ సిద్ధమవుతున్నారు. ఇందుకు అద్దం పట్టే విధంగా ఆయన రాష్ట్రంలో ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న అన్నాడీఎంకే, బీజేపీని టార్గెట్ చేసి విమర్శలు గుప్పిస్తున్నారు. ఢిల్లీ సమావేశంలో పళణి స్వామిని మోదీ తన పక్కన కూర్చోబెట్టుకున్న అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇకపై వారికి అవినీతి గురించి మాట్లాడే అర్హత ఉందా..? ఇదే హాస్యాస్పదం అని స్టాలిన్ చమత్కరించడం గమనార్హం.

సీఎంతో పొన్ముడి భేటీ

- ఈడీ దాడులపై చర్చ
- మూడో రోజూ ఎంపీ గౌతమ్‌ను ప్రశ్నించిన అధికారులు



మంత్రులు పొన్ముడి, అనిత రాధాకృష్ణన్

సాక్షి, చెన్నై: బెంగళూరులో పర్యటన ముగించుకుని చెన్నైకు చేరుకున్న సీఎం స్టాలిన్‌తో ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి బుధవారం సమావేశమయ్యారు. ఈడీ సోదాలు, విచారణ గురించి ఈ మేరకు సీఎంకు ఆయన సమాచారం ఇచ్చారు. వివరాలు.. ఓ వైపు విపక్షాల సమావేశం నిమిత్తం సీఎం స్టాలిన్ బెంగళూరు వెళ్లారో లేదో మరో వైపు ఆయన కేబినెట్‌లోని ఉన్నత విద్యా మంత్రి పొన్ముడిని ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. ఆయన నివాసాలు, కార్యాలయాలలో సోదాల అనంతరం రూ.81 లక్షల నగదు, రూ.13 లక్షల విదేశీ కరెన్సీ, రూ.41.90 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశారు. విదేశాలలో పెట్టుబడులు తదితర అంశాలపై సోమవారం మూడు గంటలు, మంగళవారం ఆరు గంటలు పొన్ముడి వద్ద తీవ్ర విచారణ జరిగింది. బుధవారం మూడో రోజుగా పొన్ముడి తరపున ఆడిటర్లు విచారణకు హాజరయ్యారు. ఆయన వ్యవహారాలను పర్యవేక్షించే కీలక ఆడిటర్ ఒకరు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈడీకి కావాల్సిన సమాచాన్ని ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు పొన్ముడి తనయుడు, ఎంపీ గౌతమ్ శిఖామణిని విచారణకు ఈడీ పిలిచింది. దీంతో ఆయన తన న్యాయవాదులతో కలిసి ఈడీ విచారణకు వెళ్లారు. కొన్ని గంటల పాటు విచారణ కొనసాగుతోంది. ముందుగా ఆళ్వార్ పేటలోని నివాసంలో సీఎం స్టాలిన్‌ను పొన్ముడి కలిశారు. అర్ధగంట పాటుగా ఈ ఇద్దరు ఈడీ దాడుల అంశం గురించి చర్చించుకున్నారు. అలాగే, తనకు అండగా డీఎంకే ఉంటుందని సీఎం చేసిన వ్యాఖ్యలకు పొన్ముడి కృతజ్ఞతలు తెలియజేశారు.

తదుపరి టార్గెట్ అనిత రాధాకృష్ణన్

సెంథిల్, పొన్ముడి తదుపరి మత్స్యశాఖ మంత్రి అనితా ఆర్. రాధాకృష్ణన్‌ను ఈడీ టార్గెట్ చేస్తుండటం గమనార్హం. 2001-06లో అన్నాడీఎంకే హయాంలో గృహ నిర్మాణ మంత్రిగా ఉన్న కాలంలో అనితా రాధాకృష్ణన్ రూ. 4.90 కోట్లు అక్రమాస్తులు గడించినట్టు ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఆయన భార్య, ఇద్దరు కుమారులు, బంధువుపై ఈ కేసు పెట్టారు. 17 ఏళ్లుగా ఈ కేసు విచారణలో ఉంది. ప్రస్తుతం అనిత రాధాకృష్ణన్ డీఎంకేలోకి చేరి మత్స్యశాఖ మంత్రి అయ్యారు. పాత కేసులను తవ్వి డీఎంకే మంత్రులు సెంథిల్, పొన్ముడిను ఇరకాటంలో పడేసిన ఈడీ వర్గాలు, ప్రస్తుతం అనిత ఆర్‌రాధాకృష్ణన్‌ను టార్గెట్ చేయడం గమనార్హం. ఈ అక్రమాస్తుల కేసు ఆధారంగా చేసుకుని రంగంలోకి దిగే వ్యూహంతో ఉన్నారు. తూత్తుకుడి కోర్టులో ఈ కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో తమను కూడా ఈ కేసులో చేర్చాలని ఈడీ పిటిషన్ దాఖలు చేయడం తాజాగా వెలుగులోకి వచ్చింది. బుధవారం కోర్టుకు అనిత రాధాకృష్ణన్ కుమారులు, బంధువు విచారణకు హాజరైన సమయంలో ఈడీ అధికారులు సైతం తమ వాదనను ముందుంచే విధంగా దూకుడు ప్రదర్శించిన నేపథ్యంలో తదుపరి టార్గెట్ అనితా రాధాకృష్ణన్ అనే ప్రచారం జోరందుకుంది.

నేటి నుంచి టోకెన్ల పంపిణీ

- అధికారులతో మంత్రి పెరియకరుప్పన్ సమీక్ష

సాక్షి, చెన్నై: కోటి మంది గృహిణులకు నెలకు రూ. 1000 నగదు పంపిణీ పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. రేషన్ కార్డుల ఆధారంగా ఇంటింటా టోకెన్లను అందజేయనున్నారు. అలాగే ఈనె 24వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరం ఏర్పాటు కానుంది. వివరాలు.. ఎన్నికల వాగ్దానంగా గృహిణులకు నెలకు రూ. 1000 నగదు పంపిణీ పథకం అమలు సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సెప్టెంబరు 15వ తేదీ నుంచి ఈ పథకం అమల్లోకి రాబోతుంది. కోటి మంది గృహిణులు, చిరు వ్యాపారం చేసుకుంటున్న మహిళలు, చేపల అమ్మకాల్లోని మహిళా జాలర్లు, ఇంటి పని అంటూ చిన్న చిన్న పనులతో జీవనం సాగిస్తున్న మహిళలకు ఈ పథకం వర్తింప చేసే లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై సీఎం స్టాలిన్ పదే పదే అధికారులతో సమావేశమయ్యారు. ప్రత్యేక అధికారిని కూడా నియమించారు. ఈ పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానించేందుకు సిద్ధయ్యారు. గురువారం నుంచి రేషన్ దుకాణాల ద్వారా కుటుంబ కార్డులో పేరు కలిగిన మహిళలకు దరఖాస్తులను అందజేయనున్నారు. ఒకే సమయంలో దరఖాస్తుల పంపిణీ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తోపులాట, వివాదాలకు దారి తీయకుండా ముందు జాగ్రత్తలపై దృష్టి పెట్టారు. టోకెన్ల పంపిణీ ద్వారా ఆయా లబ్ధిదారులు తమకు కేటాయించిన సమయాల్లో తమ పరిధిలోని రేషన్ దుకాణాలకు వెళ్లి దరఖాస్తులను సమర్పించడం, అందులో ఏదేని సవరణలు ఉంటే అక్కడి సహాయకుల ద్వారా పూర్తి చేసి అందించేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చెన్నైలో 1,428 దుకాణాల ద్వారా 17.16 లక్షల మందికి దరఖాస్తులను ఇవ్వడానికి చర్యలు తీసుకున్నారు. ఇంటింటా వెళ్లి టోకెన్లను మహిళకు అందజేయనున్నారు. బుధవారం సచివాలయంలో సహకార మంత్రి పెరియ కరుప్పన్ అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల పంపిణీ, టోకెన్లకు సంబంధించిన వివరాలపై సమీక్షించారు. అలాగే, ఈనెల 24వ తేదీన లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నామని మంత్రి ప్రకటించారు.

అధిక ధరకు మద్యం విక్రయిస్తే వేటు తప్పదు

- ఉద్యోగులకు టాస్మాక్ హెచ్చరిక

సాక్షి, చెన్నై: మద్యం దుకాణాల్లో అధిక ధరకు విక్రయాలు జరిపితే సస్పెన్షన్ వేటు తప్పదని టాస్మాక్ ఉద్యోగులను మార్కెటింగ్ కార్పొరేషన్ హెచ్చరించింది. వివరాలు.. రాష్ట్రంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని మార్కెటింగ్ కార్పొరేషన్ నేతృత్వంలో రాష్ట్రంలో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 5,329 దుకాణాలను ఏర్పాటు చేసింది. వీటిలో ఏడాదికి సగటున మద్యం విక్రయాలు రూ. 30 వేల కోట్లకు పైగానే జరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో దశల వారీగా మద్యం దుకాణాల మూత నినాదంలో భాగంగా గత నెల 500 దుకాణాలను మూసి వేశారు. దీంతో సంఖ్య 4,829గా ఉంది. అదే సమయంలో టాస్మాక్ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది ఎంఆర్‌పీ ధర కంటే అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. క్వార్టర్ బాటిళ్లపై రూ. 10, ఆఫ్ ఫైస్ రూ. 20 నుంచి రూ.30, ఫుల్ బాటిల్‌పై రూ.40 నుంచి రూ.50 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. దీనిపై అనేక ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరాయి. ఎంఆర్‌పీ ధర కంటే అధికంగా వసూలు చేస్తున్న మొత్తం ఎవరికి చేరుతోందో...? అని ప్రతి పక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ పరిస్థితులలో ఆయా బ్రాండ్లు, బాటిళ్లకు అనుగుణంగా.. అధిక ధరకు విక్రయాలు జరిపిన పక్షంలో టాస్మాక్ సిబ్బందిని సస్పెండ్ చేస్తామని మార్కెటింగ్‌శాఖ బుధవారం హెచ్చరించింది. టాస్మాక్ మేనేజర్లు, ఆయా దుకాణాల సిబ్బందికి ఈమేరకు ఉత్తర్వులు జారి చేసినట్లు స్పష్టం చేసింది.

రూ.7.50 కోట్ల విలువైన ఆలయ భూమి స్వాధీనం

కొరుక్కుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాల మేరకు హిందూ మత సంక్షేమ శాఖ ఆధీనంలోని ఆలయాలకు చెందిన ఆస్తులను కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకునే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తాజాగా తెన్‌కాశి జాయింట్ కమిషనర్ అన్బుమణి సమక్షంలో పోలీసులు, దేవదాయ శాఖ అధికారులు ఆక్రమణకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో తెన్‌కాశి జిల్లా పన్‌బోలీ తిరుమలై కుమారస్వామి ఆలయానికి చెందిన రూ. 7.50 కోట్లు విలువైన భూమి ఉందని అధికారులు మంగళవారం వెల్లడించారు.

గుండా యాక్ట్ ప్రయోగించే అధికారం కలెక్టర్లకే..

- ఐపీఎస్‌లకు నో చాన్స్
- కోర్టుకు స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, చెన్నై: ఓ నిందితుడిపై గుండా చట్టం నమోదుకు అనుమతి ఇచ్చే అధికారం జిల్లాల కలెక్టర్లకే మాత్రమే ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఐపీఎస్‌లకు ఈ అధికారం ఇవ్వబోమని కోర్టుకు తేల్చి చెప్పింది. వివరాలు.. రాష్ట్రంలో ఒకే వ్యక్తి పలు నేరాలకు పాల్పడి అరెస్టయినా, గంజాయి వంటి మాదక ద్రవ్యాల విక్రయాల్లో పట్టుబడినా, ఇతర వివాదాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించినా అలాంటి వారిపై ప్రభుత్వం గుండా యాక్ట్ ప్రయోగిస్తోంది. ఈ చట్టం ప్రయోగిస్తే ఏడాది కాలం బెయిల్ కూడా దొరక్క జైలుకే పరిమితం కావాల్సి ఉంటుంది. ఈ చట్టాన్ని ప్రయోగించే ముందు జిల్లాల కలెక్టర్ అనుమతిని పోలీసులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రయోగానికి వ్యతిరేకంగా ఇప్పటికే అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. ఇటీవల మద్రాసు హైకోర్టు మధురై ధర్మాసనంలో గుండా యాక్ట్‌కు సంబంధించిన పిటిషన్ విచారణ సమయంలో చట్టంలో సవరణల ప్రస్తావన తెర మీదకు వచ్చింది. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లకు ఉన్న అధికారాలను రద్దుచేసి, జిల్లాల ఎస్పీలు, ఐజీ, డీఐజీ తదితర ఐపీఎస్‌లకు అధికారం కట్టబెట్టే అంశాలు పరిశీలనలోకి వచ్చాయి. చట్ట సవరణల కోసం కోర్టు నాలుగు వారాలు గడువును కేటాయించింది. బుధవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, గుండా చట్టం నమోదుకు అనుమతి ఇచ్చే అధికారం జిల్లాల కలెక్టర్లకు మాత్రమే ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ చట్టం దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో ఆ అధికారం ఐపీఎస్‌లకు కాకుండా జిల్లా కలెక్టర్లకు ఇచ్చామని పేర్కొంది. ఐపీఎస్‌లకు అధికారం అప్పగించిన పక్షంలో అది దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడింది.

స్వలింగ సంపర్కానికి నిరాకరించాడని..

- ఆరేళ్ల బాలుడిని హత్య చేసిన 18 ఏళ్ల యువకుడు



ట్యాంక్‌లోని మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) మృతి చెందిన బాలుడు

కొరుక్కుపేట: స్వలింగ సంపర్కానికి నిరాకరించాడనే కారణంతో ఆరేళ్ల బాలుడిని హత్య చేసిన 18 ఏళ్ల యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. వివరాలు.. ధర్మపురి జిల్లా కృష్ణాపురం సమీపంలోని కట్టంపట్టి ప్రాంతానికి చెందిన ఆది కరోల్ లారీ డ్రైవర్. అతని భార్య సుధ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు మధిరసు (6) కదూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఈనెల 16వ తేది సాయంత్రం ఇంటికి సమీపంలోని పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల సముదాయంలో ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు పలుచోట్ల వెతికారు. ఎలాంటి సమాచారం అందకపోవటంతో ఆదిమూలం కృష్ణాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని సోదాలు చేశారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం బాలుడితో ఆడుకున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విడివిడిగా విచారించారు. ఇందులో 18 ఏళ్ల యువకుడు పకీర్‌ను ప్రశ్నించగా అసలు విషయం తెలిసింది. ఇతడు ఆరేళ్ల బాలుడికి సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ వీడియోలు చూపిస్తూ.. స్వలింగ సంపర్కానికి యత్నించాడు. దీనికి బాలుడు నిరాకరించడంతో క్రరతో కొట్టి చంపేశాడు. తర్వాత మృతదేహాన్ని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో పడేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు ట్యాంక్ నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

బుల్లితెర నటుడితో ప్రాణహాని

- పోలీసులకు గాయకుడి ఫిర్యాదు

తమిళసినిమా: బుల్లితెర నటుడు ఈశ్వర్ రంగనాథన్ వల్ల తనకు ప్రాణహాని ఉందని గాయకుడు కృష్ణ చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో 'గత సోమవారం తాను సంగీత కచ్చేరిలో పాల్గొనడానికి ఓ ప్రైవేట్ హోటల్‌కు వెళ్లానన్నారు. అక్కడ బుల్లితెర నటుడు ఈశ్వర్ రరగనాథన్ సహ నటులతో ఉన్నాడన్నారు. తనను చూసిన అతను దగ్గరకు వచ్చి వెంటనే ఇక్కడి నుంచి వెనక్కి వెళ్లిపో అంటూ బెదిరించారన్నారు. కారణం అడగ్గా తనతో ఉన్న స్నేహితులను చూపించి వాళ్లు నిన్ను కొట్టి చంపుతారని, ఇక నువ్వు రోజులు లెక్కపెట్టుకో అని బెదిరించారన్నారు. నిజానికి అతనితో తనకెలాంటి విభేదాలు లేవన్నారు. తాను అతనితో మాట్లాడే చాలా ఏళ్లు అయ్యిందన్నారు. అశ్విన్ తనను చంపుతానని బెదిరించడానికి కారణం ఏమిటో తెలియదన్నారు. అతడు చెప్పినదంతా అక్కడి నిఘా కెమెరాల్లో నమోదైంది. ఈ నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలి..'అని కోరారు. ప్రస్తుతం తాను వయసు మళ్లిన తల్లితో జీవిస్తున్నానని, ఈశ్వర్ నుంచి తనకు ప్రాణహాని ఉందని తగిన రక్షణ కల్పించాలని పేర్కొన్నాడు.

చెన్నైలో 'పాప్' సాంస్కృతిక వేడుక



పాప్ కల్చర్ చాటే వేషాధారణలో ఔత్సాహికులు

సాక్షి, చెన్నై : విదేశాలలోని పాప్ కల్చర్‌ను చెన్నైలో పరిచయం చేసే విధంగా సాంస్కృతిక వేడుకకు సన్నాహాలు చేపట్టామని కామిక్ కాన్‌ఇండియా వ్యవస్థాపకుడు జతిన్ వర్మ తెలిపారు. పాప్ కల్చర్ ఔత్సాహికులతో చెన్నైలో మొదటి ఎడిషన్‌కు ఆహ్వానం పలికే విధంగా బుధవారం స్థానికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జతిన్ వర్మ మాట్లాడుతూ, పాప్ కల్చర్ మ్యాజిక్‌ను ఈ సారి చెన్నై నగరానికి తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యామని వివరించారు. భారతీయ కామిక్ సృష్టికర్తలు, ప్రఖ్యాత కళాకారులు ఈ వేడుకకు తరలి రాబోతున్నారన్నారు. కళలు, వినోదం, సృజనాత్మకత, మరుపురాని అనుభవాన్ని చెన్నై వాసులకు కలిగించే విధంగా ఈ వేడుక 2024 ఫిబ్రవరి 17,18 తేదీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

మ్యాక్సి విజన్‌లో రూ. 1,300 కోట్లు పెట్టుబడి

సాక్షి, చెన్నై: ఆసియాలోనే అతిపెద్ద హెల్త్ కేర్‌గా ఉన్న మ్యాక్సి విజన్‌ను విస్తరించేందుకు రూ. 1,300 కోట్ల పెట్టుబడిని ప్రకటించామని క్వాడ్రియా క్యాపిటల్ దక్షిణాసియా అధ్యక్షుడు సునీల్ ఠాకూర్ తెలిపారు. బుధవారం స్థానికంగా మ్యాక్సివిజన్ సీఈఓ సుధీర్, చైర్మన్ డాక్టర్ జీఎస్‌కే వేలు కలిసి సునీల్ ఠాకూర్ విస్తరణ కార్యాచరణను మీడియాకు వివరించారు. మ్యాక్సివిజన్‌లో క్వాడ్రియా మైనారిటీ వాటా కోసం రూ. 600 కోట్లు, అదనపు వాటా కోసం రూ. 700 కోట్లు కేటాయించామని తెలిపారు. భారతదేశంలో నేత్ర సంరక్షణ సేవలను విస్తరించే విధంగా అన్ని నగరాలలో కార్యక్రమాలు చేపట్టనున్నామని వివరించారు. రోగులకు నాణ్యమైన సేవలు , కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టామన్నారు.

అస్వస్థతకు గురైన ఎస్ఐ మృతి

అన్నానగర్: అరియలూరు, మిన్ నగర్‌కు చెందిన భూపాలన్ (59) కైర్లాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి పోలీసులతో కలిసి పట్రోలింగ్ లో పాల్గొన్నారు. ఆ సమయంలో భూపాలన్‌కు ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే పోలీసులు అతడిని అరియలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరి్పంచారు. చికిత్స పొందతూ అతడు మృతి చెందాడు. అతనికి భార్య మృదాంబాల్, ఇద్దరు కుమారులు పార్తిబన్, సుభాష్ ఉన్నారు. కొడుకులిద్దరూ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

అన్నానగర్: రాణిపేట సమీపంలోని అమ్మూరు ప్రాంతానికి చెందిన కార్తీక్ (36) బిల్డర్. ఇతని భార్య సెల్వరాణి (33). వీరికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు. కార్తీక్, సెల్వరాణి మధ్య అభిప్రాయ భేదాల కారణంగా తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో సెల్వరాణి అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత సెల్వరాణి అమ్మూరులోని వాలాజా రోడ్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి బుధవారం తెల్లవారుజామున చెన్నై వెళ్లే అలప్పుళా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. కాట్పాడి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సెల్వరాణి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం వాలాజా ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ కలైంజ్ఞర్ మహిళ హక్కు పథకం

తిరువళ్లూరు: ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన కలైంజ్ఞర్ మహిళ హక్కు (నిరుపేద కుటుంబానికి ప్రతినెలా వెయ్యి రూపాయలు అందించే) పథకాన్ని అర్హులందరికీ అందించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టం చేశారు. ఈమేరకు దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. ఇందులో భాగంగా తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా మొదటి దశ దరఖాస్తులను గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా 1,253 రేషన్ దుకాణాలు, 8.08 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. వీరిలో అర్హులను గుర్తించి ప్రతి నెలా వెయ్యి రూపాయలు వారి కుటుంబానికి అందించనున్నట్లు వివరించారు. సీఎం ఆదేశాల మేరకు మొదటి దశలో 629 రేషన్‌దుకాణాల పరిధిలోని కార్డుదారులకు దరఖాస్తులను శిక్షణ పొందిన వలంటీర్లు ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తులను అందిస్తారని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను లబ్ధిదారులకు కేటాయించిన టైమ్‌స్లాట్‌లో తిరిగి అందించాలన్నారు. మొదటి దశ దరఖాస్తులను జూలై 20వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు, రెండవ దశ దరఖాస్తులను ఆగస్టు 5 నుంచి 16 వరకు స్వీకరిస్తామన్నారు. లబ్ధిదారుడికి కేటాయించిన టైమ్‌స్లాట్‌లో దరఖాస్తులను సమర్పించని పక్షంలో చివరి రెండు రోజుల్లో పూర్తి చేసిన అప్లికేషన్‌లను ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మొదటి దశ దరఖాస్తుల స్వీకరణకు 1,253 శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ, పంపిణీలో అభ్యంతరాలుంటే టోల్‌ఫ్రీ నంబర్ 1800- 5997626, వాట్సాప్ నంబర్ 98403 27626కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

తిరుచ్చి విద్యార్థినికి రెండు బంగారు పతకాలు

అన్నానగర్: తిరుచ్చి విద్యార్థిని రెండు బంగారు పతకాలు సాధించి రికార్డు సృష్టించింది. ఇటీవల కోయంబత్తూరులో అంతర్జాతీయ కరాటే టోర్నీ జరిగింది. ఈ ఈవెంట్‌లో భారత్, మలేషియా, శ్రీలంక, ఇరాన్, ఇండోనేషియా సహా పలు దేశాల నుంచి 2వేల మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. తిరుచ్చికి చెందిన కరాటే మాస్టర్ శంకర్ నేతృత్వంలోని ఈ పోటీల్లో భారత్ తరఫున 25 మంది పాల్గొన్నారు. తిరుచ్చిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న కరాటే లీనా ఎనిమిది ఏళ్ల లోపు కరాటే విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించింది. అదే విధంగా కుమిదే విభాగంలోనూ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రెండు బంగారు పతకాలు సాధించి బుధవారం తిరుచ్చికి తిరిగి వచ్చిన కరాటే విద్యార్థిని లీనాను పలువురు అభినందించారు.


బంగారు పతకాలు సాధించిన లీనా

భర్త మృతిని తట్టుకోలేక భార్య ఆత్మహత్య

అన్నానగర్: పరమకుడి సమీపంలో మిద్దెపై నుంచి కింద పడిన భర్త చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో దిగ్భ్రాంతి చెందిన అతని భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. రామనాథపురం జిల్లా పరమకుడి నెహ్రూ వీధికి చెందిన సుధాకర్ (36) ఎలక్ట్రీషియన్. ఇతని భార్య ధరణి కామాక్షి (29). వీరికి హర్షిత్ (03) అనే కుమారుడు ఉన్నాడు. సుధాకర్ ఇటీవల పని చేస్తుండగా ప్రమాదావశాత్తూ మిద్దె పై నుంచి జారి కింద పడి తీవ్ర గాయాలతో పరమకుడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ఈ క్రంలో చికిత్స ఫలించక సుధాకర్ బుధవారం మరణించాడు. దీంతో ధరణ కామాక్షి షాక్‌కు గురైంది. బంధువులు, కుటుంబ సభ్యులు ఆమెను ఓదార్చారు. అయితే తీవ్ర మనోవేదనకు గురైన ధరణి కామాక్షి ఉరేసుకుని ఆత్మహత్య చేసకుంది. పరమకుడి నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● ప్రత్యేక సదస్సు



ఇంజినీరింగ్ భవిష్యత్, క్రమశిక్షణ, మార్గ నిర్దేశం గురించి సీమాట్స్‌లో బుధవారం ప్రత్యేక సదస్సు జరిగింది. ఇందులో విప్రో ఇన్‌ఫ్రాస్టక్చర్ ఇంజినీరింగ్‌లో కన్షయన్స్ అండ్ డిజిటలైజేషన్ హెడ్ రాణి శక్తి శ్రీ గ్రాడ్యుయేట్లను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే ఇంజినీరింగ్‌లో 64, వర్సిటీ కేటగిరిలో 13వ ర్యాంకు సాధించిన ఆ విద్యాసంస్థ సేవలను కొనియాడారు. ప్రిన్సిపల్ బి. రమేష్‌తో పాటు ప్రతినిధులు తమ అనుభవాలను పంచుకున్నారు. – సాక్షి,చెన్నై

స్కూల్ వ్యాన్ ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి

అన్నానగర్: చెన్నై తాంబరం సమీపంలోని పాత పెరుంగళత్తూరు పార్వతి నగర్‌కు చెందిన రేవతి (50) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. బుధవారం ఉదయం ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లేందుకు తన కుమార్తె దీపిక (21)ను స్కూటి వెనుక కూర్చోబెట్టుకుని వెళ్లింది. మదనాపురం సమీపంలో గ్యాస్ పైప్‌లైన్ కోసం కందకం తవ్వి సరిగా మూత వేయకపోవడంతో అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. అక్కడ బైక్ అదుపు తప్పి రేవతి కిందపడిపోయింది. ఆమెపై ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్ దుసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తిరువళ్లూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కవరపేటలో జరిగింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి పంచెట్టి గ్రామానికి చెందిన గౌతమ్‌దాస్(50) గుమ్మిడిపూండిలోని సూర్యదేవ్ అనే ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఈనెల 15వ తేదీన పంచెట్టి నుంచి ద్విచక్ర వాహనంలో గుమ్మిడిపూండిలోని కంపెనీకి ఇంటి నుంచి బయలుదేరాడు. కవరపేటలోని ఆర్ఎంకే కళాశాల వద్ద వస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం గౌతమ్‌దాస్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదం తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు రక్షించి చెన్నై వైద్యశాలకు తరలించారు. అయితే అక్కడ చిక్సిత పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు జనరంజన్‌దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కవరపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోబోటిక్ సర్జరీలో.. సరికొత్త కోర్సులు


నూతన కోర్సుల ప్రారంభోత్సవంలో రోవాన్ పార్క్స్, ఉమాశేఖర్

కొరుక్కుపేట: రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్ -ఎడిన్‌బర్గ్ రోబోటిక్ సర్జరీలో కొత్త కోర్సులను ప్రారంభించినట్లు శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో జరిగిన మీట్ ది కాలేజ్ కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ రోవాన్ పార్క్స్ తెలిపారు. బుధవారం కళాశాలకు చెందిన మేనేజ్‌మెంట్ బృందం ఔత్సాహిక వైద్యులకు ఎంఆర్‌సీపీ పరీక్షలు, కళాశాల అభివృద్ధి చేస్తున్న విద్య, పరిశోధనలో భాగస్వామ్య కార్యక్రమం గురించి వివరించారు. ఇందులో శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఉమాశేఖర్, ఇన్‌స్టిట్యూట్ అంతర్జాతీయ సంబంధాల సలహాదారు డాక్టర్ టీకే పార్థసారథి పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగిక దాడి

● యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: రాశిపురం సమీపంలో బైకులో లిఫ్టు ఇస్తానని చెప్పి కళాశాల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. నామక్కల్ జిల్లా రాశిపురం ప్రైవేటు కళాశాలలో కరూర్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని ఒకరు మొదటి సంవత్సరం డిగ్రీ చదువుతున్నారు. విద్యార్థిని రోజు బస్సులో కళాశాలకు వెళ్లి వస్తోంది. ఎప్పటిలాగే కళాశాలకు వెళ్లడానికి బుధవారం ఉదయం బస్సు కోసం వేచి ఉండగా.. ఆ మార్గంగా బైకుపై వచ్చిన యువకుడిని లిఫ్టు అడిగి బైక్ ఎక్కింది. ఆ సమయంలో తన అక్కకు బిడ్డ పుట్టిందని ఆమెను చూసి తరువాత కళాశాలలో దింపుతానని చెప్పి అతడు రాశిపురంలోని చిన్నపట్టి చెరువు గట్టు వద్ద బైక్ నిలిపి విద్యార్థినిపై లైంగిక దాడి చేశాడు. తరువాత విద్యార్థిని వద్ద నుంచి సెల్‌ఫోన్‌లో రూ.160 పంపించుకుని పారిపోయాడు. మార్గంలో వచ్చిన పాదచారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థిని రక్షించి తప్పించుకుని పారిపోయిన యువకుడి కోసం తీవ్రంగా గాలింపు చేపట్టారు. విద్యార్థిని చెప్పిన ఆనవాళ్ల ప్రకారం కొత్త బస్టాండ్ నిలయం వద్ద ఆ మార్గంగా వెళుతున్న యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. అతను నామగిరి పేట పెరియస్వామి కుమారుడు మణికంఠన్ (26)గా గుర్తించారు. అతను చెరుకు పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నట్లు తేలింది. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సమంత తరహాలో మరోనటి

తమిళసినిమా: చాలామంది నటీమణులు తమలోని బాధలను, ఇతర ఆరోగ్య సమస్యలను దాచుకుని పైకి చిరునవ్వులు చిందిస్తూ ఎంటర్‌టెయిన్ చేస్తుంటారు. నటి సమంత వంటి అతి కొద్ది మంది మాత్రమే తమ ఆరోగ్య సమస్యలను బయటకు చెప్పుకునే ధైర్యం చేస్తారు. ఆమె మైయోసైటీస్ అనే అరుదైన వ్యాధితో బాధ పడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే కొంత కాలం నటనకు దూరం అయ్యి వైద్య చికిత్స కోసం విదేశాలు వెళ్లి వచ్చిన సమంత మరోసారి చికిత్స కోసం నటనకు విరామం ఇచ్చారు. కాగా అలాంటి అరుదైన వ్యాధికి గురైన మరో నటి నందితా శ్వేత. కన్నడ నటి అయిన ఈమె 2008లో నందా వర్సెస్ నందితా అనే కన్నడ చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయ్యారు. ఆ తరువాత 2012లో ఈ బ్యూటీని దర్శకుడు పా.రంజిత్ అట్టకత్తి అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయం చేశారు. ఆ చిత్ర విజయంతో నందితా శ్వేతకు ఇక్కడ పలు అవకాశాలు వచ్చాయి. విజయ్ హీరోగా నటించిన పులి, విజయ్‌సేతుపతి సరసన ఇదర్కుదానే ఆశైపట్టాయ్ బాలకుమారా, శివకార్తీకేయన్‌తో ఎదిర్‌నీశ్చల్, విష్ణువిశాల్ కు జంటగా ముండాసుపట్టి తదితర చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలుగులో నటిస్తున్నారు. ఈమె నటించిన తెలుగు చిత్రం హిడింభ చిత్రం గురువారం తెరపైకి రానుంది. కాగా నటి నందితాశ్వేత ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ తాను ఫైబ్రోమ్యల్‌గియా అనే అరుదైన వ్యాధితో బాధ పడుతున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి కారణంగా కండరాల సమస్య ఏర్పడుతుందని చెప్పారు. ఒక్కోసారి జ్ఞాపకశక్తిని కోల్పోతానని అన్నారు. కాగా 20 నుంచి 55 ఏళ్ల మహిళల్లో రెండు శాతం మంది ఈ వ్యాధితో బాధ పడుతున్నట్లు అంచనా. నటి నందితాశ్వేత వయసు 33 ఏళ్లు. కాగా ఈ వ్యాధి నుంచి నందితా శ్వేత త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు.


నటి నందితా శ్వేత

కోలీవుడ్ టాక్స్

ఈగో క్లాష్ ప్రధానాంశంగా

అవళ్ అప్పడిదాన్-2

తమిళసినిమా: భార్యభర్తల మధ్య అహం ఇతి వృత్తంతో 1978లో విడుదలైన చిత్రం అవళ్ అప్పడిదాన్. ఫిలిం ఇన్‌స్టిట్యూట్ స్టూడెంట్ రుద్రయ్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం అప్పట్లో మంచి విజయాన్ని సాధించింది. కాగా అలాంటి కాన్సెప్ట్‌తో తాజాగా రూపొందిన చిత్రం అవళ్ అప్పడిదాన్ -2. అబుదాహీర్, స్నేహా పార్తీపరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన ఇందులో రాజేశ్వరి, సుమిత్ర, అనితాశ్రీ,సుధాకర్, వెంకట్రామన్, ధనపాల్, బేబీ కార్తీక తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఆర్ఎం.చిదంబరం కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించిన ఈ చిత్రాన్ని యున్ ఫ్లిక్స్ పతాకంపై సెయ్యదు అబుదాహీర్ నిర్మించారు. అరవింద్ సిద్ధార్ సంగీతాన్ని, వేదా సెల్వం ఛాయాగ్రహణను అందించిన అవళ్ అప్పటిదాన్- 2 చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. ఈ చిత్ర కథలో అన్నీ పాజిటీవ్ పాత్రలే. అందరూ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ప్రాధాన్యతనిచ్చేవాళ్లే. విద్యావేత్తలైన భార్యాభర్తలు. వీరి భావాలు ఒకటి కాకపోయినా, ఒకరిపై ఒకరికి ప్రేమ ఉంటుంది. ముఖ్యంగా స్త్రీ స్వేచ్ఛను గౌరవించే వ్యక్తిత్వం కలిగిన భర్త. ఆయన భార్య ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. అలాంటిది ఆమె ఒక రోజు పాఠశాలకు వెళ్లి అర్ధ రాత్రి అయినా ఇంటికి తిరిగి రాదు. దీంతో భర్త ఆమె కోసం రాత్రి అంతా వీధుల్లో వెతుకుతాడు. మరుసటి రోజు ఉదయం భార్య ఇంటికి తిరిగొస్తుంది. రాత్రి అంతా ఎక్కడ ఉన్నావని ప్రశ్నించిన భర్తకు భార్య బదులు చెప్పదు. అందుకు కారణం ఏమిటి? అసలు ఆమె ఆ రాత్రి ఎక్కడుంది? భర్తతో పాటు, ఇంట్లోవాళ్లు పలుమార్లు ప్రశ్నించినా ఆమె బదులు ఇవ్వక పోవడానికి కారణం ఏమిటి? అనే ఆసక్తికరమైన అంశాలతో రూపొందిన అవళ్ అప్పడిదాన్- 2 కచ్చితంగా అన్ని వర్గాలనూ అలరిస్తుందని దర్శకుడు తెలిపాడు.


అవళ్ అప్పడిదాన్ -2 చిత్రంలో బేబీ కార్తీకతో స్నేహా పార్తీపరాజా

అజిత్‌తో

మరోసారి..?

తమిళసినిమా: మిల్కీబ్యూటీ తమన్న తాజాగా మరోసారి అజిత్‌తో రొమాన్స్ చేసే అవకాశం ఉందనే ప్రచారం సామాజికమాధ్యమాల్లో వైరల్ అవుతోంది. గతంలో వీరి కాంబోలో వచ్చిన వీరం చిత్రం అప్పట్లో మంచి విజయాన్ని సాధించింది. కాగా అజిత్ నటించిన తుణివు చిత్రం విడుదలై చాలా కాలం అవుతోంది. ఈ చిత్రంతో పాటు తెరపైకి వచ్చిన విజయ్ చిత్రం వారిసు తరువాత ఆయన నటిస్తున్న లియో చిత్రం షూటింగ్ కూడా పూర్తి చేసుకుంది. అలాంటిది అజిత్ తాజా చిత్రం మాత్రం ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. దీనికి విడాముయిర్చి అనే టైటిల్‌ను ఖరారు చేశారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముందుగా నయనతార భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించడానికి సన్నాహాలు జరిగాయి. అయితే ఈ చిత్రం నుంచి ఆయనను తొలగించి దర్శకుడు మగిళ్ తిరుమేణిని ఎంపిక చేశారు. దీంతో చిత్రం మే నెలలో ప్రారంభం అవుతుందనే ప్రచారం జరిగింది. కానీ అలా జరగలేదు. తాజాగా ఆగస్టులో విడాముయిర్చి సెట్స్‌పైకి వెళ్లడం ఖాయం అనే టాక్ వినిపిస్తోంది. కాగా ఇందులో నటి త్రిష నాయకిగా నటించనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే చిత్ర షూటింగ్ పలుమార్లు వాయిదా పడుతుండటంతో ప్రస్తుతం విజయ్‌కు జంటగా లియో చిత్రాన్ని పూర్తి చేసిన త్రిషకు తెలుగు, మలయాళం భాషల్లో అవకాశాలు వచ్చాయి. అలా ఆమె మలయాళంలో నటుడు టోవినో థామస్‌కు జంటగా ఐడెంటీ చిత్రంలో నటించడానికి ఒప్పుకున్నారు. దీంతో అజిత్ సరసన నటించే అవకాశం లేదనే టాక్ వినిపిస్తోంది. ఇకపోతే నటి తమన్న ప్రస్తుతం రజనీకాంత్ సరసన జైలర్ చిత్రంలో నటించి పూర్తి చేశారు.కాగా ఇందులోని కావాలయా అనే పాటను ఇటీవల చిత్ర వర్గాలు విడుదల చేశారు. ఆ పాటలో తమన్న కవ్వింపు డాన్స్ ఇప్పుడు ట్రెండింగ్‌గా మారింది. అంతే కాదు ఈ పాట ఈ మిల్కీబ్యూటీకి మరిన్ని అవకాశాలను తెచ్చిపెడుతుందనేది తాజా సమాచారం. అందులో ఒకటి అజిత్ సరసన నటించే విడాముయిర్చి అని టాక్. లైకా సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో తమన్నను నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.


నటి తమన్న



నాకు న్యాయం కావాలి

తమిళసినిమా: నాన్ అనే సీరియస్ కథా చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అయిన సంగీత దర్శకుడు విజయ్ ఆంటోని. ఆ తరువాత పలు సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్న ఈయన పిచ్చైక్కారన్- 2 చిత్రంతో దర్శకుడిగానూ పరిచయం అయ్యి విజయం సాధించారు. తాజాగా విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటించిన చిత్రం కొలై. నటి రిత్విక సింగ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి బాలాజీ కె.కుమార్ దర్శకత్వం వహించారు. ఇన్ఫినిటీ ఫిలిం వేంచర్స్, లోటస్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని శుక్రవారం తెరపైకి రానుంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న విజయ్ ఆంటోని మాట్లాడుతూ కథ చెప్పినప్పుడు ఇందులో ముగ్గురు హీరోయిన్లు ఉంటారని దర్శకుడు చెప్పారన్నారు. ఆ తరువాత ఇద్దరని అన్నారనీ, వారిలో నటి మీనాక్షీ వేరే నటుడికి పెయిర్ కాగా, నటి రిత్వికా సింగ్ తనకు సోదరిగా నటించినట్లు చెప్పారు. ఇందులో తనకు ఒకే ఒక్క భార్య ఉన్నారనీ, ఆమె కూడా కళ్ల ముందే కాలిపోతుందని చెప్పారు. అలా ఈ చిత్రంలో తనకు రొమాన్స్ లేకుండా చేశారని, ఇందుకు తనకు న్యాయం కావాలి అని సరదాగా అన్నారు. అయితే దర్శకుడు బాలాజీ కే.కుమార్ ఏడు ఏళ్ల తరువాత దర్శకత్వం వహించిన చిత్రం ఇది అనీ, చాలా బాగా వచ్చిందని పేర్కొన్నారు. కాగా మళ్లీ సంగీత దర్శకుడిగా ఎప్పుడు పని చేస్తారన్న ప్రశ్నకు బదులిస్తూ, ప్రస్తుతానికి కొంచెం గ్యాప్ ఇచ్చానని, తన కేరీర్ ముగిసేలోగా కనీసం 20 మంది కొత్త సంగీత దర్శకులను పరిచయం చేయాలని కోరుకుంటున్నానని చెప్పారు. అందుకే సంగీతదర్శకుడిగా కొంత కాలం తప్పుకుంటున్నట్లు చెప్పారు.


ప్రీ రిలీజ్ వేడుకలో కొలై చిత్ర యూనిట్

43వ చిత్రానికి సిద్ధమైన సూర్య

తమిళసినిమా: కమర్షియల్ అంశాలతో పాటు వైవిధ్యభరిత కథా చిత్రాలను ఎంపిక చేసుకుని నటిస్తున్న నటుడు సూర్య. ఇటీవల ఈయన నటించిన సూరరై పోట్రు, జైభీమ్ వంటి చిత్రాలు మంచి విజయాలను పొందడంతో పాటు విమర్శకుల ప్రశంసలను అందుకున్నాయి. ఇక సూరరై పోట్రు చిత్రం ఆయనకు ఉత్తమ జాతీయ అవార్డును తెచ్చి పెట్టింది. కాగా సూర్య ప్రస్తుతం కంగువా చిత్రంలో నటిస్తున్నారు. శివ దర్శకత్వం వహిస్తున్న ఇందులో బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని నాయకిగా నటిస్తోంది. చారిత్రాత్మక కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సూర్య గెటప్ చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది. 10 భాషలో చిత్రాన్ని 3డీ ఫార్మెట్‌లో రూపొందిస్తున్నట్లు నిర్మాతలు ఇప్పటికే తెలిపారు. కాగా ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో సూర్య తన 43వ చిత్రానికి సిద్ధం అవుతున్నారు. దీనికి సూరరై పోట్రు చిత్రం ఫేమ్ సుధా కొంగర దర్శకత్వం వహించనున్నట్లు సంగీతదర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా దీనికి జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని అందించనున్నారట. ఇది ఆయనకు 100వ చిత్రం కావడం విశేషం .కాగా ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను సూర్య పుట్టిన రోజు అయిన ఈ నెల 23వ తేదీన వెల్లడించనున్నట్లు జీవీ ప్రకాశ్‌కుమార్ పేర్కొన్నారు. అదే రోజున సూర్య నటిస్తున్న చిత్రాల ప్రకటనలు వెలువడనున్నాయి. మొత్తం మీద సూర్యకు ఈ పుట్టిన రోజు చాలా ప్రత్యేకం కానుందనే ప్రచారం సాగుతోంది.


నటుడు సూర్యతో జీవీ ప్రకాశ్‌కుమార్, సుధా కొంగర

క్లుప్తంగా

నిర్భయంగా ఫిర్యాదు చేయండి



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ శంకర్

తిరువళ్లూరు: ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులపై పోలీసులకు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని ఆవడి పోలీసు కమిషనర్ శంకర్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా ఆవడి కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కమిషనర్ శంకర్ హాజరై ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. మొత్తం 200పైగా వినతులు రాగా, వీటిలో 62 వినతులను తక్షణం పర్కిరించారు. మరో 52 వినతులను వారం రోజుల్లో విచారించి న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేలా తాబు బాధ్యతలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని ఆర్మీ జవాను మృతి

అన్నానగర్: లారీ ఢీకొని ఆర్మీ జవాను మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. ధర్మపురి జిల్లా మోరాపూర్ సమీపంలోని ఎలవాడ గ్రామానికి చెందిన చిన్నరాజు కుమారుడు పూవరసన్ (27) ఆర్మీలో జవానుగా పనిచేస్తున్నారు. ఆయన కొద్దిరోజుల క్రితం సెలవుపై ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి బైకులో ఎలవాడ నుంచి మోరాపూర్ వైపు వెళుతున్నాడు. అయ్యర్ కొట్టాయ్ బస్టాప్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనను చుట్టుపక్కల వారు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ పూవరసన్ మరణించాడు. మోరాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మాజీ సైనికుడు..

తిరువళ్లూరు: లారీ ఢీకొని మాజీ సైనికుడు మృతి చెందిన సంఘటన తిరునింద్రవూర్ సమీపంలో విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపంలోని మిట్నమల్లి మిలిటరీ క్వార్టర్స్ చెందిన శ్రీనివాసన్(51) సైనికుడిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం తిరునింద్రవూర్ సమీపంలోని కొశవన్ పాళ్యంలోని ప్రయివేటు కంపెనీలో భద్రతా అధికారిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం యధావిధిగా మిట్నమల్లి నుంచి తిరునింద్రవూర్ మీదుగా కొశవన్‌పాళ్యం బయలుదేరాడు. తిరునింద్రవూర్ సమీపంలోని నడుకుత్తై బస్టాండు వద్ద పెద్దపాళ్యం రోడ్డును క్రాస్‌చేస్తుండగా లారీ ఢీకొంది. శ్రీనివాసన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పూందమల్లి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డీఎంకే నేతపై కేసు నమోదు

తిరువొత్తియూరు: నటి వింధ్యపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేతపై చెన్నై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు. అన్నాడీఎంకేలో పార్టీ విధానాల ప్రచార ఉప కార్యదర్శిగా నటి వింధ్య పనిచేస్తున్నారు. ఆమె గురించి గుడియాత్తం కుమరన్ యూట్యూబ్ చానల్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో వింధ్య తరఫున అన్నాడీఎంకే శాంతి భద్రతల న్యాయవాది ఇన్బదురై జాతీయ మహిళా కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గుడియాత్తం కొమరం మాట్లాడిన వీడియోలను మహిళా కమిషన్ తనిఖీ చేసింది. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని చెన్నై పోలీసులకు మహిళా కమిషన్లు ఆదేశాలు జారీ చేసింది. దీంతో చెన్నై సెంట్రల్ విభాగం సైబర్ క్రైమ్ పోలీసులు డీఎంకే ప్రచార కర్త, గుడియాత్తం కుమరన్‌పై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎగ్మూర్‌లో ఉన్న అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేశారు. కుమరన్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

హోమ్‌గార్డుల వేతనం పెంపు

కొరుక్కుపేట: జైళ్ల శాఖలో పనిచేస్తున్న 1వ, 2వ స్థాయి కానిస్టేబుళ్ల (హోమ్‌గార్డులు)ఓవర్ టైం వేతనాన్ని రూ.200 నుంచి రూ.500లకు పెంచుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గత ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీలో చేసిన ప్రకటన ప్రకారం తమిళనాడులోని జైళ్ల శాఖలో పనిచేస్తున్న పోలీసుల ఓవర్‌టైం వేతనాలను భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయశాఖ మంత్రి రఘుపతి అధికారులతో చర్చించి కీలక నిర్ణయాలు చేశారు.

భర్త ఆత్మహత్యపై భార్య ఫిర్యాదు

తిరువళ్లూరు: పుట్టింటికి వెళ్లి తిరిగొచ్చిన సమయంలో తన భర్త ఉరికివేలాడుతూ కనిపించడంతో ఆమె షాక్‌కు గురైంది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా లక్ష్మీవిలాసపురం గ్రామానికి చెందిన మనోహర్(26), ఇతడి భార్య కలైఅరసి(25). కలైఅరసి రెండు రోజుల క్రితం రాణిపేట జిల్లాలోని తన పుట్టింటికి వెళ్లింది. అక్కడి నుంచి బుధవారం మధ్యాహ్నం ఇంటికి రాగా తలుపులు మూసి ఉండడంతో బలవంతంగా తెరవడానికి యత్నించింది. చివరికి పట్టింకి వారి సాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా భర్త ఉరికి వేలాడుతూ కనిపించడంతో 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించింది. అక్కడ మనోహర్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి, నూలు ధరల కట్టడికి చర్యలేవీ?

- ప్రధాని మోదీకి సీఎం స్టాలిన్ లేఖ
- రాణిపేటలో ఎస్‌ఓఎల్ ప్లాంట్



ఎస్‌ఓఎల్ ప్లాంట్ నమూనాను ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: పత్తి, నూలు ధర కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీని సీఎం ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు ప్రధానికి సీఎం లేఖ రాశారు. తమిళనాడులో పత్తి, నూలు ఉత్పత్తులు, వస్త్ర ఉత్పత్తుల గురించి వివరించారు. మిల్లులు, స్పిన్నింగ్ పరిశ్రమలపై ఈ ధరల పెంపు ప్రభావాన్ని చూపుతోందన్నారు. కార్మికులకు ఉపాధి కరువు అవుతోందని పేర్కొన్నారు. తమిళనాడులో 1,500 సంస్థలు ఉన్నాయని, 15 లక్షల మందికి ఈ రంగంలో ఉపాధి దక్కుతోందని వివరించారు. కరోనా పరిస్థితులతో అస్సలే కష్టాలలో ఉన్న యాజమాన్యాలు, బ్యాంక్‌ల నుంచి రుణాల పొంది తమ పరిశ్రమలను ముందుకు నడిపిస్తున్నాయని, ఈ సమయంలో ధరలు అమాంతంగా పెరగడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. ధరల కట్టడిలో భాగంగా దిగుమతి సుంకం 11 శాతాన్ని ఉపసంహరించుకోవాలని, పత్తి కొరతను అధిగమించే ప్రయ్నాలు విస్తృతం చేయాలని, ఎగుమతులపై తాత్కాలిక నిషేదం విధించాలని ప్రధానికి రాసిన లేఖలో సీఎం విజ్ఞప్తి చేశారు.

రూ. 145 కోట్లతో పరిశ్రమ..

రాణి పేట పారిశ్రామికవాడలో రూ. 145 కోట్లతో ఎస్ ఓఎల్ ఇండియా ప్లాంట్ విస్తరణ పనులను సీఎం స్టాలిన్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇటలీకి చెందిన ఎస్‌ఓఎల్ ఇండియా తమిళనాడులోని తంజావూరు జిల్లా పుదుక్కుడి, రాణిపేటలలో రెండు చోట్ల పరిశ్రమలను నెలకొల్పి ఉందన్నారు. రాణిపేట పారిశ్రామిక వాడలో విస్తరణ పనులకు రూ. 145 కోట్లను ఆ సంస్థ కేటాయించినట్లు వెల్లడించారు. లిక్విడ్ మెడికల్ అండ్ ఇండస్ట్రియల్ ఆక్సిజన్, లిక్విడ్ ఎట్ చిప్ కోట్ ఇండస్ట్రియల్ పార్క్ లెవల్ 3లో నైట్రోజన్, లిక్విడ్ ఆర్గాన్ ఉత్పత్తులను ఈ పెట్టుబడులతో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఇంటి గ్రేటషన్ ప్లాంట్ ఏర్పాటు పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పరిశ్రమల మంత్రి టీఆర్‌బీ రాజ, సీఎస్ శివదాస్ మీన తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు విల్లివాక్కంలో జరిగిన కార్యక్రమంలో ఈసీఐ హోప్ సెంటర్‌ను సీఎం ప్రారంభించారు. అలాగే ఇండియా సామాజిక న్యాయం ఇయక్కం అధ్యక్షుడు ఎస్ఆర్ సద్గునం 85వ జన్మదిన వేడుకలకు సీఎం స్టాలిన్ హాజరయ్యారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్



దురై చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న తిరుత్తణి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు

తిరుత్తణి: తిరువళ్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పొన్నేరి ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్ నియమితులయ్యారు. ఆయనకు తిరుత్తణి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. తిరువళ్లూరు జిల్లా అధ్యక్షుడిగా పదేళ్లగా పదవీ బాధ్యతలు నిర్వహించిన చిదంబరం స్థానంలో నూతనంగా పొన్నేరి ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అళగిరి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో తొలిసారి తిరుత్తణిలో కాంగ్రెస్ శ్రేణులను దురైచంద్రశేఖర్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. పార్టీని పటిష్టం చేయడంకు సంబంధించి కార్యకర్తలకు సూచనలిచ్చారు. రాష్ట్ర జనరల్ బాడీ సభ్యుడు, మాజీ పళ్లిపట్టు చైర్మన్ వెంకటరాజు, నేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుందరవేలు, రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు బాబునాయుడు, పళ్లిపట్టు పట్టణ అధ్యక్షుడు శివ కుమార్, మండల అధ్యక్షుడు ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదలకు అనుమతి ఇవ్వాలని వినతి



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బీజేపీ మైనారిటీ విభాగం జాతీయ కార్యదర్శి ఇబ్రహీం

వేలూరు: కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో మైనారిటీలకు అందుతున్న సంక్షేమ పథకాలపై సామాన్య ప్రజలకు తెలియజేసేలా కరపత్రాలు విడుదల చేసేందుకు అనుమతి ఇవ్వాలని బీజేపీ రీ మైనారిటీ విభాగం జాతీయ కార్యదర్శి వేలూరు ఇబ్రహీం కోరారు. ఆయన బుధవారం ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనారిటీల కోసం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై వేలూరులోని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. ఇందుకు పోలీసులు తమను అనుమతించడం లేదన్నారు. పోలీసులు డీఎంకే ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మైనారిటీలు కూడా మారాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు మైనారిటీలకు అందకుండా చేసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వం పోలీసులను భయ పెడుతూ మైనారిటీలను బెదిరిస్తుందన్నారు. పోలీసులు తమను అరెస్ట్ చేస్తామని చెబితే 365 రోజుల పాటు అరెస్ట్‌కు సిద్ధంగా ఉన్నామన్నారు. మైనారిటీలు ఉన్న ప్రాంతాల్లో కరపత్రాలు అందజేసేందుకు అనుమతి నిరాకరించి హిందువులు ఉన్న ప్రాంతాల్లో మాత్రం అనుమతి ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. బీజేపీ ఉపాధ్యక్షుడు జగన్నాథన్, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రదీప్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్పృహతప్పి పడి విద్యార్థి మృతి

తిరువొత్తియూరు: పెరంబలూరు జిల్లాలోని పాఠశాలలో విద్యార్థి స్పృహతప్పి కిందపడి మృతిచెందాడు. ఆలతూర్ తాలూకా కళాతూర్ గ్రామానికి చెందిన గణేషన్ కుమారుడు మగావిన్ (16) తేనూరులో వున్న ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 11వ తరగతి చదువుతున్నాడు. మగావిన్‌కు గత సంవత్సరం 10వ తరగతి చదువుతున్న సమయంలో గుండె సమస్య ఉన్నట్లు సమాచారం. చెన్నైలో మూడు నెలలు చికిత్స పొందాడు. బుధవారం పాఠశాలలో తరగతి గదిలో పాఠాలు వింటున్నాడు. ఆ సమయంలో హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. ఉపాధ్యాయులు అతన్ని వెంటనే పెరంబలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి తిరుచ్చి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పాడలూరు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

తిరువళ్లూరు: కంపెనీలో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా తచ్చూర్ గ్రామంలోని కోథి ఇండస్ట్రియల్ కార్పొరేషన్ లిమిటెడ్ అనే కంపెనీ వుంది. ఇందులో పుదుకోట్టై జిల్లా అళగన్‌వాయల్ గ్రామానికి చెందిన నాగలింగం కుమారుడు మునీశ్వరన్(28) పని చేస్తున్నాడు. ఇతను గత 17న యథావిధిగా కంపెనీకి వచ్చి విధులు నిర్వహించాడు. అనంతరం అక్కడే వుండిపోయినట్టు తెలుస్తుంది. మంగళవారం విధులకు హాజరుకాలేదు. కంపెనీలోని మరో రూమ్‌లో ఉరివేసుకుని ఉన్నట్టు రాత్రి గుర్తించారు. ఈ సంఘటనపై సంస్థ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నాడీఎంకే నాయకుడి అరెస్టు

తిరువొత్తియూరు: మహిళను లైంగికంగా వేధించిన అన్నాడీఎంకే నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వెస్టు తాంబరం టీటీకే నగర్ ప్రాంతానికి చెందిన లీనా (36) కొన్ని నెలల క్రితం కుటుంబ సమస్యల కారణంగా తాంబరం పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. ఆ సమయంలో మరో కేసుకు సంబంధించి అక్కడికి వచ్చిన వెస్ట్ తాంబరం జెరూసలేం నగర్ చర్చి వీధికి చెందిన కుమరన్ (47) ఆమెకు పరిచయం అయ్యాడు. ఆమెతో సెల్‌ఫోన్‌లో తరచూ మాట్లాడేవాడు. ఈ క్రమంలో ఆమెను లైంగికంగా వేధించాడు. ఈ సంగతి లీనా తన భర్తకు చెప్పడంతో అతను కుమరన్‌ను ప్రశ్నించాడు. కుమరన్ లీనా భర్తపై దాడి చేశాడు. కుమరన్ మాట్లాడిన ఆడియో, సెల్‌ఫోన్‌లో పంపిన షార్ట్ మెసేజెస్‌ల ఆధారంగా తాంబరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి కుమరన్‌ను అరెస్టు చేశారు.

మృతదేహంతో స్థానికుల రాస్తారోకో



మృతదేహంతో రాస్తోరోకో చేస్తున్న స్థానికులు

అన్నానగర్: పొన్నమరావతి సమీపంలో బుధవారం ప్రజాప్రతినిధులు మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. పొన్నమరావతి సమీపంలోని పి.ఉసిలంపట్టి ఎనమేడు ప్రాంతంలో ప్రభుత్వ శ్మశానవాటిక ఉంది. దీన్ని ఒక వ్యక్తి ఆక్రమించుకుని కంచె వేశాడు. ఆక్రమణను తొలగించి శ్మశానాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ క్రమంలో ఎనమేడుకు చెందిన అలగరస్వామి (65) బుధవారం మృతి చెందాడు. అనంతరం ఆయన మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం శ్మశానవాటికకు తీసుకెళ్లగా పట్టాస్థలంలో అంత్యక్రియలకు అనుమతించకుండా పొన్నమరావతి పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అడ్డుకున్నారు. అనంతరం పొన్నమరావతి తహసీల్దార్ ప్రకాష్, ప్రజాప్రతినిధులు, కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు జరిపారు. పట్టా స్థలంలో కాకుండా మరో స్థలం ఇచ్చి అక్కడే పూడ్చి పెట్టాలని పట్టుబట్టారు. వారు అందుకు అంగీకరించకపోవడంతో ప్రస్తుతం వున్న శ్మశానవాటికలోనే ఖననం చేసేందుకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ పొన్నమరావతి బూలంగురిచ్చి రహదారిపై మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపారు. ఇలుపూరు దేవాదాయశాఖ కమిషనర్ (ఇన్‌చార్జ్) తిరుమంజనం సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో, భారత కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు జరిపారు. ఆ సమయంలో తహసీల్దార్ కార్యాలయంలో శాంతి సమావేశం ద్వారా పరిష్కారం దొరుకుతుందని కమిషనరు తెలిపారు. అందుకు అంగీకరించిన ప్రజానీకం నిరసన విరమించి మృతదేహాన్ని ఖననం చేయాలని అధికారులు చెప్పిన ప్రభుత్వ స్థలంలో మృతదేహాన్ని పాతిపెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానం



జాషువా దేవిడ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొరుక్కుపేట: ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానమని ఇండియా క్యాంపస్ లీడ్ ఎంపసిస్ జాషువా డేవిడ్ తెలిపారు. కన్యకాపరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ), మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ (ఎల్ఎస్‌సి) సంయుక్తంగా బుధవారం మెగా జాబ్ ఉత్సవ్ –2023ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాషువా డేవిడ్ ఎండీ జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు పొందాలన్నా, అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నా ప్రధానంగా ఆత్మవిశ్వాసం ఉండాలన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో పోటీ ఎక్కువగా ఉందని, అందుకు తగ్గ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.మోహనశ్రీ మాట్లాడుతూ దాదాపు 40కి పైగా ప్రముఖ కంపెనీలు మెగా జాబ్ మేళాలో పాల్గొన్నాయని తెలిపారు. వెయ్యి మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. 341 మంది ఇంటర్వ్యూలో పాల్గొనగా 250 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. కళాశాల డీన్ పిబి వనిత, వైస్ ప్రిన్సిపాల్ నప్పిన్నై, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జాయిస్ నికోలస్, బీకాం డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ పి.భరణీ కుమారి, ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ సి గీతా, చీఫ్ ఎడ్యుకేషనల్ అడ్వైజర్ జేబీరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ కమిటీ అధ్యక్షుల ఎంపిక



పరశురామన్, చెంగయ్య, కుమార్

పళ్లిపట్టు: అటవీ సంరక్షణ కమిటీ అధ్యక్షులుగా ఎంపికైన వారికి అటవీశాఖ అధికారులతో పాటు కొండ గ్రామాల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. అటవీ ప్రాంతాల సంరక్షణతో పాటు కొండ ప్రాంతాల గ్రామీణులకు కనీస సదుపాయాలు కల్పించేందుకు అటవీ సంరక్షణ కమిటీలను ఎంపిక చేస్తున్న విషయం తెలిసిందే. వీరు మూడేళ్ల పని చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పళ్లిపట్టు ప్రాంతంలోని అటవీ ప్రాంతాలకు సంరక్షణ కమిటీలను ఎంపిక చేశారు. గొళాలకుప్పం అటవీ సంరక్షణ కమిటీ అధ్యక్షుడిగా పరశురామన్, సామంతవాడ అటవీ సంరక్షణ కమిటీ అధ్యక్షుడిగా చెంగయ్య, నెడియం అటవీ ప్రాంతం అధ్యక్షుడిగా కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వారికి పళ్లిపట్టు ఫారెస్టు రేంజర్, సహా అటవీశాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అటవీ సంరక్షణ కమిటీల అధ్యక్షులుగా ఎంపికైన ముగ్గురు పళ్లిపట్టు మండల డీఎంకే కార్యదర్శి న్యాయవాది సీజే.శ్రీనివాసన్‌ను బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ కొండ గ్రామాల్లో కనీస సదుపాయాలు కల్పించి వన్యప్రాణులకు రక్షణ కల్పిస్తామన్నారు.

జాతీయ బ్యాంకు ముట్టడి యత్నం



బ్యాంకు ముందు ధర్నా చేస్తున్న మహిళలు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా ఆంబూరు తాలూకా మాదనూరులో ఉన్న బ్యాంకు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవడంపై ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బ్యాంకులో మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో ఖాతాలు ప్రారంభించి ప్రతి నెలా పొదుపు చేయడం, రుణాలు తీసుకోవడం వంటి కార్యకలాపాలు చేస్తున్నారు. సిబ్బంది వారిని చులకనగా మాట్లాడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో ఆగ్రహించిన మహిళా సంఘాల సభ్యులు, ఖాతాదారులు బుధవారం ఉదయం బ్యాంకును ముట్టడించి ధర్నా చేశారు. ప్రస్తుత బ్యాంకు సిబ్బందిని వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారితో చర్చలు జరిపి ధర్నాను విరమింపజేశారు.

పల్లవుల కాలం నాటి చండికేశ్వర్ విగ్రహం లభ్యం



దాదాపు 900 సంవత్సరాల క్రితం ఈ ప్రదేశంలో పెద్ద దేవాలయం ఉండే అవకాశం ఉందని తెలుస్తుంది.

అన్నానగర్: విరుదాచలం సమీపంలో పల్లవుల కాలం నాటి చండికేశ్వర్ విగ్రహం లభ్యమైంది. భక్తులు ప్రతిష్ఠించి పూజలు చేశారు. కడలూరు జిల్లా విరుదాచలం పక్కనే వున్న కరువేప్పిలంగురిచ్చి సమీపంలోని మెల్లప్పలైయార్ గ్రామంలోని కులకరై సమీపంలో శివలింగం వెలుగులోకి వచ్చింది. బుధవారం కోయంబత్తూరు అరన్‌మిషన్ ట్రస్ట్‌కు చెందిన శివనాడియార్లు, స్థానిక ప్రజలు కలిసి శివలింగాన్ని తవ్వి తీశారు. 6.5 అడుగుల ఎత్తున్న శివలింగం 12వ శతాబ్దానికి చెందినదని తేలింది. అలాగే 10వ శతాబ్దానికి చెందిన రెండు అడుగుల ఎత్తున్న చండికేశ్వరుని పల్లవుల శిల్పం కూడా లభించింది. చండికేశ్వరుని విగ్రహాన్ని చూస్తే

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

వేలూరు: పేర్నంబట్టు సమీపంలో యువతిని మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసి మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వేలూరు జిల్లా పేర్నంబట్టు తాలుకాలోని ఒక గ్రామానికి చెందిన యువతి(28) సమీపంలోని ప్రయివేటు షూ కంపెనీలో పనిచేస్తోంది. ఆమెకు పేర్నంబట్టుకు చెందిన రాజేష్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించి లోబరుచుకున్నాడు. అనంతరం ఆమె తనను వివాహం చేసుకోవాలని కోరడంతో రాజేష్ నిరాకరించాడు. దీంతో యువతి గుడియాత్తం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ జరిపిన పోలీసులు నిందితుడు రాజేష్‌ను అరెస్టు చేసి వారి తల్లిదండ్రులు, బంధువులు మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గోడకూలి ఇద్దరు కార్మికులు మృతి



కూలిన కల్యాణ మండపం గోడ

పళ్లిపట్టు: కల్యాణమండపం గోడ కూలడంతో ఇద్దరు కార్మికులు మృతిచెందిన సంఘటన షోళింగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. రాణిపేట జిల్లా షోళింగర్ బస్టాండు సమీపంలోని వాసవి కల్యాణ మండపంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కల్యాణ మండపం చుట్టు ఏడు అడుగుల ప్రహరి గోడ అకస్మాత్తుగా కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ పనులు చేస్తున్న షోళింగర్‌కు చెందిన వేలు(40), ఆర్కేపేట సమీపంలోని శ్రీకాళికాపురానికి చెందన విశ్వనాథన్ (20)తీవ్రంగా గాయపడ్డారు. వారిని తోటి కార్మికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఇద్దరూ మృతి చెందారు. షోళింగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరుమాళ్ విగ్రహం లభ్యం

అన్నానగర్: పారైయార్ సమీపంలో బుధవారం కాలువ పూడికతీతలో ఐదు అడుగుల పెరుమాళ్ విగ్రహం లభ్యమైంది. మైలాడుదురై జిల్లా తరంగంబాడి తాలూకా పొరైయార్ సమీపంలోని నెడువాసల్ గ్రామంలోని సింగమున కాలువ పూడికతీత పనులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా కుడి చేతిలో చక్రం, ఎడమచేతిలో శంఖంతో ఒకే రాతితో చెక్కిన ఐదు అడుగుల పొడవైన పురాతన పెరుమాళ్ స్వామి విగ్రహం లభ్యమైంది. ఈ విషయం తెలుసుకున్న ఆ ప్రాంత ప్రజలు స్వామి విగ్రహాన్ని ఒడ్డుకు చేర్చి దీపం వెలిగించి పూజలు చేశారు. నెడువాసల్ పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షురాలు ఉమారాణి ధనపాల్ ఇచ్చిన సమాచారం మేరకు తరంగంపాడు తహసీల్దార్ శరవణన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కన్నదాసన్, గ్రామ పరిపాలనాధికారి సౌరిరాజన్‌తో కలిసి పురాతన పెరుమాళ్ విగ్రహాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

అజ్ఞాతంలో ఉన్న నిందితుడి అరెస్టు



అరెస్టైన మాయికన్నన్

తిరువళ్లూరు: ముప్పై తొమ్మిది కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉంటూ ఆరునెలలుగా అదృశ్యమైన వ్యక్తిని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ప్రత్యేక టీమ్ అరెస్టు చేసింది. వివరాలు.. ఐనావరం ప్రాంతానికి చెందిన మాయకన్నన్(45)పై చెన్నై తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్‌పట్టు తదితర జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో మూడు హత్యకేసులతో పాటు మొత్తం 39 కేసులు ఉన్నాయి. ఇతడి కోసం ఆవడి పోలీసులు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టింది. అయినా ఆరునెలలుగా అరెస్టు చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో మాయకన్నన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో వున్నట్టు నిర్ధారించి ఆవడి కమిషనర్ శంకర్ ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే విశాఖ వెళ్లిన ప్రత్యేక బృందం నిందితుడు మాయకన్నన్‌ను అరెస్టు చేసి ఆవడికి తీసుకొచ్చారు. అనంతరం పూందమల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

బస్టాండ్ ప్రారంభం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్

తిరువళ్లూరు: తిరువళ్లూరు పట్టణంలోని మెడికల్ కళాశాల వద్ద సుమారు రూ.30 లక్షలతో ఆధునిక హంగులతో నిర్మించిన బస్టాండ్‌ను బుధవారం స్థానిక ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ ప్రారంభించారు. సీసీ కెమెరాలు, ఇంటర్నెట్ సదుపాయంతో పాటు వంద మంది కూర్చునేలా బస్ షెల్టర్‌ను నిర్మించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరువళ్లూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా బస్టాండు, ప్రభుత్వ మెడికల్ కళాశాల, బైపాస్ రోడ్డును నిర్మించామన్నారు. తమది చేతల ప్రభుత్వమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చుతామని స్పష్టం చేశారు. ప్రజారంజక పరిపాలను చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఉదయమలర్, వైస్ చైర్మన్ రవిచంద్రన్, కమిషనర్ సురేందర్‌షా, కౌన్సిలర్లు వసంతివేలాయుధం, థామస్, ప్రభాకరన్, జాన్, డీఎంకే నేతలు ద్రావిడభక్తన్, బీకే నాగరాజ్, కొండంజేరి రమేష్, నేతాజీ, మోతీలాల్, కమలకన్నన్, జిల్లా కౌన్సిలర్లు శశశంకరి, విజయకుమారి, సరస్వతి పూండి వైస్ చైర్ పర్సన్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

తిరువళ్లూరు: పరుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా కాకలూరు వీఎం నగర్‌కు చెందిన ఏలుమలై (77). ఇతను గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో పాటు కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపం చెందినట్లు తెలుస్తుంది. దీంతో పాటు జీవితంపై విరక్తి చెందిన ఏలుమలై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించి ఏలుమలై కుమారుడు కుమార్ తండ్రిని తిరువళ్లూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరువళ్లూరు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భూ యాజమాన్య హక్కుపై హర్షం



- దళిత రైతులకు సంపూర్ణ హక్కుల కల్పనపై వెల్లువెత్తిన సంతోషం
- రుణాలు తీర్చి భూములకు విముక్తి కల్పించడంపై ఆనందం

ఏలూరు(టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దళిత జనోద్ధారకుడు అంటూ దళిత సంఘాల నేతలు అభినందనలతో ముంచెత్తుతున్నారు. 70 ఏళ్ళ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున దళిత రైతులను ఆదుకునేలా ప్రభుత్వ చర్యలకు అభినందిస్తున్నారు. ఇంతవరకూ రాష్ట్రంలో పనిచేసిన ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా దళిత రైతులను శక్తిమంతులను చేయడం కోసం, ఆర్థిక పరిపుష్టి కలిగించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలను కొనియాడుతున్నారు. కేవలం మాటలతో దళిత ఓట్లు కొల్లగొట్టే విధానాలకు స్వస్తి పలుకుతూ చేతలతో తానేంటో చేసి చూపుతున్నారంటూ సంతోషం వెలిబుచ్చుతున్నారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పన, దళిత రైతుల రుణాలు తీర్చి 22(ఎ)లో ఉన్న భూములకు విముక్తి కల్పించడం పట్ల సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. దళిత రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వ చర్యలను వివిధ సంఘాల నాయకులు హర్షిస్తున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వేల కోట్లు మాఫీ చేసి దళితుల పట్ల తనకున్న ఔదార్యాన్ని చాటుకున్నారు. నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నిర్ణయాలతో ఏలూరు జిల్లాలోని దాదాపు వెయ్యి మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. దీంతో పాటు అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కులతో యాజమాన్య పత్రాలు అందించనుండటంతో దీనిలో ఎక్కువ మంది దళిత రైతులకు ప్రయోజనం చేకూరనుంది. 22(ఎ) భూములకు విముక్తి కల్పించడం వల్ల గ్రామాల్లో వివిధ చేతివృత్తులకు చెందిన వర్గాలకు, దళితులకు ప్రయోజనం కలగనుంది.

సీఎం వైఎస్ జగన్‌ది సాహసోపేత నిర్ణయం



అసైన్డ్ భూములు కేటాయించి 20 ఏళ్లు పూర్తయిన రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం ఎంతో సాహసోపేతమైంది. ఇది దళిత పేద రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. తాతల నాటి నుంచి సాగు చేసుకుంటున్న వాటికి సంబంధించి యాజమాన్య హక్కు పత్రాలు లేకపోవడంతో సాగుదారులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా మంత్రివర్గ సమావేశంలో దీనిపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం అభినందనీయం.

–డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ సర్పంచ్ హక్కుల పరిరక్షణ సంఘం

మహిళా రైతు పేరుతో రిజిస్ట్రేషన్ ఆనందదాయకం



భూమి కొనుగోలు పథకంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందిన అనేక మంది పేద దళిత రైతులు రుణాలు తిరిగి చెల్లించలేక, పంటలు సరిగా పండక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం తనఖాలో ఉన్న పట్టాలను సైతం విడిపించి దళిత మహిళా రైతు పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం ఆనందదాయకం. పేద, దళిత వర్గాల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, రాష్ట్ర మంత్రిమండలికి అభినందనలు.

– పొలిమేర హరికృష్ణ, జాతీయ ఎస్సీ నాయకుడు, ఏలూరు

మా కల నెరవేరనుంది

దళితులు, పేదల ఆధీనంలోని భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలంటూ ఎన్నో ఏళ్ళుగా పోరాటాలు చేస్తున్నాం. మా పోరాటాల కల నేడు నెరవేరే విధంగా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. దళితులు, పేదలను కేవలం ఓటు బ్యాంకుగానే చూడకుండా వారి అభివృద్ధికి బాటలు వేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– జిజ్జువరపు రవిప్రకాష్, రాష్ట్ర అధ్యక్షుడు, దళితసేన, ఏలూరు

థ్యాంక్యూ సీఎం సార్

పేద దళిత రైతులకు హక్కులు కల్పించిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలు ఎంతో రుణపడి ఉంటారు. రాష్ట్రంలోని 1700 గ్రామాల్లో దళిత వాడల్లో శ్మశాన వాటికలకు వెయ్యి ఎకరాలు కేటాయించడం హర్షణీయం. రాష్ట్రంలో ఎన్నడూ, ఎవరూ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ దళిత రైతులను ఆర్థికంగా శక్తిమంతులను చేసే కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉంది.

– పెరికె వరప్రసాదరావు, జాతీయ అధ్యక్షుడు, ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్

ఆదాయం సూపర్‌ఫాస్ట్

రూ.123 కోట్లు దాటిన రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆదాయం

- విజయవాడ డివిజన్‌లో ఎన్ఎస్‌జీ–2 హోదా సొంతం
- ఎన్ఎస్‌జీ–3 స్థానంలో కాకినాడ రైల్వే స్టేషన్
- 1900లో ప్రారంభమైన రాజమహేంద్రవరం స్టేషన్ ప్రస్థానం
- ఇక్కడి నుంచి ప్రతి రోజూ 92కు పైగా రైళ్ల రాకపోకలు
- 12 వేల మందికి పైగా వివిధ ప్రాంతాలకు ప్రయాణం



సాక్షి, రాజమహేంద్రవరం: చారిత్రక నేపథ్యం ఉన్న రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆదాయం వందేభారత్ ట్రైన్ తరహాలో వేగంగా దూసుకుపోతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.123 కోట్ల ఆదాయాన్ని అధిగమించింది. వెరసి విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ప్రతిష్టాత్మక ఎన్ఎస్‌జీ–2(నాన్ సబర్బన్ గ్రూప్స్) జాబితాలో చేరింది. గతేడాది 3వ స్థానంలో ఉన్న స్టేషన్ ప్రస్తుతం రెండో స్థానం కైవసం చేసుకుంది. రూ.478 కోట్ల కలెక్షన్‌తో విజయవాడ టాప్ పొజిషన్‌లో ఉండగా.. రూ.52,02,63,612 ఆదాయం ఆర్జించి కాకినాడ టౌన్ స్టేషన్ తృతీయ స్థానంలో నిలించింది.

అ'పూర్వ' చరిత్ర

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు అ'పూర్వ' చరిత్ర ఉంది. స్టేషన్ దక్షిణమధ్య రైల్వే జోన్, విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తుంది. 1900లో ప్రారంభమైంది. 1980–81 మధ్యలో ఎలక్ట్రిఫికేషన్ ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతమైన ప్రదేశం. కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, ఏజెన్సీ తదితర జిల్లాల ప్రజలు ఈ స్టేషన్ ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజూ 92 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో రోజుకు 12 వేల మంది ప్రయాణిస్తుంటారు. పండగల సీజన్‌లో ఆ సంఖ్య 15 నుంచి 16 వేలకు చేరుతుంటుంది. హౌరా – చెన్నై మెయిన్ లైన్‌లో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఉండటంతో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

దేశంలో ఎక్కడికైనా ప్రయాణించే వెసులుబాటు

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ నుంచి దేశ వ్యాప్తంగా ఎక్కడికైనా ప్రయాణించే వీలుంది. ఢిల్లీ, కన్యాకుమారి, అసోం, దిబ్రూగఢ్, గుజరాత్, భావనగర్ తదితర సుదూర ప్రాంతాలకు సులువుగా ప్రయాణం చేసే అవకాశం ఉంది. దేశంలోనే అత్యధిక దూరం (4,189 కిలో మీటర్లు) నడిచే దిబ్రూగఢ్ – కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తోంది. పరిమిత స్టేజీలు ఉన్న కోరమండల్ సూపర్‌ఫాస్ట్ లాంటి ట్రైన్లకు ఇక్కడ హాల్టింగ్ ఉందంటే ఏ మేరకు ప్రాధాన్యత ఉందో అర్థం అవుతోంది.

ఆదాయం అదుర్స్

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆదాయం సూపర్‌ఫాస్ట్‌గా దూసుకుపోతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్ పరిధిలో రైల్వే శాఖ వెల్లడించిన ఆదాయ గణాంకాల్లో విజయవాడ స్టేషన్ రూ.478,99,42,447తో మొదటి స్థానం దక్కించుకోగా.. రూ.123,56,72,334 కోట్లతో రాజమహేంద్రవరం ద్వితీయ స్థానంలో నిలిచి ఎన్ఎస్‌జీ–2 హోదా దక్కించుకుంది. రూ.52,02,63,612 కోట్ల ఆదాయం సమకూర్చి కాకినాడ టౌన్ స్టేషన్ ఎన్ఎస్‌జీ–3 హోదా దక్కించుకుంది.

హోదా ఎంపిక ఇలా..

రైల్వే శాఖలో ఎన్ఎస్‌జీ ఎంపికకు కొన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన అన్ని రకాల వసతులూ కల్పించాలి. స్టేషన్ ద్వారా రైళ్ల రాకపోకలు పెంచాలి. స్టేషన్ అభివృద్ధి చేపట్టాలి. ఈ క్రమంలో ప్రయాణికుల నుంచి సమకూరే ఆదాయాన్ని బట్టి ఎన్ఎస్‌జీకి ఎంపిక చేస్తారు. స్టేషన్లను నాన్ సబర్బన్ గ్రూప్స్ (ఎన్ఎస్‌జీ), సబర్బన్ గ్రూప్స్ (ఎస్‌జీ), హాల్ట్ స్టేషన్ గ్రూప్స్(హెచ్‌జీ)గా విభజిస్తారు. ఎన్ఎస్‌జీలో మళ్లీ ఆరు, ఎస్‌జీలో 3, హెచ్‌జీలో 3 విభాగాలు ఉంటాయి. వీటిలో స్టేషన్‌కు సమకూరే ఆదాయాన్ని బట్టి గ్రేడ్‌లు కేటాయిస్తారు.

ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణం దృష్ట్యా ప్రారంభం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నిర్మాణ సమయంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన సిమెంట్, రాయి, యంత్రాలు, ఇనుము వంటి సామగ్రి తరలించేందుకు 1847 నుంచి 1852 వరకూ ఈ రైల్వే ట్రాక్ నిర్మాణం జరిగింది. ఆనకట్ట నిర్మాణం అనంతరం 1852లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. తర్వాత ఈస్ట్‌కోస్ట్ స్టేషన్ పరిధిలో 1893 – 96 మధ్య 1,288 కిలో మీటర్ల మేర విజయవాడ – కటక్ మధ్య ట్రాక్ నిర్మించి రైళ్ల రాకపోకలకు అనుమతించారు. 1899లో విజయవాడ – మద్రాసుకు అనుసంధానం చేశారు. అప్పటికి గోదావరి నదిపై వంతెన లేకపోవడం ఇబ్బందిగా మారింది. 1900 సంవత్సరంలో రాజమహేంద్రవరం వద్ద హేవలాక్ బ్రిడ్జి (పాత రైలు వంతెన) నిర్మించారు. అప్పటి నుంచీ రాజమహేంద్రవరం, గోదావరి రైల్వే స్టేషన్లు నిరంతరాయ సేవలు అందిస్తున్నాయి.

హోదా వివరాలు ఇలా..

విభాగం	ఆదాయం (రూ.కోట్లలో)	ప్రయాణికులు
ఎన్ఎస్‌జీ-1	500	2 కోట్లు దాటాలి
ఎన్ఎస్‌జీ-2	100-500	1-2 కోట్లు
ఎన్ఎస్‌జీ-3	20-100	50 లక్షల నుంచి కోటి
ఎన్ఎస్‌జీ-4	10-20	20 లక్షల నుంచి 50 లక్షలు
ఎన్ఎస్‌జీ-5	కోటి-10 లక్షలు	10 లక్షల నుంచి 20 లక్షలు
ఎన్ఎస్‌జీ-6	కోటి కంటే తక్కువ	10 లక్షల లోపు



డిజిటల్ చెల్లింపులదే హవా

- ఆన్‌లైన్ చెల్లింపులకు చిరు వ్యాపారులూ మొగ్గు
- నగదు లావాదేవీలకు క్రమంగా స్వస్తి

సాక్షి, భీమవరం: నిన్న మొన్నటి వరకూ పెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు నేడు చిన్న వ్యాపారుల, తోపుడు బండ్ల వ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండగా ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే దర్శనమిస్తున్నాయి. కేంద్రప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు తర్వాత డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించలేదు. షాపింగ్ మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు జరిగేవి. అప్పట్లో ఆన్‌లైన్ పేమెంట్ల వల్ల తమ ఖాతాలోని నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న భయంతో చిన్నపట్టణాలు, గ్రామాల్లో ఆన్‌లైన్ చెల్లింపుల జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ కారణంగా నగదు రహిత లావాదేవీల్లో గణనీయమైన మార్పులు ప్రారంభమయ్యాయి. ఇంట్లోంచి బయటకు రాకుండా కావల్సిన వస్తువులను ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవడమేగాక చెల్లింపులు కూడా ఆన్‌లైన్‌లోనే చేయడం పెరిగింది. ఇక కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జీలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలావరకూ యాప్ ద్వారానే సాగిపోతున్నాయి. బజ్జీల బండి, బటర్ మిల్క్ బండి, వల్కనైజింగ్ సెంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ స్టిక్కర్ల హవా సాగుతోంది. పేమెంట్ యాప్‌ల వినియోగంలో వృద్ధులు సైతం ముందు వరుసలో ఉంటున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాలో 351 బ్యాంకుల్లో సేవలు

పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వరంగ బ్యాంకులు 237, ప్రైవేట్ బ్యాంక్‌లు 79, జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్‌లు 15, చైతన్య గ్రామీణ బ్యాంక్‌లు 20 ఉన్నాయి. వాటి ద్వారా ఖాతాదారులకు డిజిటల్ బ్యాంక్ సదుపాయాలు కలుగచేస్తుండగా ప్రతి బ్యాంక్ సొంత డిజిటల్ బ్యాంక్ యాప్ ద్వారా ఖాతాదారులకు అవగాహన కల్పిస్తుంది. అన్ని రకాల వ్యాపారులకు యూపీఐ ఐడీ, క్యూర్ కోడ్ అందించడంతో దాదాపు 80 శాతం మంది డిజిటల్ బ్యాంక్ సేవలు వినియోగించుకుంటున్నారు. భీమవరం రీజియన్ పరిధిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 73 బ్రాంచ్‌లుండగా ప్రతిరోజు సుమారు 1.35 లక్షల మంది డిజిటల్ బ్యాంకింగ్ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులతో ప్రధానంగా చిల్లర సమస్య తప్పింది. టీ స్టాళ్లు, హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిళ్లపై రోడ్ల పక్కన, ఇంటింటికీ తిరుగుతూ కూరగాయలు, పండ్లు అమ్మే వ్యాపారులకు గతంలో చిల్లర సమస్య ఉండేది. కొన్నిసార్లు చిల్లర లేక బేరాలు సైతం వదులుకోవాల్సివచ్చేది. ప్రస్తుతం ఆన్‌లైన్ చెల్లింపుల వల్ల చిల్లర సమస్య లేకపోవడంతో చిరు వ్యాపారులు సైతం వీటి వైపు మక్కువ చూపుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్ ఆయా సంస్థల ఏజెంట్లు వెనువెంటనే అందజేస్తుండడంతో ఏ దుకాణం వద్ద చూసినా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి.


భీమవరంలోని ఎలక్ట్రికల్ షాపు వద్ద క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేస్తున్న దృశ్యం

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో మోసాలకు చెక్ పెట్టేలా స్పీకర్ బాక్స్‌లు ఏర్పాటుచేస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపు జరగగానే ఎంత అమౌంట్ జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో ఆడియో మెసేజ్ వస్తుంది.

పెరిగిన డిజిటల్ బ్యాంకింగ్ సేవలు



ప్రస్తుతం చిరువ్యాపారుల వద్ద కూడా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు పెరిగాయి. వినియోగదారులు ఎక్కువ మంది ఫోన్‌పే లేదా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఉపయోగించి చెల్లింపులు చేస్తున్నారు. దీంతో చిల్లర సమస్య తీరడంతోపాటు సమయం కూడా కలిసివస్తోంది. ఆన్‌లైన్ చెల్లింపులను అన్నివర్గాల ప్రజలు ఉపయోగిస్తున్నారు.

సీహెచ్ రామకృష్ణ, వ్యాపారి, భీమవరం

పర్సులో సొమ్ములు లేకున్నా షాపింగ్



గతంలో చేతిలో పర్సు అందులో సొమ్ములు పెట్టుకుని బజారుకు వెళ్లాల్సివచ్చేది. నేడు డిజిటల్ పేమెంట్ల వల్ల పర్సు లేకున్నా ఫోన్ పే, లేదా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను వినియోగించుకుని సెల్‌ఫోన్ ద్వారా చెల్లింపులు చేస్తున్నాం

సీహెచ్ ఎస్ చంద్రిక, భీమవరం

కో అపరేటివ్ బ్యాంకుల్లోను డిజిటల్ లావాదేవీలు

కోఆపరేటివ్ బ్యాంకుల్లోను డిజిటల్ బ్యాంకింగ్ వినియోగం అమలులో ఉంది. ఏటీఎం కార్డులు, యాప్‌లను ఉపయోగించి అనేక మంది ఖాతాదారులు సేవలు పొందుతున్నారు. దీంతో బ్యాంకుల్లో ఉద్యోగులకు ఒత్తిడి తగ్గుతోంది.

టీవీ రెడ్డినాయుడు, భీమవరం బ్రాంచ్ మేనేజర్

దారి దోపిడీ

- ఇష్టారాజ్యంగా తిరుగుతున్న ప్రైవేటు బస్సులు
- వాహన చట్టానికి తూట్లు
- ప్రత్యేక డ్రైవ్‌లో వెలుగు చూసిన అక్రమాలు

– ఓ ట్రావెల్స్ సంస్థ ఒకే పర్మిట్‌తో రెండు బస్సులను కొన్నేళ్లుగా నడుపుతోంది. గత నెలలో రవాణా శాఖాధికారులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో ఈ విషయం వెలుగు చూసింది. పత్రాలను క్షుణంగా పరిశీలించిన అధికారులు ఒక పర్మిట్‌తో రెండు బస్సులు నడుపుతున్నట్లు నిర్ధారించి, ఆ బస్సును సీజ్ చేశారు.

– ఓ బస్సుటాప్‌పై ఎలక్ట్రానిక్ పరికరాలు, వివిధ రకాల వస్తువులు సుమారు వంద కిలోలు వేసుకుని తిరుపతి నుంచి బెంగళూరు వైపుగా వెళుతుండగా రవాణాశాఖ అధికారులు ఆ బస్సును సీజ్ చేసి, దాని యజమానికి జరిమానా విధించారు. నిబంధనల మేరకు కాంటాక్ట్ క్యారియర్లలో లగేజీ తరలించడానికి వీలు లేదు.

చిత్తూరు రూరల్: ప్రైవేటు బస్సుల యజమానులు దారి దోపిడీకి పాల్పడుతున్నారు. వాహన చట్టాలకు తూట్లు పొడిచి, వాహనాలను నడుపుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటిపై రవాణాశాఖ నిఘా పెంచి, కొరడా ఝుళిపిస్తోంది. జిల్లాలో కాంటాక్ట్ క్యారియర్ వాహనాలు 328, స్టేజీ గ్యారేజీ వాహనాలు 104, టూరిస్ట్ ట్రావెల్స్ 37, ఇతర వాహనాలు 29 వరకు ఉన్నాయి. ఇవి జిల్లా కేంద్రం నుంచి తమిళనాడు, కర్ణాటక, కేరళ, నెల్లూరు, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, అనంతపురం తదితర ప్రాంతాలకు తిరుగుతుంటాయి. ఈ సర్వీసులు అధికంగా రాత్రిపూటే తిరుగుతుంటాయి. ఈ క్రమంలో కొన్ని బస్సుల నిర్వాహకులు వాహన చట్టానికి తూట్లు పొడుస్తున్నారు.

లగేజీ పేరుతో దందా...

కాంటాక్టు క్యారియర్ అనుమతి తీసుకుని నిబంధనలు ఉల్లంఘిస్తూ స్టేజ్ క్యారియర్‌గా బస్సులను నడుపుతుండడమే కాకుండా ఈ ట్రావెల్స్ ఏజెన్సీ నిర్వాహకులు పార్శిల్, లగేజీ దందాను అక్రమంగా నిర్వహిస్తున్నారు. వస్తు సామగ్రిని ఒక చోట నుంచి మరోచోటుకు బస్సుల ద్వారా తరలించేందుకు అనుమతి లేకపోయినా యథేచ్ఛగా లగేజీ దందతా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ప్యాసింజర్లను చేరవేయడం ద్వారా ట్రావెల్ ఏజెన్సీలకు అనుకున్న స్థాయిలో లాభాలు ఉండవని, పెద్ద మొత్తంలో లగేజీని బస్సుల బాక్స్‌లతోపాటు టాప్‌పై తీసుకొస్తుండడంతో ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఈ లగేజీ కారణంగా ప్రమాద తీవ్రత పెరుగుతుందని పలువురు భావిస్తున్నారు.

భద్రత డొల్లా..

ప్రస్తుతం ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలు స్లీపర్ కోచ్‌లను తీసుకువచ్చాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. అయితే ఈ సీటింగ్ విధానంతో బస్సు లోపల స్థలం ఇరుకుగా మారింది. ఏదైనా ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రయాణికులు ఒకరిని దాటుకుని మరొకరు బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లోనే మరణాల సంఖ్య పెరుగుతుంది.


ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

సాధారణంగా కాంటాక్టు క్యారియర్ అనుమతి ఉన్నవారు పెళ్లిళ్లు, శుభకార్యాలకు బస్సులను అద్దెకిస్తారు. దానికి విరుద్ధం స్టేజ్ క్యారియర్ అనుమతి లేకున్నప్పటికీ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బస్సును నడపడమే కాకుండా మధ్య మధ్యలో బస్సును ఆపి ప్రయాణికులను చేరవేస్తున్నారు.

డిమాండ్ ఆధారంగా ధర

చిత్తూరు నుంచి బెంగళూరు, చెన్నై, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు వందలాది సర్వీసులు తిరుగుతున్నాయి. ఈ సర్వీసుల్లో గంట వ్యవధిలోనే ఆన్‌లైన్ బుకింగ్ ధరలు మారుతుంటాయి. డిమాండ్ పెరిగితే దానికి తగ్గట్టు టికెట్ ధర అమాంతంగా పెంచేస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం నుంచి సోమవారం వరకు టికెట్ ధరలు మండిపోతుంటాయి. ప్రయాణికుల అవసరం ఆధారం కాసులు దండుకుంటున్నారు. పండుగ సమయాల్లో రెండింతలుగా టికెట్ వసూలు చేస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్...

ప్రైవేటు బస్సుల అక్రమాలను అరికట్టేందుకు రవాణాశాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. ప్రత్యేక డ్రైవ్ పేరుతో తరచూ దాడులు చేస్తున్నారు. ఈ సమయంలో పన్ను చెల్లించని వాహనాలకు బ్రేకులు వేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న వాహనాలకు జరిమానా విధిస్తున్నారు.

వాహన చట్టాలను అధిగమిస్తే...

ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే ఊరుకోం. ఎట్టి పరిస్థితుల్లోను అలాంటి వాహనాలు రోడ్లపైకి రాకూడదు. అది వాహన చట్టానికి విరుద్ధం. ముఖ్యంగా పన్ను ఎగవేతకు చూస్తున్నారు. పట్టుబడితే మాత్రం అలాంటి వాహనాలను వదిలిపెట్టే ప్రసక్తేలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్ను చెల్లించని వారితో పన్ను కట్టించేలా చూస్తున్నాం. ఇందుకు వాహన యజమానులు కూడా సహకరించాలి.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

ఆగస్టులో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్

గుంటూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదవారి సొంతింటి కలను సాకారం చేసే కార్యక్రమంలో భాగంగా అడవితక్కెళ్లపాడులోని టిడ్కో నివాసాలను ఆగస్టులో లబ్ధిదారులకు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం గుంటూరు నగర శివారు అడవితక్కెళ్లపాడులో టిడ్కో నివాసాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4,192 ఫ్లాట్లు ఒక బ్లాక్, 1,888 మరో బ్లాక్‌ను ఆగస్టులో లబ్ధిదారులకు అందించనున్నట్లు తెలిపారు. అప్పుడే రిజిస్ట్రేషన్ కూడా చేయిస్తామని చెప్పారు. దీనికిగానూ ప్రభుత్వంపై రూ. 40 కోట్ల భారం పడనుందన్నారు. ఒక్కోటి రూ 7.20 లక్షల విలువచేసే టిడ్కో నివాసాలను ముఖ్యమంత్రి ఒక్క రూపాయికే అర్హత కలిగిన లబ్ధిదారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ ఫ్లాటు రిజిస్ట్రేషన్‌కు రూ. 60 వేలు అవుతుందని, దాన్ని సైతం ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే 300 అడుగుల ఫ్లాటుకు ప్రజల నుంచి రూ 7.20 లక్షలు వసూలు చేయాలని నిర్ణయించి 2008 ఫిబ్రవరి 8న జీవో సైతం రిలీజ్‌చేశారన్నారు. కానీ పేదల పక్షపాతి అయిన జగనన్న కేవలం ఒకే ఒక్క రూపాయికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నారని తెలిపారు. అనంతరం టిడ్కో నివాసాలను ఆయన పరిశీలించారు. ఈ నెలాఖరుకు ఫ్లాట్లు అన్ని సౌకర్యాలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ కోటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ బి స్మిత పద్మజ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


టిడ్కో నివాసాలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్

హాస్పిటల్ @ ఉమెన్



మహిళల కోసం... మహిళల చేత!

ఆ హాస్పిటల్‌లో మహిళలే డాక్టర్‌లు.
వార్డ్ బాయ్ అనే పదం వినిపించదు.
అన్ని సర్వీస్‌లూ మహిళలే అందిస్తారు.
నైట్ షిఫ్ట్ అని వెనుకడుగు వేయడం ఉండదు.
ఇరవై నాలుగ్గంటలూ మహిళలే పని చేస్తారు.

ఎమ్ఎమ్‌సీహెచ్... అంటే ముస్లిమ్ మెటర్నిటీ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్. ఇది హైదరాబాద్, చాదర్‌ఘాట్, ఉస్మాన్‌పురాలో ఉంది. ఈ హాస్పిటల్ గురించి చెప్పుకోవలసింది చాలానే ఉంది. మహిళల కోసం యాభై మూడేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌లో సీఈవో నుంచి సెక్యూరిటీ స్టాఫ్ వరకూ అందరూ మహిళలే. నో ప్రాఫిట్ నో లాస్ విధానంలో పని చేస్తున్న ఈ హాస్పిటల్ గురించి సీఈవో డాక్టర్ నీలోఫర్ ఇలా వివరించారు.

■ మూడు వందలకు పైగా...

''మహిళా సాధికారతకు చిహ్నం మా హాస్పిటల్. ఇది 200 పడకల హాస్పిటల్. కులం, మతం, ప్రాంతం అనే భేదాలు లేకుండా మహిళలందరికీ వైద్యసేవలందిస్తాం. విశేషం ఏమిటంటే... మహిళల కోసం ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌లో మూడు వందల మందికి పైగా మహిళలం సేవలందిస్తున్నాం. ప్రధాన ద్వారం సెక్యూరిటీ నుంచి రిసెప్షన్, ఫార్మసీ, ఫార్మసీ స్టోర్స్ నిర్వహణ, ల్యాబ్ టెక్నీషియన్‌లు అందరూ మహిళలే. అంబులెన్స్ డ్రైవర్‌లు, వెనుక ద్వారం దగ్గర సెక్యూరిటీ దగ్గర మాత్రం మగవాళ్లు డ్యూటీ చేస్తారు. 'ఇస్లామిక్ సోషల్ సర్వీస్ సొసైటీ' నగరంలో స్థాపించిన మూడు స్కూళ్లు, మూడు హాస్పిటళ్లలో ఇది ఒకటి. మహిళల హాస్పిటల్‌గా పేరు వచ్చినప్పటికీ నిజానికి ఇది మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్. ఇందులో చిన్న పిల్లల విభాగం, డర్మటాలజీ, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జరీ విభాగాలు కూడా పని చేస్తున్నాయి. రోజుకు ఓపీ రెండు వందల వరకు ఉంటుంది. అందులో నూట పాతిక వరకు మహిళలే ఉంటారు. నెలకు సరాసరిన రెండు వందల డెలివరీలుంటాయి.

■ ట్వంటీ ఫోర్ బై సెవెన్!

సెక్యూరిటీ, ఫార్మసీ, రిసెప్షన్ ఇరవై నాలుగ్గంటలూ పని చేస్తుంటాయి. వారంలో ఏడు రోజులూ, రోజులో ఇరవై నాలుగ్గంటలూ డ్యూటీలో ఉంటారు మహిళలు. మీకో సంగతి తెలుసా? మా హాస్పిటల్‌లో డే కేర్ సెంటర్ ఉంది. మహిళకు తగిన సౌకర్యాలు కల్పిస్తే ఏ షిఫ్ట్‌లోనైనా డ్యూటీ చేయగలరని నిరూపిస్తోంది మా హాస్పిటల్. ఇది టీచింగ్ హాస్పిటల్. వరంగల్, కెఎన్ఆర్ యూనివర్సిటీలతో అనుసంధానమై ఉంది. బీఎస్సీ నర్సింగ్ కాలేజ్ నుంచి ఏటా ముప్పైమందికి మహిళలకు అవకాశం ఉంటుంది. హాస్టల్ కూడా ఇదే ప్రాంగణంలో ఉంది. మా హాస్పిటల్‌లో కెఫెటేరియాతో పాటు లైబ్రరీ కూడా ఉంది చూడండి. వైద్య రంగంలో అమూల్యమైన పుస్తకాల కలెక్షన్ ఉంది. బయటకు ఇవ్వం, ఎవరైనా వచ్చి చదువుకోవచ్చు.



40 ఇంక్యుబేటర్‌లు, వార్మర్, ఫొటో థెరపీ సర్వీస్, పుట్టిన బిడ్డ వినికిడి పరీక్ష కోసం ఆడిటరీ టెస్ట్ సౌకర్యం కూడా ఉంది. మా హాస్పిటల్ నిర్మాణం ఎంత ముందు చూపుతో జరిగిందంటే... డెలివరీ రూమ్ నుంచే నియోనేటల్‌కు, పోస్ట్ ఆపరేటివ్ వార్డుకు కనెక్షన్ ఉంది. అవసరమైతే బిడ్డను ఆ విభాగానికి పంపించి తల్లిని ఈ వార్డుకి షిఫ్ట్ చేస్తాం. ఇద్దరూ క్షేమంగా ఉంటే మామూలు వార్డుకి లేదా రూమ్‌కి షిఫ్ట్ చేస్తాం.

■ వైద్యపరీక్షలిక్కడే!

మా దగ్గర పూర్తి స్థాయి ల్యాబ్ ఉంది. 98శాతం టెస్ట్‌లు ఇక్కడే చేస్తాం. కొన్ని ప్రత్యేకమైన కేసులకు మాత్రం శాంపుల్స్ ముంబయికి పంపిస్తాం. ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్, సోనాలజిస్ట్‌లతో పాటు రేడియాలజిస్ట్ కూడా మహిళే. రేడియాలజీలో మహిళలు తక్కువగా ఉంటారు. ట్రీట్‌మెంట్ సమయంలో రేడియాలజిస్ట్ కూడా కొంత రేడియేషన్ ప్రభావానికి గురవుతుంటారు. కాబట్టి మహిళలు తాము గర్భిణులుగా ఉన్నప్పుడు డ్యూటీ చేయడం కష్టం. అందుకే ఈ రంగాన్ని ఎంచుకోవడానికి కొంచెం సంశయిస్తారు. అలాంటిది మా దగ్గర రేడియాలజిస్ట్‌గా కూడా మహిళే డ్యూటీ చేస్తున్నారు.

■ నార్మల్ డెలివరీల రికార్డ్!

ఎకరా విస్తీర్ణంలో నిర్మించిన మా హాస్పిటల్‌లో మొత్తం డాక్టర్లు పాతిక మంది. మెటర్నిటీ విభాగంలో ఇద్దరు హెచ్‌వోడీలతోపాటు పన్నెండు మంది డాక్టర్లు, దాదాపు వందమంది నర్సింగ్ స్టాఫ్, ఎనభైకి పైగా హౌస్ కీపింగ్ ఎంప్లాయిస్ విధులు నిర్వర్తిస్తున్నారు. పేట్ల బురుజులో ఉన్న గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ తర్వాత అత్యధికంగా ప్రసవాలు జరిగేది మా హాస్పిటల్‌లోనే. గత ఏడాదికి గాను అత్యధికంగా నార్మల్ డెలివరీలు చేసిన హాస్పిటల్‌గా మా హాస్పిటల్‌కి ప్రశంసలు కూడా వచ్చాయి. మగ డాక్టర్లు నియోనేటల్ విభాగంలో మాత్రం ఉన్నారు.

ప్రధాన ద్వారం నుంచి కారిడార్‌తోపాటు ముఖ్యమైన ప్రదేశాలన్నీ సీసీటీవీ నిఘాలో ఉంటాయి. ఐసీయూ బెడ్ పట్టే స్థాయి లిఫ్ట్ కూడా ఉంది. ఇన్ని సౌకర్యాలున్నప్పటికీ ఇది చారిటీ హాస్పిటల్ కావడంతో మా దగ్గర ఫీజులు చాలా చాలా తక్కువ. ఓ యాభై ఐదేళ్ల కిందట ఒక మహిళ మగ డాక్టర్ దగ్గర ప్రసవం చేయించుకోవడానికి ఇష్టపడక, ఆ సమయానికి లేడీ డాక్టర్ అందుబాటులో లేక చివరికి ఆ గర్భిణి మరణించిందట. ఆ సంఘటన తర్వాత మహిళల కోసం మహిళలే పని చేసే ఒక హాస్పిటల్ ఉండాలని భావించిన అబ్దుల్ రజాక్ లతీఫ్ ఈ హాస్పిటల్‌ను ప్రతిపాదించారు. యాభై మూడేళ్లుగా మహిళల కోసం మహిళలే ఇరవై నాలుగ్గంటలూ సేవలందిస్తున్నారు'' అంటూ వివరించారు డాక్టర్ నీలోఫర్.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మనకు ఊహ తెలిసిన దగ్గర నుంచి పెద్దయ్యాక ఇది అవ్వాలి, అది అవ్వాలి అని రకరకాల కలలు కంటాము. ఎంతో ఇష్టమైన కలను నిజం చేసుకునేందుకు ఎదురైన అడ్డంకులన్నింటిని దాటుకుని సాధిస్తాం. హమ్మయ్య చేరుకున్నాం అని కాస్త సంతోషపడేలోపు అనుకోని కుదుపులు కెరీర్‌ను పూర్తిగా నాశనం చేస్తాయి. తిరిగి కోలుకోలేని దెబ్బకొడతాయి. అచ్చం ఇలానే జరిగింది అన్నుక పర్వాణి జీవితంలో. తనకెంతో ఇష్టమైన కెరీర్‌ను వదిలేసినప్పటికీ... యోగా ఇచ్చిన ధైర్యంతో యోగానే కెరీర్‌గా మలుచుకుని సెలబ్రెటీ యోగా ట్రైనర్‌గా రాణిస్తోంది పర్వాణి.



రెక్కలిచ్చిన ఆసనం


అన్నుక పర్వాణి

ముంబైకి చెందిన అన్నుక పర్వాణి విద్యావంతుల కుటుంబంలో పుట్టింది. అన్నుకకు చిన్నప్పటినుంచి ఆస్తమా ఉంది. అయితే మందులు మింగడం అంటే ఇష్టం ఉండేది కాదు. దీంతో డాక్టర్స్ అయిన తాతయ్య, నాయనమ్మలు... ''రోజూ స్విమ్మింగ్ చేస్తుంటే నీ ఊపిరి తిత్తులు బలంగా మారతాయి'' అని ప్రోత్సహించేవారు. మందులు మింగే బాధ ఉండదని, అన్నుక ఎంతో ఆసక్తిగా స్విమ్మింగ్ నేర్చుకుని రోజూ ఈతకొట్టేది. ఈతలో పట్టుసాధించి జాతీయస్థాయి ఛాంపియన్ షిప్స్‌లో గోల్డ్‌మెడల్ గెలిచింది. స్విమ్మింగ్‌తోపాటు విమాన ప్రయాణం అన్నా అన్నుకకు చాలా ఇష్టం. ఈ ఇష్టంతోనే పైలట్ కావాలని కలలు కనేది. పైలట్ అయ్యి, ప్రపంచమంతా తిరిగిరావాలని... కష్టపడి కమర్షియల్ పైలట్ అయ్యింది.

■ ఎగరలేకపోయింది

అది 2008.. అన్నుక అనుకున్నట్టుగానే పైలెట్‌గా గాలిలో తేలిపోతున్న రోజులవి. ఒకరోజు బైక్ యాక్సిడెంట్‌లో అనుష్క కాళ్లు, తల, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. ఎటూ కదల్లేని పరిస్థితి. కొన్ని నెలలపాటు బెడ్‌కే పరిమితమైంది. దీంతో కమర్షియల్ పైలట్ ఉద్యోగానికి ఫిట్ కాదని జాబ్ నుంచి తొలగించారు. ఒకపక్క గాయాలతో గుచ్చుకుంటోన్న శరీరం, మరోపక్క విమానం నడపలేని పరిస్థితి అన్నుకను కలచివేసింది. ఇదే సమయంలో తల్లిదండ్రులు అండగా ఉండి, తమ సంపూర్ణ సహకారం అందించడంతో... ఫిజియోథెరపీ, యోగాలతో కొన్ని వారాలలోనే కోల్పోయిన మనోధైర్యాన్ని కూడదీసుకుంది. ఎలాగైనా లేచి నడవాలి అని నిర్ణయించుకుని ఆసనాలను కఠోరంగా సాధన చేసేది. తన తల్లి యోగా టీచర్ కావడం, చిన్నప్పటి నుంచి ఆస్తమాను ఎదుర్కోవడానికి యోగాసనాలు వేసిన అనుభవంతో ఎనిమిది నెలల్లోనే కోలుకుని తిరిగి నడవగలిగింది.

> ఎంతమంది సెలబ్రెటీలకు యోగా ట్రైనర్‌గా పనిచేసినా నాకు ఎలాంటి ఒత్తిడీ ఉండదు. శిక్షణ ఇవ్వడమంటే ఇష్టం. ట్రైనింగ్ ఇస్తూ ఎంజాయ్ చేస్తున్నాను. ఎందుకంటే, నేను మనసా వాచా కర్మణ్యా పనిచేస్తున్నాను. ఎవరికైనా సలహాలు, సూచనలు ఇచ్చినప్పుడు అవి కచ్చితత్వంతోనూ, సత్యంతోనూ ఉంటేనే వాటికి విలువ ఉంటుంది. అందుకే నేను యోగాసనాలు వేసి, వేయించి, దాని శక్తిని అందరికీ తెలిసేలా చేస్తున్నాను. అందుకే నా శిక్షణకు ఆదరణ లభిస్తోంది.



■ యోగ శక్తిని తెలపాలని...

యోగాతో సాధారణ స్థితికి వచ్చిన అన్నుక.. తిరిగి పైలట్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ యోగాపై ఏర్పడిన నమ్మకం, ఆసక్తితో 'యోగాను ఎందుకు కెరీర్‌గా ఎంచుకోకూడదు? ఎగరలేక కిందపడిపోయిన తనని తిరిగి లేచి నడిచేలా చేసిన ఈ యోగా శక్తిని అందరికీ తెలియచేయాలి' అనుకుని.. తొమ్మిది నెలల పాటు యోగాలో శిక్షణ తీసుకుని సర్టిఫికెట్ అందుకుంది. యోగాను మరింత లోతుగా తెలుసుకునేందుకు ముంబై యూనివర్శిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసింది. పీజీ చేస్తూనే వివిధ రకాల సంప్రదాయ యోగాలను సాధన చేసి ఔపోసన పట్టింది. ఈ క్రమంలోనే పైలట్స్, బాలే, జుంబాను నేర్చుకుని సర్టిఫికెట్ పొందింది. 2015లో బాంద్రాలో యోగా ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పింది. సంప్రదాయ యోగాసనాలకు కొన్ని టెక్నిక్స్‌ను జోడించడంతో మంచి ఫలితాలు వచ్చేవి. దీంతో అన్నుక యోగా సెంటర్ బాగా పాపులర్ అయ్యింది.

■ అన్నుక యోగా స్టూడియో!

యోగాపై పెరిగిన అవగాహనతో సెలబ్రెటీలు సైతం తమ ఫిట్‌నెస్‌కోసం యోగాను ఎంచుకుంటున్నారు. అన్నుక ట్రైనింగ్ బావుండడంతో.. మలైకా అరోరా, హూమా ఖురేషి, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, కరీనా కపూర్, ఆలియా భట్, దీపికా పదుకోన్, రకుల్ ప్రీత్ సింగ్, మిస్తా గుప్తా, అనన్య పాండే, జాహ్నవీ కపూర్, సోనాల్ చౌహాన్ వంటి సెలబ్రెటీలు అన్నుక దగ్గర యోగాలో శిక్షణ తీసుకున్నారు.

డిజిటల్ స్టార్
దుర్గ

నవ్వుల పువ్వుల తోటమాలి



'ధర్నా దుర్గ' గా సోషల్ మీడియాలో పాపులర్ అయిన దుర్గ ఏ ధర్నా చౌక్ దగ్గర ధర్నా చేయలేదు. సింగిల్ నినాదం కూడా చేయలేదు. అయితే ఆమె నవ్వులు మాత్రం ధర్నా చేయకపోయినా హల్‌చల్ చేస్తాయి. నాన్‌స్టాప్‌గా నవ్వేలా చేస్తాయి...

ఫ్యామిలీ ఫంక్షన్‌లలో ఏం ఉన్నా లేకపోయినా, ఎవరు ఉన్నా లేకపోయినా దుర్గ ఉండాల్సిందే. ఎందుకంటే దుర్గ ఉన్నచోట 'హా హహహో'లతో కూడిన భారీ నవ్వుల వర్షం కురుస్తుంది. ఆ నవ్వుల వర్షంలో తడిసిపోవడానికి చుట్టాలు పక్కాలు అమిత ఉత్సాహం చూపుతారు.

ఆ నవ్వుల బలంతోనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, కంటెంట్ క్రియేటర్‌గా బోలెడు పేరు తెచ్చుకుంది దిల్లీకి చెందిన ధర్నా దుర్గ.

నిజజీవితంలోని సంఘటనల చుట్టూ హాస్యాన్ని అల్లుకునే ధర్నా దుర్గకు సామాజిక మాధ్యమాలలో భారీ అభిమాన గణం ఉంది.

హీరోయిన్‌ల గొంతును అనుకరించడం తన ప్రత్యేకత. సారా అలీఖాన్ గొంతును అద్భుతంగా అనుకరిస్తుంది. సారా ఫేవరెట్ డైలాగ్ 'నమస్తే దర్శకో'పై ఫన్నీగా వీడియో చేసింది దుర్గ. ఈ వీడియో చూసి సారా అలీఖాన్ ముచ్చటపడడమే కాదు, దుర్గను మెచ్చుకుంటూ వీడియోను పోస్ట్ చేసింది.

కరోనా కల్లోలంలో, ఇంటికే పరిమితం కావాల్సిన అనివార్యత వల్ల చాలామందిలాగే దుర్గ కూడా బోర్‌గా ఫీలైంది.

దాని నుంచి బయటపడడానికి సెలబ్రిటీలను అనుకరిస్తూ సరదాగా వీడియోలు చేయడం ప్రారంభించింది. ఇవి తన స్నేహితులకు తెగ నచ్చి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవారు. వాటికి అనూహ్యమైన స్పందన లభించేది. ఇక అప్పటినుంచి ఆమె వెనక్కి తిరిగి చూసుకోలేదు. తలపై 'కామెడీ క్వీన్' అనే కిరీటం వచ్చి చేరింది.

'ఈ వీడియోలు ఏమిటో, లైక్‌లు ఏమిటో!' అన్నట్లుగా ఆశ్చర్యంగా చూసేవారు దుర్గ తల్లిదండ్రులు. వారికి అన్నీ ఓపికగా చెప్పేది దుర్గ.

తమ చుట్టాలు పక్కాలలో 'ఫస్ట్ డిజిటల్ కంటెంట్ క్రియేటర్'గా తొలి గుర్తింపు తెచ్చుకుంది దుర్గ.

నాటక రంగ నేపథ్యం ఉన్న దుర్గకు లోతైన పరిశీలన శక్తి ఉంది. అది తాను చేసే ఫన్నీ వీడియోలకు ఎంతో ఉపయోగపడుతుంది.

రియాలిటీ షోలపై దుర్గ వేసే ఫన్నీ పంచ్‌లకు నవ్వు ఆపుకోవడం చానా కష్టం. 'బిగ్ బాస్'లాంటి ప్రసిద్ధ రియాలిటీ షోల నుంచి క్యారెక్టర్లను అల్లుకొని ప్రేక్షకులను తెగ నవ్విస్తుంది.

నృత్య నైపుణ్యం దుర్గ అదనపు బలం.

కొరియోగ్రాఫర్‌లపై ఫన్నీ వీడియోలు చేస్తున్న క్రమంలో ఆమె చేసిన డ్యాన్స్ ఎంతోమందిని ఆకట్టుకుంది. 'డ్యాన్సర్ ధర్నా దుర్గ'గా పేరు తెచ్చుకుంది.

వేలాదిమందిని నవ్విస్తున్న ధర్నా దుర్గ... 'నవ్విస్తే ఇంత పేరు వస్తుందని తెలియదు' అంటోంది నవ్వుతూ!

ఇంటిప్స్

బెండకాయ ముదరకుండా...



రిఫ్రిజిరేటర్‌లో పెట్టినప్పటికీ ఒకోసారి బెండకాయలు పాడవుతుంటాయి. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. బెండకాయలను తాజాగా ఉంచేందుకు ఇలా చేసి చూడండి..

- మార్కెట్ నుంచి తెచ్చిన బెండకాయల్లో తాజాగా ఉన్న బెండకాయలను ఏరి పక్కన పెట్టుకోవాలి.
- తాజా బెండకాయలన్నింటిని స్పూను వెనిగర్ వేసిన నీటిలో వేసి ఇరవై నిమిషాలు ఉంచాలి. తరువాత సాధారణ నీటితో కడిగి, తడిలేకుండా తుడిచి ఆరబెట్టుకోవాలి.
- ఆరిన బెండకాయలను నచ్చిన పరిమాణం, ఆకారంలో ముక్కలుగా తరిగి జిప్‌లాక్ బ్యాగ్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో స్టోర్ చేసుకోవాలి.
- ఇలా నిల్వచేసుకుంటే బెండకాయలు ఎక్కువ రోజులపాటు తాజాగా . రుచిగా ఉంటాయి. అవసరమైనప్పుడు జిప్‌లాక్ బ్యాగ్‌ను బయటకు తీసి వేడినీటిలో కొద్దిసేపు ఉంచాలి. కూలింగ్ తగ్గిన తరువాత వాడుకోవాలి.

సైబర్ టాక్

స్నాప్‌చాట్ వాడుతున్నారా?!


ప్రతీకాత్మక చిత్రం

స్నాప్‌చాట్ అనేది ఈ రోజుల్లో టీనేజర్స్ ఎక్కువగా ఉపయోగిస్తున్న మోడర్న్ మెసేజింగ్ యాప్. ఇందులో యూజర్లు తమ ఫొటోలు, వీడియోలను స్నాప్‌లుగా మార్చుకుంటారు. మన ఫ్రెండ్స్ జాబితాలోని వారు వాటిని చూసిన తర్వాత అవి అదృశ్యమవుతాయి. స్నేహితులతో కనెక్ట్ అవడం, గేమ్స్, న్యూస్, వినోదం, క్విజ్‌లు, వినూత్న ఫొటో, వీడియో ఎడిటింగ్ టూల్స్ వంటి వివిధ ఫీచర్లను ఇది అందిస్తుంది. ఈ ఫీచర్లు, దాని ఇంటరాక్టివ్ నేచర్, సృజనాత్మకత కారణంగా స్నాప్‌చాట్ వినియోగదారులను... ముఖ్యంగా యువతను ఆకర్షిస్తోంది.

స్నాప్‌చాట్ అకౌంట్.. హ్యాకింగ్, సెక్స్టార్షన్, సైబర్ బెదిరింపు, మోసం వంటి వివిధ సైబర్ నేరాలకు అవకాశం ఇచ్చేలా ఉంది. ఇవి యూజర్ల వ్యక్తిగత సమాచారానికి తీవ్రమైన నష్టాలను కలిగిస్తాయి.

స్నాప్‌చాట్ సురక్షితంగా ఉండటానికి, వినియోగదారులు పటిష్ఠమైన భద్రతా పద్ధతులను అమలుచేయాలి. గోప్యతా సెట్టింగ్‌ల విషయంలో జాగ్రత్త వహించాలి. అలాగే, కంటెంట్‌ను షేర్ చేసేటప్పుడు, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు ఉన్నట్టుగా అనిపిస్తే వెంటనే స్నాప్‌చాట్ సంబంధిత అధికారులకు నివేదించాలి.

తరచూ జరిగే నేరాలు

- ఇది వర్చువల్ దండయాత్రగా చెప్పుకోవచ్చు. స్నాప్‌చాట్ అకౌంట్ హ్యాకింగ్ అనేది ప్రధానంగా ఉన్న సైబర్‌నేరం. దీనివల్ల బాధితులు వివిధ రకాల దోపిడీకి గురవుతారు. హ్యాకర్లు యూజర్ ఖాతాలకు అనధికారక యాక్సెస్‌ను పొందడానికి ఫిషింగ్, కీ లాగింగ్ లేదా బ్రూట్ ఫోర్స్ దాడులు వంటి అనేక రకాల టెక్నాలజీలను ఉపయోగిస్తారు. ఒకసారి రాజీ పడితే హ్యాకర్లు వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయవచ్చు. హానికరమైన సందేశాలను పంపవచ్చు. లేదా తదుపరి నేరాలకు పాల్పడేందుకు యూజర్‌లా నటించవచ్చు.
- సెక్స్టార్షన్ అనేది ఇందులో మరింత ఆందోళన కలిగించే అంశం. సైబర్ నేరగాళ్లు అభ్యంతరకరమైన కంటెంట్‌ను పంపేలా బలవంతం చేయడం ద్వారా బాధితుల నమ్మకాన్ని దోపిడీ చేస్తారు. ఇక్కడ నుంచి తరచుగా ఆర్థికపరమైన డిమాండ్లను నెరవేర్చకపోతే విషయాన్ని బహిరంగంగా విడుదల చేస్తామని లేదా బాధితుడి పరిచయాలకు షేర్ చేస్తామని బెదిరిస్తారు. దీంతో బాధితులు తీవ్ర ఒత్తిడితో కూడిన పరిణామాలను ఎదుర్కొంటారు.
- స్నాప్‌చాట్ మెసేజ్‌ల ద్వారా సైబర్ బెదిరింపుల నుంచి విముక్తి లభించదు. వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వేధించే, బెదిరించే లేదా ద్వేషపూరిత కంటెంట్‌ను వ్యాప్తి చేసే హానికరమైన వినియోగదారులకు ఈ ప్లాట్‌ఫారమ్ బ్రీడింగ్ గ్రౌండ్‌గా పనిచేస్తుంది. స్నాప్‌చాట్ సైబర్ బెదిరింపు తీవ్రమైన మానసిక క్షోభకు దారి తీస్తుంది. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది.
- వ్యక్తుల నకిలీ ప్రొఫైల్స్ సృష్టించడానికి స్నాప్‌చాట్ సులువుగా అనుమతిస్తుంది. దీనిని సాధారణంగా క్యాట్‌ఫిషింగ్ అని పిలుస్తారు. ఈ మోసగాళ్లు యూజర్లను తప్పుడు సంబంధాలు లేదా స్నేహాలలోకి ఆకర్షిస్తారు. కల్పిత కథలు, దొంగిలించిన చిత్రాలతో మోసగిస్తారు. ఈ విధానాల వల్ల తీవ్ర ఒత్తిడితో అనారోగ్య సమస్యలకు దారితీయవచ్చు.
- స్నాప్‌చాట్ మెసేజ్‌లు వెంటనే అదృశ్యమై, అభద్రతా భావాన్ని సృష్టించగలదు. ఈ విషయంలో యూజర్లు జాగ్రత్త వహించాలి. స్క్రీన్‌షాట్‌లు, అనధికారిక అప్లికేషన్లు, వ్యక్తిగత కంటెంట్‌ను క్యాప్చర్ చేయగలవు. ఒకసారి లీక్ అయితే, ఆ వ్యక్తి ప్రతిష్ఠకు తన వ్యక్తిగత జీవితానికి కోలుకోలేని నష్టం కలిగిస్తుంది.

కొన్ని భద్రతా చిట్కాలు

- మీ కంఫర్ట్ లెవల్‌కు అనుగుణంగా ఉండే సెట్టింగ్‌లను ఎంచుకోండి. నమ్మదగిన స్నేహితులకు మాత్రమే యాక్సెస్‌ని పరిమితం చేయండి.
- నిజజీవితంలో మీకు తెలిసిన, విశ్వసించే వ్యక్తులను మాత్రమే అనుమతించండి. హాని కలిగించే అపరిచితుల రిక్వెస్ట్‌ను యాడ్ చేయడం మానుకోండి.
- లైంగికపరమైన కంటెంట్‌ను షేర్ చేయడాన్ని నివారించండి.
- మీ సమాచారాన్ని ఇతరులు దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున మీ పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నంబర్ లేదా ఆర్థిక వివరాలను స్నాప్‌చాట్‌లో షేర్ చేయవద్దు.
- స్నాప్‌చాట్ నుండి ఎవరినైనా కలవాలని నిర్ణయించుకుంటే పబ్లిక్ లొకేషన్‌ను మాత్రమే ఎంచుకోండి.
- తెలియని షార్ట్ లింక్‌లపై క్లిక్ చేయడం లేదా అనుచిత మెసేజ్‌లకు ప్రతిస్పందిస్తూ వ్యక్తిగత సమాచారాన్ని అందించడం మానుకోండి. స్నాప్ చాట్ లేదా చట్టబద్ధమైన కంపెనీలు... యాప్ ద్వారా మీ లాగిన్ ఆధారాలను లేదా వ్యక్తిగత వివరాలను ఎన్నటికీ అడగవు.
- స్నాప్‌చాట్ రీసెంట్ అప్‌డేట్స్‌ను ఇన్‌స్టాల్ చేయండి. దీని ద్వారా దోపిడీ ప్రమాదాన్ని నివారించవచ్చు.
- స్నాప్ మ్యాప్ ఫీచర్‌ని ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండండి. ఇది మీరున్న ప్లేస్‌ను అకౌంట్‌లోని స్నేహితులకు చూపుతుంది. అందుకని మ్యాప్ ఫీచర్‌ను స్టాప్ చేయండి.

స్నాప్‌చాట్ ద్వారా సైబర్‌నేరానికి గురైతే వెంటనే.. https://help.snapchat.com/hc/en-us/articles/7012399221652-How-to-Report-Abuse-on-Snapchat కి రిపోర్ట్ చేయాలి. అదేవిధంగా, సమస్య పరిష్కారానికి https://www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ

'హాల్ ఆఫ్ ఫేమ్' ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. అమెరికాలోని న్యూపోర్ట్లో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో సాకేత్-యూకీ ద్వయం 3-6, 6-1, 10-8తో టామీ పాల్-స్పిజిరి (అమెరికా) జంటను ఓడించింది. హైదరాబాద్కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జంట కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది. అనిరుధ్-ప్రశాంత్ 6-4, 6-3తో జూలియన్ క్యాష్ (బ్రిటన్)-మాక్సిమి క్రెసీ (అమెరికా)లపై గెలిచారు.

ఆసియా కప్లో సెప్టెంబర్ 2న భారత్, పాక్ పోరు

పాకిస్తాన్, శ్రీలంకలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 13 వరకు వన్డే ఫార్మాట్లో జరిగే ఆసియా కప్ షెడ్యూల్ను ప్రకటించారు. గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, నేపాల్... గ్రూప్ 'బి'లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ ఉన్నాయి. క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి రేపే భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ సెప్టెంబర్ 2న కాండీలో జరుగుతుంది. సెప్టెంబర్ 4న నేపాల్తో భారత్ ఆడుతుంది. ఒక్కో గ్రూప్ నుంచి రెండు జట్లు 'సూపర్ 4' దశకు చేరుతాయి. 'సూపర్ 4'లో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు ఫైనల్లో తలపడతాయి.



భారత్ను గెలిపించిన జెమీమా

రెండో వన్డేలో బంగ్లాదేశ్పై 108 పరుగులతో నెగ్గిన హర్మన్ప్రీత్ బృందం


జెమీమా రోడ్రిగ్స్

మిర్పూర్: సిరీస్లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్లో భారత మహిళల జట్టు మెరిసింది. బంగ్లాదేశ్తో బుధవారం జరిగిన రెండో వన్డేలో హర్మన్ప్రీత్ కౌర్ బృందం 108 పరుగులతో ఘనవిజయం సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ ఆల్రౌండ్ ప్రదర్శనతో భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్న జెమీమా 86 పరుగులు చేయడంతోపాటు బంతితో రాణించి 3 పరుగులిచ్చి 4 వికెట్లు తీసింది. తాజా ఫలితంతో మూడు మ్యాచ్ల సిరీస్లో ప్రస్తుతం రెండు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి. నిర్ణాయక మూడో వన్డే శనివారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 228 పరుగులు సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ (78 బంతుల్లో 86; 9 ఫోర్లు), కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 52; 3 ఫోర్లు) అర్ధ సెంచరీలతో భారత్ను ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్కు 131 పరుగుల భాగస్వామ్యం జోడించారు. వన్డేల్లో తన అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన 22 ఏళ్ల జెమీమా 2019 తర్వాత మళ్లీ వన్డేల్లో అర్ధ సెంచరీ చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (58 బంతుల్లో 36; 4 ఫోర్లు), హర్లీన్ (36 బంతుల్లో 25) కూడా రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తానా ఖాతూన్, నహీదా అక్తర్ రెండు వికెట్ల చొప్పున తీశారు. 229 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 35.1 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. ఫర్జానా హక్ (47; 5 ఫోర్లు), రీతూ మోని (27; 3 ఫోర్లు), ముర్షిదా ఖాతూన్ (12; 3 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. జెమీమా తన ఆఫ్ స్పిన్ మాయాజాలంతో 3.1 ఓవర్లు వేసి కేవలం 3 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టింది. లెగ్ స్పిన్నర్ దేవిక వైద్య 30 పరుగులిచ్చి 3 వికెట్లు తీసింది. మేఘన సింగ్, స్నేహ్ రాణా, దీప్తి శర్మలకు ఒక్కో వికెట్ లభించింది.

పాక్ విజయలక్ష్యం 131

గాలె: శ్రీలంక జట్టుతో తొలి టెస్టులో విజయం సాధించడానికి పాకిస్తాన్ చివరిరోజు మరో 83 పరుగులు చేయాలి. చేతిలో ఏడు వికెట్లు ఉన్నాయి. 131 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 48 పరుగులు చేసింది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (6 బ్యాటింగ్), ఇమామ్ ఉల్ హఖ్ (25 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్నైట్ స్కోరు 14/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 83.1 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (82; 10 ఫోర్లు, 2 సిక్స్లు), నిశాన్ మదుష్కా (52; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. పాక్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్, నోమన్ అలీ మూడు వికెట్ల చొప్పున, షాహీన్ అఫ్రిది, ఆగా సల్మాన్ రెండు వికెట్ల చొప్పున తీశారు.

హర్మెహర్-సంజన జోడీకి రజతం



చాంగ్వాన్ (కొరియా): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్షిప్ స్కీట్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో హర్మెహర్ సింగ్ లాలీ-సంజన సూద్ (భారత్) జోడీ రజత పతకం గెలిచింది. ఫైనల్లో హర్మెహర్-సంజన ద్వయం 38-43తో ఆండ్రియా గలర్దిని-సారా బోంగిని (ఇటలీ) జోడీ చేతిలో ఓడిపోయింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ సర్తాజ్ సింగ్ తివానా... మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో పాయల్ నాలుగో స్థానంలో నిలిచారు.

సాయి సుదర్శన్ అజేయ సెంచరీ

- పాకిస్తాన్ 'ఎ'పై ఎనిమిది వికెట్లతో భారత్ 'ఎ' ఘనవిజయం
- ఎమర్జింగ్ కప్ టోర్నీలో గ్రూప్ 'టాపర్'గా టీమిండియా


సాయి సుదర్శన్

కొలంబో: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 క్రికెట్ టోర్నీ లీగ్ దశలో భారత్ 'ఎ' జట్టు అజేయంగా నిలిచింది. పాకిస్తాన్ 'ఎ'తో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్లో భారత్ 'ఎ' ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ 'ఎ' 48 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. ఖాసిమ్ అక్రమ్ (48; 5 ఫోర్లు) టాప్ స్కోరర్గా నిలిచాడు. భారత బౌలర్లలో రాజ్వర్ధన్ హంగార్గేకర్ 42 పరుగులిచ్చి 5 వికెట్లు, మానవ్ సుథర్ 36 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత 'ఎ' జట్టు 36.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (110 బంతుల్లో 104 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్లు) పాక్ బౌలర్ల భరతంపట్టి అజేయ సెంచరీ చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాయి సుదర్శన్ తొలి వికెట్కు అభిషేక్ శర్మ (20; 4 ఫోర్లు)తో 58 పరుగులు... రెండో వికెట్కు నికిన్ జోస్ (64 బంతుల్లో 53; 7 ఫోర్లు)తో 99 పరుగులు... మూడో వికెట్కు కెప్టెన్ యశ్ ధుల్ (21 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్)తో 53 పరుగులు జోడించాడు. ఆడిన మూడు మ్యాచ్ల్లోనూ నెగ్గిన టీమిండియా ఆరు పాయింట్లతో గ్రూప్ 'బి'లో అగ్రస్థానం పొందింది. నాలుగు పాయింట్లతో పాకిస్తాన్ రెండో స్థానంలో నిలిచింది. ఈ రెండు జట్లు ఇప్పటికే సెమీఫైనల్ చేరాయి. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్లో శ్రీలంక 'ఎ'తో పాకిస్తాన్ 'ఎ'; బంగ్లాదేశ్ 'ఎ'తో భారత్ 'ఎ' తలపడతాయి. ఫైనల్ 23న జరుగుతుంది.

భారత్కు ఎదురుందా!

భారత జట్టుపై టెస్టుల్లో వెస్టిండీస్ గెలిచి 21 ఏళ్లవుతోంది. తొలి టెస్టులో చెలరేగి సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్ వయసు అప్పుడు ఐదు నెలలు! ఈ ఉదాహరణ చాలు ఇరు జట్ల మధ్య అంతరం ఎలా ఉందో చెప్పడానికి. ఆ తర్వాత భారత్, విండీస్ 24 సార్లు తలపడితే టీమిండియా 15 టెస్టులు, గెలవగా మరో '9' డ్రా అయ్యాయి. గత మ్యాచ్లో విండీస్ ఆట చూస్తే ఏ రకంగానూ భారత్కు పోటీ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఇరు జట్లు రెండో టెస్టుకు సిద్ధమయ్యాయి. తొలి మ్యాచ్తో పోలిస్తే క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానం పేస్ బౌలింగ్కు అనుకూలించే అవకాశం ఉండటం ఆతిథ్య జట్టుకు సానుకూలత.



- నేటి నుంచి వెస్టిండీస్తో రెండో టెస్టు
- సిరీస్ గెలుపే లక్ష్యంగా టీమిండియా
- తీవ్ర ఒత్తిడిలో విండీస్
- రాత్రి గం.7.30 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

100 భారత్, విండీస్ మధ్య ఇది 100వ టెస్టు. ఇప్పటి వరకు జరిగిన 99 టెస్టుల్లో విండీస్ 30 గెలిస్తే, భారత్ 23 గెలిచింది. మరో 46 మ్యాచ్లు 'డ్రా'గా ముగిశాయి.

500 కోహ్లికి మూడు ఫార్మాట్లలో కలిపి ఇది 500వ అంతర్జాతీయ మ్యాచ్. కెరీర్లో అతను మొత్తం 25,461 పరుగులు సాధించాడు.

పోర్ట్ ఆఫ్ స్పెయిన్ (ట్రినిడాడ్): ఏకపక్షంగా సాగిన తొలి టెస్టు తర్వాత భారత్, వెస్టిండీస్ తర్వాతి సమరానికి సిద్ధమయ్యాయి. భారత్ 1-0తో సిరీస్లో ముందంజగా ఉండగా... నేటి నుంచి ఇరు జట్ల మధ్య రెండో టెస్టు జరుగుతుంది. మరో విజయంతో క్లీన్స్వీప్ చేయాలని రోహిత్ సేన భావిస్తుండగా... సొంతగడ్డపై కాస్త మెరుగైన ప్రదర్శనతో పరువు కాపాడుకోవాలని విండీస్ భావిస్తోంది. ఇరు జట్ల మధ్య ఇది 100వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం.

మార్పుల్లేకుండా...

తుది జట్టు విషయంలో భారత్కు ఎలాంటి సందిగ్ధత లేదు. గెలిచిన జట్టునే కొనసాగించే క్రమంలో అదే 11 మందితో బరిలోకి దిగవచ్చు. కెరీర్ తొలి మ్యాచ్లో సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్పై మరోసారి అందరి దృష్టి నిలిచింది. అయితే ఎన్నో అంచనాలు ఉన్న శుబ్మన్ గిల్ టెస్టుల్లో ఆశించినంతగా రాణించలేకపోతున్నాడు. 17 టెస్టుల తర్వాత కూడా అతని సగటు 31.96 మాత్రమే ఉంది.

పేస్పై నమ్మకం...

అరంగేట్ర టెస్టులో అతనాజ్ ప్రదర్శన మినహా గత మ్యాచ్లో విండీస్ గురించి చెప్పుకోవడానికేమీ లేదు. పేలవ బ్యాటింగ్, నిస్సారమైన బౌలింగ్ ఆ జట్టును మరీ బలహీన ప్రత్యర్థిగా మార్చాయి. ఈ మ్యాచ్లోనైనా విండీస్ ఏమైనా పోరాడుతుందా అనేది చూడాలి. భారత్తో పోలిస్తే రోచ్, జోసెఫ్, గాబ్రియెల్ రూపంలో కాస్త అనుభవజ్ఞులైన పేసర్లు జట్టులో ఉన్నారు. పిచ్ను సరిగా వాడుకొని వీరు భారత బ్యాటర్లపై ఏమైనా ప్రభావం చూపించగలిగితే మ్యాచ్ కాస్త ఆసక్తికరంగా మారుతుంది.

తొలి రౌండ్లో ఓడిన సింధు



యోసు (కొరియా): కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో భారత స్టార్, ప్రపంచ 17వ ర్యాంకర్ పీవీ సింధు 18-21, 21-10, 13-21తో 22వ ర్యాంకర్ పాయ్ యుపో (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది. తస్నీమ్, మాళవిక, ఆకర్షి, తాన్యా, అస్మిత కూడా తొలి రౌండ్లోనే ఓడిపోయారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో కిడాంబి శ్రీకాంత్ (భారత్) 21-12, 22-24, 17-21తో కెంటో మొమోటా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. మొమోటా చేతిలో శ్రీకాంత్కిది వరుసగా 12వ ఓటమి. భారత నంబర్వన్ ప్రణయ్ 21-13, 21-17తో జూలియన్ (బెల్జియం)పై, ప్రియాన్షు 21-15, 21-19తో చోయ్ జి హూన్ (కొరియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

సిక్కి రెడ్డి జోడీ గెలుపు

మిక్స్డ్ డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్లో సిక్కిరెడ్డి-రోహన్ కపూర్ 21-17, 21-17తో అల్విన్ మోరాదా-అలీసా లియోన్ (ఫిలిప్పీన్స్)లపై గెలిచారు. సుమీత్ రెడ్డి-అశ్విని పొన్నప్ప 21-23, 21-13, 12-21తో సాంగ్ హూన్ చో-లీ జంగ్ హూన్ (కొరియా) చేతిలో ఓటమి పాలయ్యారు.

ఆస్ట్రేలియా 299/8


బ్రాడ్

మాంచెస్టర్: ఇంగ్లండ్తో జరుగుతున్న యాషెస్ సిరీస్ నాలుగో టెస్టులో తొలి రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ మొదటి ఇన్నింగ్స్లో 83 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (51), లబుషేన్ (51) అర్ధ సెంచరీలు సాధించగా, హెడ్ (48), స్టీవ్ స్మిత్ (41) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ (4/52) ప్రత్యర్థిని దెబ్బ తీయగా, బ్రాడ్ 2 వికెట్లు పడగొట్టాడు. హెడ్ను అవుట్ చేయడం ద్వారా బ్రాడ్ టెస్టుల్లో 600 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన నాలుగో బౌలర్గా నిలిచాడు. అత్యధిక వికెట్ల జాబితాలో మురళీధరన్ (800), షేన్ వార్న్ (708), అండర్సన్ (688) మాత్రమే బ్రాడ్కంటే ముందున్నారు.

సినిమా

భూమి బద్దలు!


ప్రభాస్

రోబోలాంటి సూట్, ముడి వేసిన జుట్టు, కళ్లల్లో ఫైర్తో గుద్దితే భూమి బద్దలైనట్లు 'ప్రాజెక్ట్ కె' చిత్రంలోని హీరో ప్రభాస్ ఫస్ట్ లుక్ని రిలీజ్ చేశారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో దీపికా పదుకోన్ హీరోయిన్గా నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్హాసన్, దిశా పటానీ వంటి స్టార్స్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. వైజయంతీ మూవీస్పై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలోని ప్రభాస్ ఫస్ట్ లుక్ని బుధవారం విడుదల చేశారు మేకర్స్. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా 2024 జనవరి 12న విడుదల కానుంది.

సాహసాల అర్జున్


వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గాండీవధారి అర్జున'. ఈ చిత్రంలో సాక్షీ వైద్య హీరోయిన్గా నటించారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 25న విడుదల కానుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమా టీజర్ను ఈ నెల 24న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించి, కొత్త పోస్టర్ను సోషల్ మీడియాలో షేర్ చేశారు వరుణ్ తేజ్. ఇందులో అర్జున్ అనే సెక్యూరిటీ ఆఫీసర్గా వరుణ్ తేజ్ నటించారని, ఓ విపత్తు నుంచి ప్రజలను రక్షించేందుకు అర్జున్ ఎటువంటి సాహసాలు చేశాడు? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని సమాచారం.

హిరణ్య కశ్యపగా రానా


హిరణ్య కశ్యప'లో రానా

రానా హీరోగా 'హిరణ్య కశ్యప' అనే చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'కామిక్ కాన్ – 2023' వేడుకల్లో భాగంగా రానా 'హిరణ్య కశ్యప'ను ప్రకటించారు. దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమాకు కథ అందిస్తున్నారు. అలాగే ఈ సినిమాకు రానా ఓ నిర్మాతగా కూడా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. అమర్ చిత్ర కథల ఆధారంగా ఈ చిత్రం రూపొందనుంది. ఇక గతంలో రానాతో 'హిరణ్య కశ్యప' తెరకెక్కిస్తానని గుణశేఖర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరి.. ఆయన దర్శకత్వం లోనే ఈ 'హిరణ్య కశ్యప' ఉంటుందా? అనేది తెలియాల్సి ఉంది.

ఏలియన్ని కాను!


తాప్సీ

ఏలియన్స్తో సావాసం చేస్తున్నారు హీరోయిన్ తాప్సీ. ఎందుకంటే ఏలియన్స్తో కలిసి తాప్సీ ఓ మిషన్లో భాగమయ్యారు. ఈ మిషన్ తాలూకు వివరాలు తెలియడానికి కాస్త టైమ్ పడుతుంది. ఇటీవల హిందీ ప్రాజెక్ట్స్తో బిజీగా ఉంటున్న తాప్సీ ఓ తమిళ సినిమాకు సైన్ చేశారు. ''తమిళంలో నేను చేస్తున్న తాజా సినిమా 'ఏలియన్'. కాన్సెప్ట్ కొత్తగా ఉంటుంది. కానీ ఈ చిత్రంలో నేను ఏలియన్గా నటించడం లేదు. తమిళంలో నేను చేసిన 'గేమ్ ఓవర్' (2019) మూవీ నచ్చినవారికి ఈ సినిమా మరింత బాగా నచ్చుతుందనే నమ్మకం నాకుంది. ఈ సినిమా ప్రయాణం నాకు ఓ కొత్త అనుభూతిని ఇస్తోంది'' అని తాప్సీ పేర్కొన్నారు. 2021లో వచ్చిన 'అన్నాబెల్లె సేతుపతి' తర్వాత తాప్సీ అంగీకరించిన తమిళ చిత్రం ఇదే. ఇక హిందీలో 'ఓ లడ్కీ హై కహా', 'ఫిర్ ఆయీ హసీన్ దిల్రుబా', 'డంకీ' చిత్రాలు చేస్తున్నారు తాప్సీ.

రాముడిగా రణ్బీర్.. రావణుడిగా యశ్?



రణ్బీర్ కపూర్


ఆలియా భట్


యశ్

భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా ఇప్పటికే పలు చిత్రాలు వచ్చాయి.. ఇంకొన్ని వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రామాయణం ఆధారంగా అల్లు అరవింద్, మధు మంతెన, నమిత్ మల్హోత్రా ఓ సినిమాను నిర్మించనున్నట్లుగా ప్రకటన వచ్చి దాదాపు మూడేళ్లు ముగిసింది. కానీ ఈ సినిమా ఇంకా సెట్స్పైకి వెళ్లలేదు. దాంతో ఈ చిత్రం నిలిచి పోయిందా? అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే అలాంటిదేమీ లేదని, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని నిర్మాతలు పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఈ ఏడాది చివర్లో రెగ్యులర్ షూటింగ్ను ఆరంభించాలని నిర్మాతలు అనుకుంటున్నారన్నది తాజా సమాచారం. ఈ చిత్ర దర్శకుడు నితీష్ తివారి ఈ సినిమా పనులను మరింత వేగవంతం చేశారని బాలీవుడ్లో వినిపిస్తోంది. ప్రస్తుతం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట. రాముడు, సీత, లక్ష్మణుడు, రావణుడు, హనుమంతుడు వంటి ప్రధాన పాత్రలకు ఆర్టిస్టులను ఎంపిక చేసి, లుక్ టెస్ట్ను నిర్వహించేందుకు నితీష్ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. రాముడిగా రణ్బీర్ కపూర్, సీతగా ఆలియా భట్, రావణుడి పాత్రలో యశ్లు నటించనున్నారని, ముందు వీరి లుక్ టెస్ట్ జరుగుతుందని టాక్. మరి.. ఈ 'రామాయణం'లో రియల్ లైఫ్ జంట ఆలియా, రణ్బీర్ సీతారాములుగా కనిపిస్తారా? 'కేజీఎఫ్'లో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో విజృంభించిన యశ్ ఈ చిత్రంలో రావణుడిగా బీభత్సం సృష్టిస్తారా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

మనసును కదిలించే కథ – సాయికుమార్


శ్రీనివాస్ సాయి, సాయికుమార్, ఆదిత్య ఓం

''నాన్న, అమ్మ ఇచ్చిన స్వరం, సంస్కారంతో నేనీ స్థాయిలో ఉన్నాను. 'నాతో నేను'లో మంచి పాత్ర చేశాను. ప్రేక్షకుల మనసును కదిలించే కథ ఇది'' అని నటుడు సాయి కుమార్ అన్నారు. ఆదిత్యా ఓం, సాయి కుమార్, ఐశ్వర్య, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలీ రాజ్పుత్ కీలక పాత్రల్లో శాంతి కుమార్ తూర్లపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'నాతో నేను'. ప్రశాంత్ టంగుటూరి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో శాంతికుమార్ తూర్లపాటి మాట్లాడుతూ– ''బలమైన నా టీమ్ వల్లే ఈ సినిమాను విడుదల వరకూ తీసుకొచ్చాం'' అన్నారు. ''కరోనా వల్ల మా సినిమా ఆలస్యం అయింది. కానీ మంచి సమయంలో విడుదల చేస్తున్నాం'' అని ప్రశాంత్ టంగుటూరి అన్నారు. నటుడు శ్రీనివాస్ సాయి మాట్లాడారు.

చెప్పరా శివా...


కార్తికేయ

కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. క్లాక్స్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నేహా శెట్టి హీరోయిన్. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 25న రిలీజ్ కానుంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'భోగమంత యిడువనే యిడువవు వింతగుంది రా, నువెవడివి సొల్లుడా శివా (చెప్పరా శివా)...' అంటూ సాగే రెండో పాటను రిలీజ్ చేశారు. కృష్ణ చైతన్య సాహిత్యం సమకూర్చిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి, రోల్ రైడ, పృథ్వీ చంద్ర పాడారు.

కొత్త ప్రపంచంలోకి వెళ్తారు – అశ్విన్



అశ్విన్ బాబు, నందితా శ్వేత జంటగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ 'హిడింబ'. ఈ సినిమా నేడు (గురువారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్లో జరిగిన విలేకర్ల సమావేశంలో అశ్విన్బాబు మాట్లాడుతూ– '''హిడింబ' మంచి సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ఫిల్మ్. ఈ సినిమా కాన్సెప్ట్ ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి, సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ఇందులో నా లుక్ డిఫరెంట్గా ఉంటుంది. నెక్ట్స్ మెడికల్ మాఫియా నేపథ్యంలో ఓ సినిమా, ఓ స్పోర్ట్స్ ఫిల్మ్ చేయబోతున్నాను'' అని అన్నారు.

రిస్క్ చేశా – సాయి రాజేష్



'''బేబి'కి నా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ అవుతారనే నమ్మకం ఉండేది. ఈ సినిమా ఫ్లాప్ అవుతుందేమో? అనే భయం కూడా ఉండేది. ఫ్లాప్ అయినా సంగీతం, కెమెరా, నటీనటులు.. ఇలా అందరికీ పేరు వస్తుంది.. కానీ నా కెరీర్ నాశనం అవుతుందని తెలిసినా రిస్క్ చేసి 'బేబి' చేశాను. ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని డైరెక్టర్ సాయి రాజేష్ అన్నారు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ లీడ్ రోల్స్లో ఎస్కేఎన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. '''బేబీ'కి ఆనంద్ కంటే ముందు ముగ్గురు హీరోలను అనుకున్నాం. ఓ హీరో 'హృదయ కాలేయం' డైరెక్టరా? అయితే కథ వినను అన్నాడు. ఆ మాటలు బాధపెట్టాయి. నన్ను నేను నిరూపించుకోవాలని 'బేబి' తీసి, హిట్ కొట్టాను'' అన్నారు.

ఆగస్టులో పేకమేడలు


వినోద్ కిషన్

వినోద్ కిషన్, అనూష క్రిష్ణ జంటగా నీలగిరి మామిళ్ల తెరకెక్కించిన చిత్రం 'పేకమేడలు'. క్రేజీ యాంట్స్పై రాకేష్ వర్రే నిర్మించిన ఈ సినిమా ఆగస్టులో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ని విడుదల చేశారు. ''ఒక యూనిక్ స్టోరీలైన్తో పూర్తిస్థాయి ఎంటర్టైనర్గా రూపొందిన చిత్రం 'పేకమేడలు''' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: వరుణ్ బోర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కేతన్ కుమార్, లైన్ ప్రొడ్యూసర్: అనూష బోర, కెమెరా: హరిచరణ్ .కె, సంగీతం: స్మరణ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
302	84
67,097	19,833

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	14,340	▼	11
డోజోన్స్	35,097	▲	145
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,588	▲	135
డాక్స్	16,109	▲	17
షాంఘై	3,199	▲	1
నికాయ్	32,896	▲	402

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,756	▲	316
బంగారం (22 క్యారట్)	59,517	▲	315
వెండి (కిలో)	75,499	▲	318

బ్రిటన్‌లో టాటా గిగాఫ్యాక్టరీ!

- ఈవీ బ్యాటరీల ప్లాంటు ఏర్పాటు ప్రణాళిక
- రూ. 42,500 కోట్ల భారీ పెట్టుబడి
- 2026 నుంచి ఉత్పత్తి ప్రారంభం..

ముంబై/లండన్: పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్ తాజాగా బ్రిటన్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) బ్యాటరీల తయారీ కోసం గిగాఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ఏకంగా 4 బిలియన్ పౌండ్లు (సుమారు రూ. 42,500 కోట్లు) వెచ్చించనున్నట్లు తెలిపింది. తమ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్‌ఆర్) వాహనాలతో పాటు ఇతరత్రా సంస్థల కోసం కూడా ఇందులో బ్యాటరీలను తయారు చేయనున్నట్లు పేర్కొంది. 2026 నుంచి ఈ గిగాఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. సాధారణంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలో బ్యాటరీల వాటా దాదాపు సగం పైగా ఉంటుంది.

వేల కొద్దీ ఉద్యోగాలకు ఊతం..

గిగాఫ్యాక్టరీపై పెట్టుబడులతో స్థానికంగా 4,000 పైచిలుకు ప్రత్యక్ష ఉద్యోగాలు, సరఫరా వ్యవస్థలో పరోక్షంగా వేల మందికి ఉపాధి లభించగలదని బ్రిటన్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 2030 నాటికి తమకు అవసరమయ్యే బ్యాటరీల్లో ఈ ప్లాంటు దాదాపు సగభాగం ఉత్పత్తి చేయగలదని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి మళ్లాలన్న తమ లక్ష్యం మరింత వేగవంతంగా సాకారం కాగలదని వివరించారు.

భారీగా సబ్సిడీలు..

గిగాఫ్యాక్టరీ కోసం బ్రిడ్జ్‌వాటర్ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు జేఎల్‌ఆర్ మాతృ సంస్థ టాటా సన్స్ తెలిపింది. 40గిగావాట్‌అవర్స్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యంతో ఇది యూరప్‌లోని భారీ గిగాఫ్యాక్టరీల్లో ఒకటిగాను, భారత్‌కు వెలుపల టాటా గ్రూప్‌నకు తొలి భారీ గిగాఫ్యాక్టరీగా నిలవనుంది. 1980ల్లో నిస్సాన్ రాక తర్వాత బ్రిటన్ ఆటోమోటివ్ రంగంలో ఇది అత్యంత భారీ పెట్టుబడి కానుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం టాటా గ్రూప్‌నకు ప్రభుత్వం నుంచి వందల కొద్దీ మిలియన్ పౌండ్ల మేర ప్లాంటుకు సబ్సిడీల హామీ లభించి ఉంటుందని పేర్కొన్నాయి. విద్యుత్, గ్రాంటు, సైటుకు రహదారిని మెరుగుపర్చటం తదితర రూపాల్లో 500 మిలియన్ పౌండ్ల మేర సబ్సిడీలు అందించాలని ప్రభుత్వాన్ని టాటా గ్రూప్ కోరినట్లు సమాచారం. అయితే, ఇటు టాటా గ్రూప్, అటు బ్రిటన్ ప్రభుత్వం దీనిపై వివరణ ఇవ్వలేదు. పారదర్శక విధానాల్లో భాగంగా వీటిని తర్వాత ప్రచురించనున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం పేర్కొంది. బ్రిటన్‌లో ప్రస్తుతం ఒక్క బ్యాటరీల తయారీ ప్లాంటు ఉంది. కొత్తగా మరో ఫ్యాక్టరీ ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. మరోవైపు యూరోపియన్ యూనియన్‌లో 35 పైచిలుకు ప్లాంట్లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని ఇప్పటికే పనిచేస్తుండగా, కొన్ని నిర్మాణంలోనూ, కొన్ని ప్రతిపాదనల దశల్లోనూ ఉన్నాయి.



టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్

అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు..

'బిలియన్ల కొద్దీ పౌండ్ పెట్టుబడులు, అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేసే ప్లాంటు.. ఆటోమోటివ్ రంగం ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు వేగవంతంగా మళ్లేందుకు తోడ్పడగలదు. ఇప్పటికే బ్రిటన్‌లో వివిధ రంగాల్లో మా కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. బ్రిటన్‌లో పెట్టుబడులకు కట్టుబడి ఉన్నామని తెలిపేందుకు తాజా ఇన్వెస్ట్‌మెంట్ నిదర్శనం' అని టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ తెలిపారు. 'భారత్‌కు వెలుపల తమ తొలి భారీ ఫ్యాక్టరీని ఇక్కడ నెలకొల్పాలని టాటా గ్రూప్ నిర్ణయం తీసుకోవడమనేది బ్రిటన్ కార్ల తయారీ పరిశ్రమ, నిపుణులపై వారికి ఉన్న నమ్మకానికి నిదర్శనం. మా ఆటోమోటివ్ రంగంలో అత్యంత భారీ పెట్టుబడుల్లో ఇది కూడా ఒకటిగా నిలవనుంది'

– బ్రిటన్ ప్రధాని రిషి సునాక్

ఎంసీఏ21 పోర్టల్‌పై ఒక్కరికి ఒక్కటే ఐడీ



న్యూఢిల్లీ: ఏదైనా కంపెనీ సెక్రటరీ, చార్టర్డ్ అకౌంటెంట్ లేదా కాస్ట్ అకౌంటెంట్ ఎంసీఏ21 పోర్టల్‌పై ఒక్కటే ఐడీ కలిగి ఉండాలని కార్పొరేట్ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. ఒకరికి ఒకటికి మించిన ఐడీలు ఉంటే వాటిని డీయాక్టివేట్ చేస్తున్నట్లు ప్రకటించింది. కంపెనీలు, ఎల్‌ఎల్‌పీ చట్టాల కింద చట్టబద్ధమైన పత్రాలను ఎంసీఏ21 పోర్టల్‌పైనే దాఖలు చేస్తుంటారు. ఒకటికి మించి ఐడీలు కలిగిన వృత్తి నిపుణులు చట్టబద్ధమైన సంస్థ నుంచి ఆమోదం పొందాలని, ఒక యూజర్‌కు ఒక్కటే ఐడీ ఉండాలంటూ కార్పొరేట్ శాఖ సర్క్యులర్ జారీ చేసింది.

భారత్‌బెంజ్, రిలయన్స్ జట్టు

హైడ్రోజన్ ఇంధన బస్సు ఆవిష్కరణ



ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్‌బెంజ్ కలిసి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడిచే తొలి దేశీ ఇంటర్‌సిటీ లగ్జరీ కాన్సెప్ట్ బస్సును ఆవిష్కరించాయి. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ వినియోగ లాభదాయకతను అధ్యయనం చేసేందుకు ఇది ఉపయోగపడనుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశీయంగా తయారు చేసిన హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీని తగు విధంగా మార్పులు, చేర్పులు చేసిన భారత్‌బెంజ్ బస్సులో ఉపయోగిస్తారు. ఒకసారి హైడ్రోజన్‌ను నింపిన తర్వాత ఈ ఇంటర్‌సిటీ బస్సు 400 కి.మీ. వరకు ప్రయాణించగలదని రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈవో (న్యూ మొబిలిటీ విభాగం) నితిన్ సేఠ్ తెలిపారు. వచ్చే 12 నెలల్లో ఈ బస్సుతో విస్తృతంగా అధ్యయనం చేయనున్నట్లు వివరించారు.

అయిదో రోజూ అన్‌స్టాపబుల్'బుల్'

- 67 వేల స్థాయిపైకి సెన్సెక్స్
- 19,800 ఎగువకు నిఫ్టీ
- ఐటీ షేర్లకు మాత్రమే నష్టాలు

ముంబై: స్టాక్ మార్కెట్ సరికొత్త రికార్డులను సృష్టిస్తూ పరుగులు పెడుతోంది. ప్రోత్సాహకర కార్పొరేట్ క్యూ1 ఆదాయాలు, మెరుగైన స్థూల ఆర్థిక డేటా దన్నుతో స్టాక్ సూచీలు అయిదో రోజూ ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ షేర్లు రాణించడమూ కలిసొచ్చాయి. ఉదయం సెన్సెక్స్ 110 పాయింట్ల లాభంతో 66,905 వద్ద, నిఫ్టీ 54 పాయింట్లు పెరిగి 19,803 వద్ద మొదలయ్యాయి. తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో సూచీలు కొంత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభంతో ఒక్కసారిగా సెంటిమెంట్ మారింది. ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బ్యాంకింగ్, ఆర్థిక, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు భారీగా డిమాండ్ నెలకొంది. ఫలితంగా ఒక దశలో సెన్సెక్స్ 376 పాయింట్లు పెరిగి 67,171 వద్ద, నిఫ్టీ 102 పాయింట్లు బలపడి 19,852 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేస్తాయి. చివరికి సెన్సెక్స్ 302 పాయింట్ల లాభంతో 67,097 వద్ద ముగిసింది. నిఫ్టీ మార్కెట్ ముగిసేసరికి 84 పాయింట్లు బలపడి 19,833 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లూ రాణించాయి. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,165 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,135 షేర్లు అమ్మేశారు. డాలర్ రికవరీ, క్రూడాయిల్ ధరలు బలపడటంతో రూపాయి విలువ నాలుగు పైసలు నష్టపోయి 82.08 స్థాయి స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- రికార్డుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరుకుంది. బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.304.53 లక్షల కోట్లకు చేరింది.
- ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ షేరు మూడో రోజూ రాణించింది. ఇంట్రాడేలో 1.15% పెరిగి రూ.2,855 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి 0.62 శాతం పెరిగి రూ.2,840 వద్ద స్థిరపడింది. గడిచిన 3 రోజుల్లో ఈ షేరు 3.69% లాభపడింది.
- తొలి త్రైమాసికంలో మొండి రుణాలు తగ్గడం పాటు వడ్డీ ఆదాయం పుంజుకోవడంతో ఇండస్‌ఇండ్ షేరును కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ట్రేడింగ్‌లో నాలుగుశాతం ర్యాలీ చేసి రూ.1,443 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి రెండు శాతం పెరిగి రూ.1,419 వద్ద ముగిసింది.

నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఐపీవో సక్సెస్

90 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్

హైఎండ్ కంప్యూటింగ్ సొల్యూషన్స్ అందించే నెట్‌వెబ్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ చివరి రోజు బుధవారానికల్లా 90 రెట్లుపైగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ప్రధానంగా అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 229 రెట్లు బిడ్స్ దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 82 రెట్లు, రిటైలర్ల నుంచి 19 రెట్లు అధికంగా దరఖాస్తులు లభించాయి. వెరసి కంపెనీ 88.58 లక్షల షేర్లను ఆఫర్ చేయగా.. 80 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ వెల్లువెత్తాయి.

స్థానిక వినియోగమే భారత్‌కు బలం

ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగమనం చూస్తున్న తరుణంలో, దేశీ వినియోగమే భారత్ ఆర్థిక వ్యవస్థకు సహజ ప్రేరణగా నిలుస్తోందని ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా అభిప్రాయపడ్డారు. భారత్ జీడీపీ అధిక శాతం దేశీయ డిమాండ్‌పైనే ఆధారపడి ఉన్నట్టు చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో అజయ్ బంగా బుధవారం సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జీ20కి సంబంధించిన అంశాలు, ప్రపంచబ్యాంక్, భారత్ మధ్య సహకారంపై ఆర్థిక మంత్రితో చర్చించినట్టు చెప్పారు. ''జీ20లో ఏం చేశామన్నది, అలాగే సమావేశం ఎలా కొనసాగిందన్నది మాట్లాడుకున్నాం. జీ20లో భాగంగా ప్రపంచబ్యాంక్, భారత్ ఇంకా ఏం చేయగలవన్నదీ చర్చించాం. ప్రపంచబ్యాంక్‌కు పోర్ట్‌ఫోలియో పరంగా భారత్ అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. ఈ మార్కెట్‌పై ఎంతో ఆసక్తి నెలకొంది''అని బంగా వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పనితీరుపై మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఆరంభంలో మరింత క్షీణించేందుకు రిస్కులు ఉన్నట్టు చెప్పారు. ''భారత్ జీడీపీలో అధిక భాగం దేశీయ వినియోగం నుంచే సమకూరుతోంది. కనుక ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరికొన్ని నెలల పాటు నిదానించినా, దేశీ వినియోగంతో భారత్ బలంగా నిలబడుతుంది''అని బంగా పేర్కొన్నారు. జీ20 సమావేశంలో పాల్గొనేందుకు గాను భారత సంతతికి చెందిన అజయ్ బంగా ఇక్కడకు విచ్చేశారు. గత నెలలోనే ఆయన ప్రపంచబ్యాంక్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. అనంతరం భారత్ పర్యటనకు తొలిసారి విచ్చేశారు. విజ్ఞానం, టెక్నాలజీ అంతరాలను తగ్గించడమనేది భవిష్యత్ ఆర్థిక వృద్ధికి కీలకమని ఆర్థిక మంత్రి సీతారామన్ అన్నట్టు బంగా తెలిపారు.



టాటా కమ్యూనికేషన్స్ లాభం వీక్

క్యూ1లో రూ. 382 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కంపెనీ టాటా కమ్యూనికేషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 382 కోట్లకు పరిమితమైంది. అధిక వడ్డీ వ్యయాలు, తగ్గిన పన్ను లాభాలు ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం 11 శాతం ఎగసి రూ. 4,711 కోట్లకు చేరింది. డేటా బిజినెస్ నుంచి 17 శాతం అధికంగా రూ. 3,912 కోట్ల ఆదాయం లభించింది. అయితే డేటా బిజినెస్ నిర్వహణ లాభం(ఇబిటా) 4 శాతం తక్కువగా రూ. 929 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో టాటా కమ్యూనికేషన్స్ షేరు 1 శాతం బలపడి రూ. 1,618 వద్ద ముగిసింది.

ఆర్టీసీ ఉద్యోగులకు గ్రీవెన్స్ డే

సాక్షి, అమరావతి: ప్రతి నెల మూడో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దినంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు, అన్ని ప్రభుత్వ విభాగాల అధిపతులు ఆ రోజున గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తారు. ఆర్టీసీ ఉద్యోగులు నివేదించే సమస్యలను పరిశీలించి, వారిచ్చే అర్జీలకు ప్రత్యేక నంబర్ కేటాయించి నిర్ణీత వ్యవధిలోగా సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారని ఆర్టీసీ బుధవారం సర్క్యులర్‌లో తెలిపింది. దీనిపై నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

సమాచారాన్ని సరైన మార్గంలో వినియోగించుకోవాలి

- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు క్రిష్ గోపాలకృష్ణ



'ఐడియా ఫ్యాక్టరీ'ని ప్రారంభిస్తున్న క్రిష్ గోపాలకృష్ణ

చెన్నై: ప్రతి వ్యక్తి తన జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ప్రస్తుతం ఇంటర్నెట్‌లో అపారమైన సమాచారం అందుబాటులో ఉందని, దాన్ని సరైన మార్గంలో వినియోగించుకోవాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు క్రిష్ గోపాలకృష్ణ అన్నారు. చెన్నైలోని రాజ్యలక్ష్మీ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటుచేసిన 'ఏఐసీటీఈ ఐడియా ఫ్యాక్టరీ'ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా జీవనాన్ని సులభతరం చేసే ఆవిష్కరణల కోసం జ్ఞానాన్ని పెంపొందించుకోవడం అవశ్యమన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ఆలోచనలతో ముందుకు వస్తే ఇక్కడ వాటిని తదుపరి స్థాయికి తీసుకువెళ్తారని చెప్పారు. ఆర్‌ఈసీ ఐడియా ఫ్యాక్టరీ అనేది ఏఐసీటీఈ ఐడియాల్యాబ్ పథకం కింద ఏర్పాటుచేయడం జరిగిందని, విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచి నూతన పారిశ్రామికవేత్తలను వెలికితీయడం దీని ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ ఐడియా ల్యాబ్ యువత సృజనాత్మక ఆలోచనలకు ఒక వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, పారిశ్రామిక వేత్తలు ఇక్కడ సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, మ్యాథమెటిక్స్ తదితర అంశాల్లో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. రాజ్యలక్ష్మీ సంస్థల చైర్‌పర్సన్ డా. తంగం మేఘనాథన్ మాట్లాడుతూ వినూత్న ఆలోచనలకు ఇక్కడ నిరంతరం స్వాగతం పలుకుతారని చెప్పారు.

ఆక్వా రంగం అభ్యున్నతికి ప్రభుత్వ కృషి భేష్

ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తింపు హర్షణీయం

- త్వరలో భీమవరంలో రాష్ట్రస్థాయి ఆక్వా రైతుల సదస్సు
- ఆక్వా రైతు సంఘాల రాష్ట్రస్థాయి సమావేశంలో రైతులు



ఆక్వా రైతుల సమావేశంలో మాట్లాడుతున్న అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

సాక్షి, అమరావతి: ఆక్వా రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరిగా గతంలో ఏ ప్రభుత్వం అండగా నిలబడలేదని ఆక్వా రైతు సంఘాల రాష్ట్రస్థాయి సమావేశం ప్రశంసించింది. నాన్ ఆక్వా జోన్ పరిధిలో ఉన్న వారిని ఆక్వా జోన్‌లోకి తీసుకురావడంతో ఆక్వా సబ్సిడీ ఆక్వా రైతులకు అందుతోందని వెల్లడించింది. గతంలో ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఫీడ్ మిల్లులు, హేచరీలతో రైతులు ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం ఉండేది కాదనీ.. ఇప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన అప్సడా చట్టం పుణ్యమా అని రైతులకు మేలు జరుగుతోందని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ఆక్వా రైతు సంఘాల ప్రతినిధుల రాష్ట్రస్థాయి సమావేశం బుధవారం విజయవాడలో అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ అధ్యక్షతన జరిగింది.

రైతులు ఏం అడిగారంటే..

సమావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ.. ట్రేడర్స్, ఏజెంట్లను కూడా అప్సడా పరిధిలోకి తీసుకొచ్చి, వారికి కూడా లైసెన్సులు జారీ చేయాలని కోరారు. రొయ్యల కొనుగోలుదారులు విధిగా సరైన బిల్లులు ఇచ్చేలా తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఆ బాధ్యతలను ఆర్బీకేల్లో ఉండే మత్స్య సహాయకులకు అప్పగించాలని కోరారు. 2024 నుంచి ఏటా మార్చి 15 నుంచి మే 15 వరకు 60 రోజుల పాటు రైతులందరూ సాగు సన్నాహాలు చేసుకునేందుకు వీలుగా డిసెంబర్ 15 నుంచి సీడ్ అమ్మకాలను హేచరీలు నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాగు సన్నాహాలు కోసం కొద్దికాలం పాటు పనులు నిలిపి వేయడం వల్ల రైతులందరికీ మేలు జరుగుతుందని, ముఖ్యంగా పంటను వైరస్‌ల బారిన పడకుండా, బ్యాక్టీరియాల నుంచి తప్పించుకునేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. విద్యుత్ సబ్సిడీకి అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల లబ్ధి పొందని వారికి సాధ్యమైనంత త్వరగా మేలు చేయాలని కోరారు. రొయ్యల స్థానిక వినియోగం పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకంతో పాటు జైళ్లు, మిలటరీ క్యాంటీన్లలో రొయ్య వంటకాలను చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎంను సత్కరించాలని తీర్మానం

రైతు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆక్వా రైతుల తరఫున సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్తున్న అప్సడా వైస్ చైర్మన్ రఘురామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో భీమవరంలో రాష్ట్రస్థాయి ఆక్వా రైతుల సమ్మేళనం నిర్వహించి.. ఆక్వా రంగానికి అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సత్కరించాలని సమావేశంలో నిర్ణయించారు. జాతీయ రొయ్యరైతుల సమాఖ్య అధ్యక్షుడు ఐపీఆర్ మోహన్‌రాజు, జిల్లాల రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యన్నా.. నోరు అదుపులో పెట్టుకో..

- సీఎంను తిడితే ప్రజలు రోడ్డుమీద ఈడ్చి తంతారు
- వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ హెచ్చరిక

పాలకొల్లు అర్బన్: మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు నోరు అదుపులో పెట్టుకోకపోతే చెంప చెళ్లుమనిపిస్తామని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాలకొల్లులో జరిగిన బస్సుయాత్ర బహిరంగసభలో టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి వాడిన పదజాలం విని ఆదే సభలో ఉన్న మాజీ మంత్రి పీతల సుజాత, ఇతర మహిళలు తల దించుకుని సిగ్గుపడ్డారని చెప్పారు. రాజ్యాంగపరమైన పదవిలో ఉన్న సీఎం జగన్‌ను పత్రికలో రాయడానికి వీలులేని పదజాలంతో బూతులు తిడితే అయ్యన్నను ప్రజలు రోడ్డుమీద ఈడ్చి తన్నడం ఖాయమని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీలో ఉన్నామని మరచిపోయి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ప్రజలను మభ్యపెడుతూ బూటకపు హామీలిచ్చి మరోసారి మోసం చేయడానికి తెలుగుదేశం నాయకులు బస్సుయాత్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ చింతలపూడి పరిశీలకుడు గుణ్ణం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతిని అన్వేషించాలి

- సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి



సాక్షి, అమరావతి: పునరుత్పాదక ఇంధన రంగంలో సాంకేతిక పురోగతిని అన్వేషించాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. సుజిలాన్ ఎనర్జీ సహకారంతో సాంకేతిక విద్యా శాఖ బుధవారం పవన శక్తి ఆవిష్కరణపై రాష్ట్ర స్థాయి వెబినార్ నిర్వహించింది. ఆమె మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో 4800 మెగా వాట్ల సామర్థ్యంతో రాష్ట్రంలో పవన విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన పెట్టుబడులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన రంగంలో నైపుణ్యం కలిగిన మానవవనరుల పాత్ర కీలకంగా మారుతోందని చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులు ఎప్పటికప్పుడు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు.

'నిమ్మల' నాటకాలు!



బ్లాచింగ్ ప్లాంట్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం పనులు



ఎమ్మెల్యే నిమ్మల పనులు జరగడంలేదని సెల్ఫీ తీసుకున్న కళాశాల ప్లే గ్రౌండ్ ప్రాంతం

పాలకొల్లు పొలాల్లో టీడీపీ సెల్ఫీ షో

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఒకవైపు పనులు జరగకుండా అడ్డుకోవడం.. మరోవైపు ఆగిపోయాయంటూ యాగీ చేయడం.. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తీరు ఇదీ.. సొంత నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ ఏర్పాటవుతుంటే స్వాగతించాల్సిందిపోయి అడ్డదారుల్లో అడ్డుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకొల్లు మండలం దగ్గులూరులో 58.33 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్ల వ్యయంతో నూతన మెడికల్ కళాశాలకు సీఎం వైఎస్ జగన్ గతేడాది శంకుస్థాపన చేశారు. అనంతరం కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. తొలుత రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి ల్యాండ్ ఫిల్లింగ్ పనులు చేస్తున్నారు. 27 మీటర్ల లోతులో ఆరు బోర్లు తవ్వారు. 1.7 మీటర్ల ఎత్తు వరకూ ఫ్లోర్ కాంక్రీట్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. పనులు దక్కించుకున్న మెగా సంస్థను యలమంచిలి మండలం వేల్పూరులంకలో ఇసుక తవ్వకానికి మైనింగ్ శాఖ అనుమతించింది. ఎమ్మెల్యే నిమ్మల ఈ పనులను అడ్డుకునేందుకు అనుచరులతో పర్యావరణానికి హాని కలుగుతోందంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించారు. దీంతో ఐదు నెలల పాటు పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని పనులను కొనసాగిస్తున్నారు.

సెల్ఫీ షో

పాలకొల్లులో సోమవారం టీడీపీ బస్సు యాత్ర సందర్భంగా పార్టీ నాయకులతో పొలాల్లో సెల్ఫీ దిగిన నిమ్మల రామానాయుడు ఇదే మెడికల్ కాలేజీ.. అసలు పనులే జరగడం లేదని బురద చల్లేందుకు ప్రయత్నించారు. నిజానికి నిమ్మల బృందం ఫోటోలు దిగిన ప్రాంతం ప్లే గ్రౌండ్ కావడం గమనార్హం. అది మెడికల్ కళాశాల భవన నిర్మాణం పూర్తయ్యాక మైదానంగా అభివృద్ధి చేసే ప్రదేశం.

పరారీలో రామాంజనేయ చౌదరి

- గిరిజన యువకుడిపై దాడి చేసి మూత్రం పోసిన కేసులో ప్రధాన నిందితుడు చౌదరి
- చౌదరి, బాధితుడు పలు చోరీ కేసుల్లో నిందితులు
- ఒంగోలులోనే ఓ విపక్ష నేత రక్షణలో చౌదరి!
- మైనర్ బాలికతో ప్రేమ వ్యవహారంలో యువకుడిపై దాడి
- నెత్తురోడుతున్న గిరిజన యువకుడిపై మూత్రం పోసిన చౌదరి
- ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే వీడియో లీక్!

ఒంగోలు టౌన్: గిరిజన యువకుడిని చితక బాది, అతడి మీద మూత్రం పోస్తూ సెల్‌ఫోన్లో ఆ దృశ్యాలను చిత్రీకరించిన కేసులో ప్రధాన నిందితుడు మన్నే రామాంజనేయ చౌదరి పరారయ్యాడు. మిగతా నిందితుల్లో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. జూన్ 19వ తేదీన ఈ సంఘటన జరగ్గా, వారు తీసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో పెట్టారు. రామాంజనేయ చౌదరి నెల రోజులుగా పోలీసులకు చిక్కకుండా ఒంగోలు పరిసరాల్లోనే ఒక ప్రతిపక్ష నాయకుడి రక్షణలో ఉన్నట్లు సమాచారం. ఆ నాయకుడి సలహా మేరకు ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసే కుట్రలో భాగంగా వీడియోను లీక్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.



పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. ఒంగోలుకు చెందిన ప్రధాన నిందితుడు మన్నే రామాంజనేయ చౌదరి, బాధితుడైన మోటా నవీన్‌పై పలు కేసులున్నాయి. ఇద్దరూ దొంగతనాలు, రాబరీ కేసుల్లో జైలుకు కూడా వెళ్లారు. డబ్బు పంపకాల్లో వీరి మధ్య విభేదాలున్నాయి. నవీన్ కొద్దికాలంగా ఓ మైనర్ బాలికను వేధించడం మొదలెట్టాడు. ఆ బాలికను ఓసారి కిడ్నాప్ చేశాడు. దీంతో నవీన్‌పై పోక్సో కేసు నమోదైంది. ఆ బాలికను అభిలాష్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేయాలని కుటుంబ సభ్యులు భావించారు. అయితే, నవీన్ ఆ బాలికను వేధిస్తుండడంతో ఆమె సోదరుడు ఈ విషయాన్ని అభిలాష్‌కు చెప్పాడు. నవీన్‌కు గుణపాఠం చెప్పాలని రామాంజనేయ చౌదరితో కలిసి వారు పథకం రచించారు. గత నెల 19న ప్రభు, నరేంద్ర ఉరఫ్ టిల్లుతో కలిసి రామాంజనేయ చౌదరి నవీన్ ఇంటికి వెళ్లాడు. అందరూ అక్కడ మద్యం తాగారు. అనంతరం బాలిక విషయంలో రాజీ చేసుకుందామని చెప్పి నవీన్, అతడి సోదరుడు రాజాను తీసుకెళ్లారు. ముక్తినూతలపాడు సమీపంలో కల్వరి టెంపుల్ వద్దకు రాగానే అక్కడ కాపు కాసి ఉన్న అభిలాష్, బాలిక సోదరుడు, మరో నలుగురు ఇనుప రాడ్లు, కర్రలతో నవీన్, రాజాను చితక్కొట్టారు. నెత్తురోడుతున్న అతనిపై రామాంజనేయ చౌదరి మూత్రం పోశాడు. ఈ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. వారి నుంచి తప్పించుకున్న రాజా తల్లికి సమాచారమిచ్చి, సమీపంలోని పొగాకు కూలీల సహాయంతో 108లో నవీన్‌ను జీజీహెచ్‌కు తరలించారు.

ఆరుగురు నిందితులను అరెస్టు చేశాం: ఎస్పీ

ఈ కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ మలికా గర్గ్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మర్లపాడుకు చెందిన రాయపాటి అభిలాష్, ఒంగోలు గోపాల్ నగర్‌కు చెందిన అప్పనబోయిన జయశంకర్, ఇస్లాంపేటకు చెందిన షేక్ సాదిక్ గఫూర్‌తో పాటు బాలిక సోదరుడు, అతని స్నేహితులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రామాంజనేయ చౌదరి, చాపల ప్రభు, ఏకాంబరం నరేంద్ర పరారీలో ఉన్నారని చెప్పారు.

క్లుప్తంగా...

మాతృభాషపై పిల్లలకు పట్టు లేకుండా పోతోంది

- హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: మాతృభాషపై పట్టులేని వారు ఇతర భాషల్లో నైపుణ్యం సాధించలేరని, ప్రస్తుత సమాజంలో పిల్లలకు మాతృభాషపై పట్టు లేకుండా పోతోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. మాతృభాష విషయంలో విద్యార్థులకు ఉపయోగపడేలా మేధావుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. పాఠశాలల్లో మాతృభాష విషయంలో ఉన్న లోపాలను సరిదిద్దుకునేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన పిల్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందించింది.

ఆక్రమణల తొలగింపునకు ఏం చర్యలు తీసుకున్నారు?

- నీటిపారుదల శాఖ భూముల్లో ఆక్రమణలపై హైకోర్టు

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామ పరిధిలో నీటిపారుదల శాఖకు చెందిన భూముల్లో ఆక్రమణలను తొలగించేలా అధికారులను ఆదేశించాలంటూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. న్యాయవాది డి.కాశీరావు వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. ఆక్రమణల తొలగింపునకు 2014లో విజిలెన్స్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఏం చర్యలు తీసుకున్నారో వివరించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

టైగర్ నాగేశ్వరరావు చిత్ర ప్రదర్శనను అడ్డుకోండి

- హైకోర్టులో పిల్

సాక్షి, అమరావతి: రవితేజ హీరోగా నటిస్తున్న టైగర్ నాగేశ్వరరావు చిత్రం ఎరుకుల సామాజికవర్గాన్ని కించపరిచే విధంగా ఉందని, అందువల్ల ఈ చిత్ర ప్రదర్శనకు అనుమతినివ్వకుండా ఆదేశాలు జారీచేయాలని స్టువర్టుపురానికి చెందిన చుక్కా పాల్‌రాజ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

కాపు రిజర్వేషన్ వ్యాజ్యాన్ని మరో ధర్మాసనం ముందుంచండి

- రిజిస్ట్రీకి హైకోర్టు ధర్మాసనం ఆదేశం

సాక్షి, అమరావతి: ఉన్నతవర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) విద్య, ఉపాధి అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తెచ్చిన చట్టానికి అనుగుణంగా రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గతంలో తెచ్చిన చట్టాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కాపు సంక్షేమసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీమంత్రి చేగొండి హరిరామజోగయ్య దాఖలు చేసిన వ్యాజ్యంలో విచారణ నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి తప్పుకున్నారు. ఈ వ్యాజ్యాన్ని మరో ధర్మాసనం ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ మేరకు ఏసీజే జస్టిస్ శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

వారు సాధారణ పోలీసుల విధులు నిర్వర్తించడంలేదు

సాక్షి, అమరావతి: మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో దాఖలైన పలు వ్యాజ్యాలపై బుధవారం వాదనలు జరిగాయి. న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం ముందు పిటిషనర్ల తరఫు న్యాయవాది యలమంజుల బాలాజీ వాదనలు వినిపించారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల నియామకానికి, సాధారణ పోలీసుల నియామకాలకు నిబంధనలు పూర్తిగా వేరని ఆయన తెలిపారు. పోలీసు నియామక బోర్డు మాత్రమే పోలీసులను నియమించగలదని చెప్పారు. అందువల్ల మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణిస్తూ తీసుకొచ్చిన చట్ట నిబంధనలను రద్దు చేయాలని కోరారు. అయితే ఈ వాదనలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ తోసిపుచ్చారు. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పిలుస్తున్నారే తప్ప, వారు పోలీసు విధులను నిర్వర్తించడం లేదన్నారు. పోలీసు యూనిఫాం ధరించినంత మాత్రాన వారు సాధారణ పోలీసుల కిందకు రారని తెలిపారు. నిబంధనల మేరకే మహిళా పోలీసుల నియామకం జరిగిందన్నారు. ఏజీ వాదనల నిమిత్తం ధర్మాసనం తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేసింది.

మార్కెట్‌లోకి కొత్త విత్తనాలు

వరిలో నాలుగు, మినుములో రెండు, వేరుశనగ, పెసర, పొగాకులో ఒక్కొక్కటి

- విడుదల చేసిన స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది
- నూతన వంగడాలపై ఆర్బీకేల ద్వారా రైతులకు అవగాహన



కొత్తగా మార్కెట్‌లోకి విడుదల చేసిన వరి రకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రైతులకు కొత్త వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. వరిలో 4, మినుములో 2, వేరుశనగ, పెసర, పొగాకులలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 9 వంగడాలను బుధవారం వ్యవసాయ శాఖ స్పెషల్ కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మార్కెట్‌లోకి విడుదల చేశారు. వీటిని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న నెల్లూరు, బాపట్ల, తిరుపతి, మారుటేరు, నంద్యాల, గుంటూరు లాం పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వీటి ప్రత్యేకతలను ఆర్బీకేల్లో ప్రదర్శించడంతో పాటు వీటి వినియోగాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏపీ సీడ్స్ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్ బాబు, వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, డైరెక్టర్ ఆఫ్ సీడ్స్ ఎ.సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో..

టీసీజీఎస్ 1522: ఈ వంగడం కదిరి-6కు ప్రత్యామ్నాయం. తిరుపతి 4 ఎక్స్, కదిరి 9 రకాల నుంచి అభివృద్ధి చేశారు. పంటకాలం ఖరీఫ్‌లో 100 నుంచి 103 రోజులు, రబీలో 103 నుంచి 106 రోజులు. దిగుబడి హెక్టార్‌కు ఖరీఫ్‌లో 3.328 టన్నులు, రబీలో 4.031 టన్నులు. ఆకుమచ్చ, తుప్పు తెగులును కొంత మేర తట్టుకుంటుంది. కాయ నుంచి పప్పు దిగుబడి 75-76 శాతం, నూనె 48.5 శాతం, 100 గింజల బరువు 45-47 గ్రాములు, గింజలు లేతగులాబీ రంగులో ఉంటాయి. కాయలన్నీ ఒకేసారి పక్వానికి వస్తాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్, రబీ

పెసరలో..

ఎల్‌జీజీ 630: ఈ వంగడం ఎల్‌జీజీ 460, ఐపీఎం 2-14, టీఎం 96-2 రకాలకు ప్రత్యామ్నాయం. ఎల్‌జీజీ 460 ఎక్స్ పీ 109 రకాల నుంచి అభివృద్ధి చేశారు. పంట కాలం 65 నుంచి 70 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 1.60 నుంచి 1.80 టన్నులు. పల్లాకు తెగులను పూర్తిగా తట్టుకునే రకం. ఒకేసారి కోత కోయటానికి అనువైనది. గింజలు మధ్యస్థ లావుకలిగి మెరుస్తుంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు అనుకూలం.

సీజన్‌లకు అనుకూలం.

పొగాకులో..

ఏబీడీ 132(నంద్యాల పొగాకు-2): ఈ వంగడం నంద్యాల పొగాకు-1కు ప్రత్యామ్నాయం. లైన్ 3-58-38, ఎక్స్ లైన్ (190-27-5-7-32), ఎక్స్ (303-3-38-13-11-40) రకాల నుంచి అభివృద్ధి చేశారు. ఇది తక్కువ హాని కారకాలను కలిగి ఉంటుంది. కిలో ఆకు ధర రూ.85 నుంచి రూ.90 పలుకుతుంది. ఒరోబాంకీని మధ్యస్థంగా తట్టుకోవడమేకాదు.. ఆకు కోత వరకు పచ్చగా ఉండి.. అధిక వర్షపాత పరిస్థితులను తట్టుకుంటుంది. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో బీడీ పొగాకు సాగు చేసే అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్‌లో సాగుకు అనుకూలం.

మినుములో..

టీబీజీ 129: ఈ వంగడం ఎల్‌బీజీ 752కు ప్రత్యామ్నాయం. దీనిని పీయూ 31 ఎక్స్ ఎల్‌బీజీ 752 నుంచి అభివృద్ధి చేశారు. పంటకాలం 85 నుంచి 90 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 1.60 నుంచి 1.80 టన్నులు. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. గింజలు లావుగా ఉండి మెరుస్తుంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు అనుకూలం.

ఎల్‌బీజీ 904: ఈ వంగడం ఎల్‌బీజీ 752, 787, పీయూ 31, టీబీజీ 104, జీబీజీ 1 రకాలకు ప్రత్యామ్నాయం. ఎల్‌బీజీ 645 ఎక్స్ టీయూ 94-2 రకాల నుంచి అభివృద్ధి చేశారు. పంట కాలం 85 నుంచి 90 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 2.20 నుంచి 2.50 టన్నులు. పల్లాకు తెగులుతో పాటు కొంత మేర తలమాడుతట్టుకునే రకం. గింజలు మధ్యస్థ లావుకలిగి మెరుస్తుంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు అనుకూలం.

వరిలో..



నూతన వంగడాలు.. వాటి ప్రత్యేకతలు

బీపీటీ 2841: ఈ వంగడం బర్మా బ్లాక్, కాలాబట్టి సాంప్రదాయ బ్లాక్ రైస్‌కు ప్రత్యామ్నాయం. ఎంటీయూ-7029, ఐఆర్‌జీసీ 18195, ఎంటీయూ-1081 రకాల నుంచి అభివృద్ధి చేశారు. పంటకాలం 130 నుంచి 135 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 5.50 నుంచి 6 టన్నులు. అగ్గితెగులు, మెడవిరుపుతో పాటు దోమపోటును కొంతమేర తట్టుకుంటుంది. గింజలు పగిలిపోవడం తక్కువ. ముడిబియ్యానికి అనుకూలం. మధ్యస్థ సన్న గింజ రకం. కాండం దృఢంగా ఉండి చేనుపై వాలిపోదు. ఏపీలోని అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్ సాగుకు అనుకూలం.

బీపీటీ 2846: ఈ వంగడం బీపీటీ 5204కు ప్రత్యామ్నాయం. ఎంటీయూ-1061, ఐఆర్ 78585-64-2-4-3-1 రకాల నుంచి అభివృద్ధి చేశారు. పంటకాలం 140 నుంచి 150 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 6.50 నుంచి 7 టన్నులు. అగ్గితెగులు, మెడవిరుపు, దోమపోటు, ఎండాకు తెగులును కొంతమేర తట్టుకుంటుంది. కాండం దృఢంగా ఉండి చేనుపై వాలిపోదు. మధ్యస్థ సన్న గింజ రకం. నిండు గింజల శాతం ఎక్కువ. ఏపీలో కృష్ణా, సదరన్ జోన్లలో ఖరీఫ్ సాగుకు అనుకూలం.

ఎస్ఎల్ఆర్ 3238: బయో ఫోర్టిఫైడ్ స్వల్పకాలిక వరి రకమిది. బీపీటీ-5204, ఎంటీయూ 1010 రకాల నుంచి అభివృద్ధి చేశారు. పంటకాలం 120 నుంచి 125 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 6.50 నుంచి 7 టన్నులు. ఇది కూడా చేనుపై వాలిపోదు. పాలిష్ చేసిన బియ్యంలో జింక్ మోతాదు 27-72 పీపీఎంగా ఉంటుంది. బియ్యం పారదర్శకంగా ఉండి నాణ్యతతో ఉంటాయి. అగ్గితెగులు, మెడవిరుపులను కొంత మేర తట్టుకుంటుంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుకు అనుకూలం.

ఎంటీయూ 1271: ఈ వంగడం బీపీటీ 5204కు ప్రత్యామ్నాయం. ఎంటీయూ-1075, 1081 రకాల నుంచి అభివృద్ధి చేశారు. పంటకాలం 140 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 6.50 నుంచి 7 టన్నులు. దోమ, ఎండాకు తెగులును కొంత మేర తట్టుకుంటుంది. మధ్యస్థ సన్న గింజ రకం. ఇది కూడా చేనుపై వాలిపోదు. నిండు గింజల శాతం ఎక్కువ. సాగునీటి వసతులున్న లోతట్టు, అప్‌ల్యాండ్స్‌లో ఖరీఫ్ సాగుకు అనుకూలం.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి భట్టికి పితృవియోగం


తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటనారాయణ భట్టి

మదనపల్లె: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసన వెంకటనారాయణ భట్టి తండ్రి సరసన రామకృష్ణయ్య (97)బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం సొసైటీ కాలనీలోని స్వగృహంలో కన్నుమూశారు. తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు జస్టిస్ వెంకటనారాయణ భట్టి ఢిల్లీ నుంచి మధ్యాహ్నం మదనపల్లెకు చేరుకున్నారు. రామకృష్ణయ్యకు భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు సుబ్రహ్మణ్యం మదనపల్లె కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. రెండో కుమారుడు వెంకటనారాయణ భట్టి హైదరాబాద్, కేరళ హైకోర్టుల్లో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ నెల 12న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని పెద్దతోపు హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ వెంకటనారాయణ భట్టిని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా, స్థానిక న్యాయమూర్తులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హెచ్‌ఆర్సీలో సిబ్బంది నియామకానికి చర్యలు

- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ)లో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వివరణ ఇస్తూ.. కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు చేపట్టాలని మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని చెప్పారు. ఆ వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఆర్సీలో తగినంత మంది సిబ్బందిని నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించడంతో పాటు ఫిర్యాదుల స్వీకరణకు తగిన యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేసేలా చూడాలంటూ ఏపీ పౌర హక్కుల సంఘం 2021లో హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం ఏసీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది బొద్దులూరి శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

కొత్త వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు

- ఈ సంవత్సరం ప్రారంభించే 5 కళాశాలల్లో అమలు
- మొత్తం సీట్లలో 15 శాతం ఆలిండియా కోటా
- మిగిలిన వాటిలో 50 శాతం జనరల్
- 35 శాతం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు
- 15 శాతం ఎన్ఆర్ఐ కోటా
- ఈ ఫీజులతో ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటుతో వైద్య విద్యలో నూతన శకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాంది పలికారు. ఉమ్మడి రాష్ట్రానికి ముందు, తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనట్టుగా ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఈ వైద్య కళాశాలలను ప్రైవేటు కాలేజీలకు దీటుగా నిర్వహించడంలో భాగంగా ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు బుధవారం జారీ చేశారు. ఈ వైద్య కళాశాలల్లో మొత్తం సీట్లలో 15 శాతం ఆల్ ఇండియా కోటాకు కేటాయిస్తారు. మిగిలిన వాటిని మూడు విభాగాలుగా చేశారు వాటిలో 50 శాతం జనరల్ విభాగం, 35 శాతం సెల్ఫ్ ఫైనాన్స్, 15 శాతం ఎన్ఆర్ఐ కోటా కింద భర్తీ చేయనున్నారు. జనరల్ విభాగంలో ఏడాదికి రూ.15 వేలు, సెల్ఫ్ ఫైనాన్స్‌లో రూ.12 లక్షలు, ఎన్ఆర్ఐ విభాగంలో రూ. 20 లక్షలు చొప్పున ఫీజులు నిర్ణయించారు. సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ఐ సీట్ల ద్వారా వచ్చే ఫీజులను ఏపీ మెడికల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ కార్పొరేషన్ (ఏపీ మెర్క్)లో డిపాజిట్ చేస్తారు. ఈ నిధులతో ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధి చేపడతారు.

రూ.12,300 కోట్లతో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.16 వేల కోట్లతో నాడు-నేడు కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్యా రంగం రూపురేఖలు మారుస్తున్నారు. ఇందులో భాగంగా రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్న వైద్య కళాశాలల బలోపేతానికి రూ.3,820 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇలా మొత్తం రూ.12.300 కోట్లు ప్రభుత్వ వైద్య కళాశాలలకు వెచ్చిస్తున్నారు. విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాలలో నిర్మించిన నూతన కళాశాలలను ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లె, పాడేరు కళాశాలలు ప్రారంభించడానికి చర్యలు చేపట్టారు. ఈ వైద్య కళాశాలలన్నింటికీ కొత్తగా పోస్టులు మంజూరు చేశారు. మిగిలిన 7 వైద్య కళాశాలలు 2025-26లో ప్రారంభించాలని నిర్ణయించారు.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్

- ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహణ
- 4,040 సీట్లకు హాజరుకానున్న అభ్యర్థులు


నూజివీడు ట్రిపుల్‌ఐటీలో కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2023-29 సంవత్సరానికి ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు గాను ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు బుధవారం తెలిపారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి 4,,400 సీట్లు ఉండగా, ప్రత్యేక కేటగిరీ సీట్లు మినహాయించి మిగిలిన 4,040 సీట్లకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఈ నెల 13న ప్రకటించామని పేర్కొన్నారు. వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈ నెల 20, 21వ తేదీల్లో, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 21, 22వ తేదీల్లో, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 24, 25వ తేదీల్లో, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో 24, 25 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులందరూ ఉదయం ఎనిమిది గంటల కల్లా ఆయా సెంటర్లకు హాజరు కావాలన్నారు. పదో తరగతికి సంబంధించి అన్ని రకాల ఒరిజినల్ ధ్రువపత్రాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంట తెచ్చుకోవాలని చెప్పారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం సీటును కేటాయిస్తారని, సీటు పొందిన వెంటనే అడ్మిషన్ ఫీజు, రిఫండబుల్ కాషన్ డిపాజిట్ కలిపి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.3,700, మిగిలిన కేటగిరీలకు చెందిన విద్యార్థులు రూ.4,200 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

రుషికొండపై వ్యవహారాలన్నీ
ఎంవోఈఎఫ్‌కు అప్పగిస్తాం

- ప్రతిపాదించిన హైకోర్టు ధర్మాసనం
- తీవ్ర అభ్యంతరం తెలిపిన ఎస్‌జీపీ
- వ్యాజ్యాలు ఉపసంహరించుకుంటే అభ్యంతరం లేదని వెల్లడి
- విచారణ రెండు వారాలకు వాయిదా



సాక్షి, అమరావతి: రుషికొండపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాల వ్యవహారాలన్నీ కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్)కు అప్పగిస్తామని హైకోర్టు ప్రతిపాదించింది. ఈ కొండపై నిర్మాణాల నిమిత్తం చేసిన తవ్వకాలపై సర్వే చేసేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు ఎంవోఈఎఫ్ ఇప్పటికే ఓ కమిటీని ఏర్పాటు చేసిన నేపథ్యంలో నిర్మాణాల్లో ఉల్లంఘనల వ్యవహారాన్ని కూడా ఆ శాఖే చూడటం సబబని తెలిపింది. నిర్మాణాల్లో కొన్ని ఉల్లంఘనలు ఉన్నట్లు ఆ కమిటీ తేల్చిందని, అవి చిన్నవేనా లేక తీవ్రమైనవా అన్న విషయాలను ఆ శాఖే తేలిస్తే బాగుంటుందని తెలిపింది. ఈ ప్రతిపాదనలపై స్పందన తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలోని రుషికొండపై తవ్వకాలు, నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై ఏసీజే ధర్మాసనం విచారణ జరిపింది. రుషికొండపై పనుల్లో ఉల్లంఘనలు ఉన్నట్లు ఎంవోఈఎఫ్ కమిటీ తేల్చినందున, నిర్మాణాలు కొనసాగించకుండా ఆదేశాలు జారీ చేయాలని మూర్తి యాదవ్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి కోరారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఈ మొత్తం వ్యవహారాన్ని ఎంవోఈఎఫ్‌కు అప్పగిస్తామని ప్రతిపాదించింది. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. పిటిషనర్ల అభ్యర్థన మేరకే ఎంవోఈఎఫ్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ క్షేత్రస్థాయిలో సర్వే చేసి నిర్మాణాల్లో ఉల్లంఘనలు లేవని నివేదిక ఇచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. నివేదికను పరిశీలిస్తే పూర్తి వివరాలు అర్థమవుతాయన్నారు. ఈ వ్యవహారాన్ని ఎంవోఈఎఫ్‌కు పంపడం వల్ల జాప్యం తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఒకవేళ ఎంవోఈఎఫ్‌కు పంపాలనుకుంటే పిటిషనర్లు వారి వ్యాజ్యాలను ఉపసంహరించుకోవాలన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఎస్ఐ అభ్యర్థులు స్టేజ్-2 దరఖాస్తు సమర్పించాలి

సాక్షి, అమరావతి: ఎస్ఐ పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర పోలీసు నియామక మండలి తెలిపింది. తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన స్టేజ్-2 దరఖాస్తు ఫారాన్ని భర్తీచేసి ఈ నెల 21 ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 3 సాయంత్రం 5 గంటలలోగా అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. అభ్యర్థుల రిజర్వేషన్, స్థానికత, వయో పరిమితిలో సడలింపు తదితర అంశాలను పరిశీలించేందుకు ఈ దరఖాస్తు సమర్పించాలని తెలిపింది. రాష్ట్రంలో 411 ఎస్ఐ పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో 38.28 శాతం మంది అంటే 57,923 మంది అర్హత సాధించారు. మెయిన్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులకు పోలీసు నియామక మండలి విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలుల్లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనుంది. అందుకు ముందుగా వారి సర్టిఫికెట్లను పరిశీలించాలని నిర్ణయించింది. అందుకోసం అభ్యర్థులు పదో తరగతి, ఇతర విద్యార్హత, కుల, నేటివిటీ, మాజీ సైనికోద్యోగుల సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఆ ఆన్‌లైన్ అప్లికేషన్ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని ఆ కాపీతోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో దేహదారుఢ్య పరీక్షలకు హాజరు కావాలని తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించనివారిని దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పోలీసు నియామక మండలి చైర్మన్ అతుల్‌సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.


- స్టేజ్-2 దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు అభ్యర్థులు సంప్రదించాల్సిన రాష్ట్ర పోలీసు నియామక మండలి వెబ్‌సైట్ : slprb.ap.gov.in

ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు హైకోర్టు నోటీసులు

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా, వినుకొండ మండలం, బ్రాహ్మణపల్లి గ్రామంలోని వివిధ సర్వే నంబర్లలో ఉన్న 172 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూమిని మల్పూరి ఆగ్రోటెక్ లిమిటెడ్, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు చెందిన శ్రీవత్స ఫుడ్‌పార్క్ లిమిటెడ్‌లు ఆక్రమించాయంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఆక్రమణదారుల నుంచి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలంటూ వినుకొండకు చెందిన కీర్తిపాటి వెంకటేశ్వర్లు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, పల్నాడు జిల్లా కలెక్టర్ తదితరులతో పాటు మల్పూరి ఆగ్రోటెక్ యజమాని లక్ష్మణస్వామి, ఎమ్మెల్యే బ్రహ్మనాయుడులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఎంబీబీఎస్ ప్రవేశాలకు నోటిఫికేషన్

- నేటి నుంచి 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం



సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరం ప్రవేశాలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్ర కోటా కింద భర్తీచేసే ఈ సీట్లకు నీట్-2023లో ర్యాంకులు సాధించినవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి తెలిపారు. ఈనెల 20 నుంచి 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు https://ugcq.ysruhs.com వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థుల వివరాలను, సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వివరాలకు http://drysr.uhsap.inలో చూడాలని, పత్రాల అప్‌లోడ్‌లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలకు 74165 63063, 74162 53073, 90634 00820 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai - 600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943